RNI NO. TELTEL/2006/17406

**విలేకరులు కావలెను**
అన్ని జిల్లాల నుండి
నిఘానేత్రం దినపత్రికలో పని
చేయుటకు విలేకరులు
కావలెను.
ఆసక్తి కలవారు ఈ క్రింది
నంబర్‌కు సంప్రదించగలరు.
ఫోన్ - 9440090053

# నిఘానేత్రం

తెలుగు దినపత్రిక

NEEGHANETHRAM NEWS

నిజామాబాద్, హైదరాబాద్, వరంగల్, ఆదిలాబాద్ సంపుటి : 21 సంచిక : 30 పబ్లిషర్ - కోయల్‌కర్ రామ్ దయానంద్ ఆదివారం 15 సెప్టెంబర్ 2024 పేజీలు : 12 వెల : రూ. 2/-



# చక్రం తిప్పేది చంద్రబాబే!

## కేంద్ర రాజకీయల్లో క్రియాశీలక పాత్ర!

## చంద్రబాబు పరపతి పెంచే పనిలో నితీష్.. కేంద్రానికి షాక్!

కేంద్రంలో తెలుగుదేశం పార్టీ కీలక భాగస్వామి. ఎన్డీఏ 3 లో చంద్రబాబు కీలకంగా మారారు. బిజెపి తర్వాత ఎక్కువ సీట్లు దక్కించుకున్న పార్టీగా టిడిపి ఉంది. ఆ పార్టీకి 16 మంది ఎంపీలు ఉన్నారు. ఎన్డీఏ లో బిజెపి తర్వాత అతిపెద్ద పార్టీ కూడా టిడిపియే. అయితే ఐదేళ్ల వైసిపి పాలనలో చంద్రబాబు ఇబ్బంది పడ్డారు. ఎంపీల సంఖ్యాపరంగా వైసీపీకి ఎక్కువ బలం ఉండేది. టిడిపికి ముగ్గురు ఎంపీలు మాత్రమే ఉండేవారు. జగన్ పార్టీకి 22 మంది ఎంపీలు ఉన్నప్పుడు. కేంద్రంలో ఉన్న ఎన్డీఏకు ఏకపక్షంగా మెజారిటీ ఉండేది. దీంతో వైసిపి పార్లమెంట్ సభ్యుల బలం ఎందుకూ పనికిరాకుండా పోయింది. ఇప్పుడు మాత్రం సీన్ మారింది. తెలుగుదేశం పార్టీకి లభించిన 16 ఎంపీ సీట్లు ఎన్డీఏ 3కు కీలకంగా మారాయి. అందుకే కేంద్ర పెద్దల వద్ద చంద్రబాబుకు ఎనలేని గౌరవం దక్కుతోంది. మరోవైపు నితీష్ చర్యల పుణ్యమా అని చంద్రబాబు నమ్మదగిన మిత్రుడిగా మారిపోయారు. ఇది అదునుగా రాష్ట్ర ప్రయోజనాల కోసం చంద్రబాబు పావులు కదపడం ప్రారంభించారు. గత ఐదేళ్లలో చంద్రబాబు రాజకీయంగా ఎన్ని ఇబ్బందులు పడ్డారో తెలుసు. అందుకే వేసే ప్రతి అడుగు ఆచితూచి వేస్తున్నారు.

**మూడో అతిపెద్ద పార్టీ...** ఎన్డీఏలో నితీష్ నేతృత్వంలోని జెడియు మూడో అతిపెద్ద పార్టీ. ఆయనకు సైతం కేంద్రం ప్రాధాన్యమిస్తూ వచ్చింది. అయితే బీహార్ రాజకీయాలను దృష్టిలో పెట్టుకుని నితీష్ కుమార్ మైండ్ గేమ్ ఆడుతున్నారు. మళ్లీ ఆర్జెడితో స్నేహంగా మెలుగుతున్నారు. బీహార్ లోని ప్రశాంత్ కిషోర్ నేతృత్వంలోని పార్టీ ఢీకొట్టేందుకు ఆర్జెడి అవసరమని భావిస్తున్నారు.

అందుకే తరచూ లాలు ప్రసాద్ యాదవ్, తేజస్వి తో స్నేహపూర్వకంగా ఉంటున్నారు. ఆయన తీరుతో బిజెపిలో రోజురోజుకు అనుమానాలు పెరుగుతున్నాయి.

**పక్క చూపులు చూస్తున్న బిహారీ నేత...** అయితే నితీష్ పక్క చూపులు చూస్తుండడంతో ఇప్పుడు చంద్రబాబు పైనే కేంద్ర పెద్దలు ఆశలు పెట్టుకున్నారు. వాస్తవానికి చంద్రబాబును ఎన్నికల ముందు వరకు కేంద్ర పెద్దలు నమ్మలేదు. పొత్తు పెట్టుకునేందుకు కూడా ముందుకు రాలేదు. అయితే అనివార్య పరిస్థితుల్లో పొత్తు పెట్టుకున్నారు. అది సక్సెస్ అయింది. ఎన్డీఏ కు 21 ఎంపీ సీట్లు దక్కాయి. తెలుగుదేశం పార్టీ ఒంటరిగానే 16 స్థానాలను సాధించింది. ఎన్డీఏ అధికారంలోకి వచ్చేందుకు దోహద పడింది. అదే సమయంలో నితీష్ నేతృత్వంలోని జేడియు 12 ఎంపీ సీట్లను సాధించింది.

దీంతో చంద్రబాబుతో పాటు నితీష్ కు ఎనలేని ప్రాధాన్యం దక్కింది. కానీ గత అనుభవాల దృష్ట్యా చంద్రబాబు ఎక్కువ రోజులు ఎన్డీఏతో ట్రావెల్ చేయలేరని భావించారు. కానీ ఎక్కడా వివాదాలు పెట్టుకోకుండా చంద్రబాబు రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఎక్కువగా పరితపిస్తున్నారు. రాజకీయ ప్రయోజనాలను పక్కన పెట్టారు.

**తరచూ కూటముల మార్పు...** చంద్రబాబుతో పాటు నితీష్ కుమార్ సైతం సీనియర్. కానీ తరచు కూటమిలు మారుతారని ప్రచారం ఉంది. కానీ చంద్రబాబు విషయంలో అలా కాదు. 2014 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన తరువాత చంద్రబాబు వైసీపీ ట్రాప్ లో పడ్డారు. ఎన్డీఏకు దూరమయ్యారు. వైసిపి ఎన్డిఏ కు దగ్గర అయినా ఆ కూటమిలో మాత్రం చేరలేదు. గత ఐదేళ్లుగా వైసిపి బిజెపికి దగ్గరగా ఉండేది. కానీ రాష్ట్ర ప్రయోజనాల కోసం పట్టు పట్టలేదు. రాజకీయంగా ఇబ్బందులు రాకుండా చూసుకుంది. కానీ చంద్రబాబు ఎన్డీఏ లో కీలక భాగస్వామి అయ్యారు. రాజకీయ ప్రయోజనాల కంటే రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఎన్డీఏ పై ఒత్తిడి తెస్తున్నారు. ఇంకోవైపు నితీష్ ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. దీంతో కేంద్ర పెద్దలు చంద్రబాబుకు మరింత ప్రాధాన్యం ఇవ్వడం చేస్తున్నారు. మొత్తానికి అయితే నితీష్ చర్యల పుణ్యమా అని చంద్రబాబు పరపతి కేంద్రం వద్ద అమాంతం పెరుగుతోంది.




బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి 28 వేల క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.50) టీఎంసీలు కాగా శుక్రవారం సాయంత్రానికి ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో నిండింది. కాకతీయ కాల్వకు నీటి విడుదల నిలిపి వేసిన ఆఫీసర్లు ఎస్కేప్ గేట్ల ద్వారా 8 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. కాకతీయ కాల్వకు నీటి విడుదల నిలిపివేయడంతో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. వరద కాల్వ హెడ్ రెగ్యులేటర్ ద్వారా 19 వేల క్యూసెక్కులు, సరస్వతీ కాల్వకు 400, లక్ష్మీ కాల్వకు 150 క్యూసెక్కులు, మిషన్ భగీరథ కోసం 231 క్యూసెక్కులు వదులుతున్నారు. ఈ సీజన్‌లో ఎగువ నుంచి ప్రాజెక్ట్‌కు 176.92 టీఎంసీల నీరు రాగా ఇప్పటివరకు 103.82 టీఎంసీల నీటిని బయటకు విడుదల చేసినట్లు ప్రాజెక్ట్ ఆఫీసర్లు చెప్పారు.

# ఈ నెల 20న తెలంగాణ కేబినెట్ సమావేశం.. హైడ్రాపై చర్చ..



తెలంగాణ కేబినెట్ సమాశానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 20న తెలంగాణ కేబినెట్ సమావేశం జరగనుంది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ సమావేశం ఈ నెల 20న సాయంత్రం 4 గంటలకు క్యాబినెట్ సమావేశం నిర్వహించనున్నారు. తెలంగాణ కేబినెట్ లో ముఖ్యంగా బీసీ రిజర్వేషన్ల అంశంలో కోర్టు తీర్పుపై, హైడ్రాకు చట్టబద్ధత అంశం, అలాగే 2 లక్షల రుణాల మాఫీ చెల్లింపు, 200 గ్రామ పంచాయతీల ఏర్పాటు, ఆర్డినెన్సు రైతు భరోసాపై కేబినెట్ లో చర్చించనున్నారు. వీటిపై చర్చించి విధి విధానాలపై ఖరారు చేయనున్నారు. కేబినేట్ సమావేశానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు అధికారులు. అయితే హైడ్రాపై ప్రజల్లో విమర్శలు వస్తున్న నేపథ్యంలో.. కేబినెట్ ఎలాంటి నిర్ణయం తీసుకున్నారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. కాగా సచివాలయంలో మున్సిపల్ పాలనపై నిన్న అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే.. తెలంగాణలో ట్రాఫిక్ నియంత్రణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. ట్రాఫిక్ స్ట్రీమ్ ను లైవ్ చేయడంలో ట్రాన్స్ జెండర్లను వాలంటీర్లుగా ఉపయోగించుకోవాలని ఆయన ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయమై అధికారులతో చర్చించినట్లు సమాచారం. ఇటీవలి కాలంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. డ్రైవర్ల నిర్లక్ష్యం, మితిమీరిన వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ఎంతో మంది అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఎంత కఠినంగా అమలు చేస్తున్నా వాహనదారులలో మాత్రం మార్పు రావడం లేదు.

చలాన్లు, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ ఎవరైనా తప్పులు చేస్తూనే ఉన్నారు. దీంతో ట్రాఫిక్ నియంత్రణపై ట్రాఫిక్ స్ట్రీమ్ ను లైవ్ చేయడంలో ట్రాన్స్ జెండర్లను వాలంటీర్లుగా ఉపయోగించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి యోచిస్తున్నట్లు తెలుస్తుంది.

# ఓడిన చోటే నెగ్గాలని..

## జీహెచ్‌ఎంసీలో మారుతున్న రాజకీయ పరిణామాలు..

## అంట్లుంటది మరి రేవంత్‌తోని..!



హైదరాబాద్ : తెలంగాణలో ప్రతిపక్షాలు లేకుండా.. తనను ప్రశ్నించే వారు లేకుండా చేయాలన్న సంకల్పంతో కేసీఆర్.. కాంగ్రెస్, టీడీపీ, వైసీపీ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారు నాటి ముఖ్యమంత్రి కేసీఆర్. తను ఒక రాజులా రాష్ట్రాన్ని పాలించారు. 2001లో తెలంగాణ రాష్ట్ర సమితి ప్రారంభించిన సమయంలో తెలంగాణలో ఆ పార్టీకి పెద్దగా ఊపు రాలేదు. కానీ, కేసీఆర్ ప్రాంతీయ వాదాన్ని అడ్డు పెట్టుకుని రాష్ట్ర వ్యాప్తంగా పార్టీని బలోపేతం చేశారు. తరచూ ఉప ఎన్నికలు తెస్తూ.. పార్టీ తరపున పోటీ చేసేవారిని గెలిపించేందుకు తెలంగాణ సెంటిమెంటు, ఆంధ్రా, తెంగాణ ప్రాంతీయవాదాన్ని రెచ్చగొట్టేవారు. ఇక జీహెచ్‌ఎంసీలో అయితే.. నాటి టీఆర్ఎస్‌ను ఎవరూ పట్టించుకునేవారు కాదు. తెలంగాణ రాష్ట్రం సాధించే వరకు కూడా ఇదే పరిస్థితి. తెలంగాణ వచ్చాక కూడా జీహెచ్‌ఎంసీ బయటనే బీఆర్ఎస్ ఎమ్మెల్యే సీట్లు గెలిచింది. దీంతో జీహెచ్‌ఎంసీలో పట్టు సాధించేందకు కేసీఆర్ వ్యూమాత్మకంగా వ్యవహరించారు. సెటిలర్లను తనవైపు తిప్పుకునేందుకు కేసీఆర్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆక్రమణలపేరుతో కూల్చివేతలు చేపట్టారు. కొన్ని ఎంపిక చేసిన ప్రాంతాల్లో కూల్చివేయించారు. దీంతో ఒక్కసారిగా గ్రేటర్ పరిధిలోని సెటిలర్లు కేసీఆర్‌ను కలిశారు. ఆయనతో కలిసి పనిచేసేందుకు ముందుకు వచ్చారు. టీఆర్ఎస్‌లో చేరికలు పెరిగాయి. దీంతో జీహెచ్‌ఎంసీలో టీఆర్ఎస్‌కు పట్టు పెరిగింది.

**రేవంత్ కూడా అదే వ్యూహంతో..** ఇప్పుడు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కూడా మాజీ సీఎం కేసీఆర్ లాంటి వ్యూహాన్నే అమలు చేస్తున్నారు. మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్‌కు జీహెచ్‌ఎంసీ పరిధిలో ఒక్క సీటు కూడా రాలేదు. బీఆర్ఎస్ 16 సీట్లు గెలిచింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ఓటు బ్యాంకును కొల్లగొట్టేందుకు రేవంత్ హైడ్రాను రంగంలోకి దించారు. ఆక్రమణల పేరుతో కూల్చివేతలు మొదలు పెట్టారు. ఇందులో ప్రధానంగా బీఆర్ఎస్ నేతలు, లీడర్లవే ఎక్కువగా ఉన్నాయి. దీంతో చాలా మంది గులాబీ నేతలు బీఆర్ఎస్‌ను వీడేందుకు సిద్ధమవుతున్నారు. రేవంత్‌తో కలిసి పనిచేసేందుకు ముందుకు వస్తున్నారు.

**గాంధీ ఎపిసోడ్‌తో మరింత ఊపు..** వెతకబోయిన తీగ కాలికి తగిలినట్లు.. సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో పట్టు కోసం చేస్తున్న ప్రయత్నాలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చేసిన ప్రాంతీయ వాద వ్యాఖ్యలు కాంగ్రెస్‌కు అస్త్రంగా మారాయి. హైదరాబాద్‌లోని సెటిలర్లను బతకడాడనికి వచ్చిన వారు అని కౌశిక్ అనడంతో దానిని కాంగ్రెస్ తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం మొదలు పెట్టింది. ఈ వ్యాఖ్యలపై ఆంధ్రా వాళ్ల ఓట్లు కవాలి కానీ, ఆంధ్రా ప్రజలు వద్దా అని మండిపడ్డారు. హైదరాబాద్ ఓటర్లు తాయిలాలకు తలొగ్గరు. భావోద్వేగ అంశం ముఖ్యం. అందుకే కేసీఆర్ తాను ఉన్నానని భరోసా ఇచ్చేలా కొన్ని పరిణామాలు సృష్టించారు. దాంతో మెజార్టీ ఓటర్లు ఆయన వైపు మొగ్గారు. ఇప్పుడు బీఆర్ఎస్ నాయకులు చేసిన వ్యూహాత్మక తప్పిదం.. రేవంత్‌కు అస్త్రంగా మారింది. దీంతో మాజీ సీఎం కేసీఆర్ ప్లాన్‌ను ఈజీగా అమలు చేసేశారు. శాంతి భద్రతల సమస్య గురించి మాట్లాడారు. అంతే కానీ ప్రతీకారం తీర్చుకోవాలని ఆశపడలేదు. పాడి కౌశిక్‌రెడ్డి, అరికెపూడి గాంధీ ఇష్యూను సెటిలర్లతో సంబంధం ఉన్న అంశంగా మార్చారు.

**సరిదిద్దు కునే ప్రయత్నంలో బీఆర్ఎస్..** ఈ అంశంపై బల్బ్ వెలిగే సరికి బీఆర్ఎస్‌కు నష్టం జరిగింది. దీంతో ఇప్పుడు దానిని సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తుంది బీఆర్ఎస్. రేవంత్‌ను ఇప్పటికీ బీఆర్ఎస్ వ్యూహకర్తలు తక్కువగా అంచనా వేస్తున్నారు.

అందుకే ఇలాంటి వ్యూహాత్మక తప్పిదాలు జరుగుతున్నాయి. రేవంత్‌రెడ్డి గ్యారంటీల అమలునుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి ఇలాంటి డ్రామాలు ఆడుతున్నారని విమర్శలు చేస్తూనే వాటిలో భాగమవుతున్నారు. అంటేం రేవంత్ వాళ్లకు చాయిస్ లేకుండా చేస్తున్నారని సులువుగా అర్థం చేసుకోవచ్చు.




## ఖైరతాబాద్ మహాగణపతి దర్శనానికి పోటెత్తిన భక్తులు.. రద్దీగా మెట్రో స్టేషన్

హైదరాబాద్ : ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. ఖైరతాబాద్ గణేశుడి దర్శనానికి ఎల్బీనగర్, మియాపూర్ నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తుండటంతో మెట్రో స్టేషన్ పరిసరాలు సందడిగా మారాయి.

వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో ఖైరతాబాద్ గణేశుడికి భక్తుల తాకిడి పెరిగింది. దీంతో మెట్రో రైలు యాజమాన్యం భక్తులకు ఎలాంటి ఇబ్బందికలగకుండా ఏర్పాట్లు చేస్తోంది. టికెట్ కౌంటర్లు, ఎగ్జిట్ గేట్ల వద్ద రద్దీ పెరగకుండా తగిన చర్యలు చేపట్టింది. క్యూఆర్ కోడ్ టికెట్లకు, కార్డ్ ద్వారా వెళ్లే ప్రయాణికులను వేర్వేరుగా పంపిస్తోంది. స్టేషన్ లోపల ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ ద్వారా ముందస్తుగానే టికెట్లు బుక్ చేసుకోవాలని, కార్డులో సరిపడా డబ్బులు లేకపోతే ఎంట్రీ స్టేషన్‌లో రీఛార్జ్ చేసుకోవాలని ప్రయాణికులకు సూచిస్తున్నారు. ఖైరతాబాద్ మెట్రో స్టేషన్‌లో ఉదయం నుంచి గంట గంటకు రద్దీ పెరుగుతుండటంతో మెట్రో యాజమాన్యం అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసింది.
భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. టికెట్ కౌంటర్లు, ఎంట్రీ, ఎగ్జిట్ గేట్లతోపాటు ఫ్లాట్ ఫాం వద్ద భద్రతా సిబ్బంది ప్రయాణికులకు తగిన సూచనలు చేస్తున్నారు.

## బాధ్యతగల ఎమ్మెల్యేలు బజారున పడి తన్నుకోవడం బాధ కలిగించింది: భట్టి



కరీంనగర్: బాధ్యతగల ఎమ్మెల్యేలు బజారున పడి తన్నుకోవడం బాధ కలిగించిందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. శనివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా పర్యటన సందర్భంగా.. ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, అరెకపూడి గాంధీ వ్యవహారంపై స్పందించారు. ఎమ్మెల్యేలు రోడ్డెక్కి కొట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ప్రభుత్వం ఏం చేయాలో అది చేస్తుందన్నారు. "ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాన్ని గౌరవించాలని ఉ పేక్షించాం. గత భారాస ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది. ప్రతిపక్ష హోదా లేకుండా సీఎల్పీ సీటును సైతం గుంజుకున్నారు. వాళ్ల మాదిరిగా మేము ప్రవర్తించడం లేదు. అసెంబ్లీలో ప్రతిపక్షం గొంతు వినిపించాలని కోరుకుంటున్నాం. ప్రతిపక్ష నేతలంటే మాకు గౌరవం ఉంది. అసెంబ్లీలో అధికార పార్టీ ఎవరో.. ప్రతిపక్ష పార్టీ ఎవరో స్పీకర్ వెల్లడించారు. శాంతిభద్రతలు కాపాడటం మా ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత. భాజపా ఉనికి కోసం రాజకీయ డ్రామాలు ఆడుతోంది" అని భట్టి విక్రమార్క విమర్శించారు.

## తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన పోచారం



హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ శాఖ సలహాదారుగా పోచారం శ్రీనివాసరెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించారు. నాంపల్లి పబ్లిక్ గార్డెన్ ఉద్యానవన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కేశవరావు, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. పోచారం శ్రీనివాసరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. దేశానికి, రాష్ట్రానికి రైతే వెన్నుముక... అలాంటి రైతు కష్టాలను తీర్చేలా ప్రభుత్వం, అధికారులు కృషి చేయాలని పోచారం కోరారు. వ్యవసాయదారుడు దేశానికి అన్నం పెట్టేవాడని, ఆయనను సరిగ్గా చూసుకుంటే దేశ ప్రగతి సుభిక్షంగా ఉంటుందన్నారు. ఆర్థిక పరిస్థితులు సరిగ్గా లేకపోయినా.. రైతుల సంక్షేమం కోసం రుణమాఫీ, రైతు భరోసా పథకాలు, ప్రాజెక్టులు పూర్తి వంటి వాటికి సీఎం రేవంత్ రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రిగా పని చేసిన అనుభవంతో సలహాలు ఇస్తూ వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

## హరీష్‌రావుపై మంత్రి కోమటిరెడ్డి సంచలన ఆరోపణలు

నల్గొండ: మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావుపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. శ్రీజ పాల ఉత్పత్తి కేంద్రం హరీష్‌రావు బినామీ అని.. ఆ పేరుతో ఆయన చేసిన మోసాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని ఆరోపించారు. నల్గొండ, రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల మదర్ డైరీ ఎన్నికలు ఈరోజు(శనివారం) జరిగాయి. ఈ ఎన్నికల్లో గుడిపాటి మధుసూదన్ రెడ్డి మదర్ డైరీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. చైర్మన్‌గా ఎంపికైన మధుసూదన్ రెడ్డికి, ఈ ఎన్నికలో గెలిచిన ఆరుగురు డైరెక్టర్లకు ఎన్నికల అధికారితో కలిసి సర్టిఫికెట్‌లను మంత్రి కోమటిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మీడియాతో మాట్లాడుతూ... ఈ ఎన్నికల్లో 6కు 6 స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలిచిందని తెలిపారు.. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. ఉమ్మడి నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లో అన్ని ప్రభుత్వ స్కూళ్లు, హాస్టళ్లు, హాస్పిటళ్లకు మదర్ డైరీ పాలు సరఫరా చేయాలని... ఆ రెండు జిల్లాల కలెక్టర్లకు మంత్రి కోమటిరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మదర్ డైరీ పాలు ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను మంత్రి కోమటి రెడ్డి కోరారు. యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి మదర్ డైరీ నుంచే లడ్డూల తయారీకి అవసరమయ్యే



నెయ్యిని అందజేయాలని మంత్రి కొండా సురేఖకు తెలిపారు. దీంతో పాటు బీఆర్ఎస్ ప్రభుత్వంలో జారీ చేసిన పాత జీవోను వెంటనే రద్దు చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. యాదగిరిగుట్ట, వేములవాడ దేవస్థానాలకు లడ్డూల తయారీకి మదర్ డైరీ నుంచి నెయ్యి తరలింపును వెంటనే ప్రారంభించాలని మంత్రి కొండా సురేఖను కోరారు ఇలా చేయడం ద్వారా రూ. 60 కోట్ల అప్పులో ఉన్న మదర్ డైరీ అప్పును త్వరగా తీర్చే అవకాశం ఉందని అన్నారు. బర్లు, గొర్లలోనే కాకుండా పాల ఉత్పత్తిలోనూ బీఆర్ఎస్ ప్రభుత్వం దోపిడీ చేసిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం మదర్ డైరీ అభివృద్ధికి కృషి చేస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.

## హైడ్రాకు చట్టబద్ధత కల్పిస్తూ త్వరలోనే ఆర్డినెన్స్: రంగనాథ్

హైదరాబాద్: జీవో 99 ద్వారా జులై 19న హైడ్రా ఏర్పాటు చేశారని కమిషనర్ రంగనాథ్ తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "హైడ్రా చట్టబద్ధతపై కొందరు ప్రశ్నిస్తున్నారు.. ఇది చట్టబద్ధమైనదే. కార్యనిర్వాహక తీర్మానం ద్వారానే ఏర్పాటు చేశారు. దీనికి చట్టబద్ధత కల్పిస్తూ అక్టోబర్ నెల లోపు ఆర్డినెన్స్ రానుంది. విశేష అధికారాలు కూడా రాబోతున్నాయి. 6 వారాల తర్వాత అసెంబ్లీలో హైడ్రా బిల్లు వస్తుంది. మున్సిపాలిటీలు, నీటిపారుదల, రెవెన్యూ శాఖలకు సహకారం అందిస్తాం. గ్రేహౌండ్స్, టాస్క్‌ఫోర్స్ తరహాలో హైడ్రా పనిచేస్తుంది" అని రంగనాథ్ తెలిపారు.



## హైదరాబాద్‌లో భారీగా గంజాయి స్వాధీనం



హైదరాబాద్: నగరంలోని పెద్ద అంబర్‌పేట్ ప్రాంతంలో భారీగా గంజాయిని ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్నారన్న సమాచారంతో దాడులు చేసి పట్టుకున్నామని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ఖురేషి చెప్పారు. "నిందితుల కదలికలను చాలా రోజులుగా గమనించాం. పక్కా సమాచారంతో 170 కిలోల గంజాయి సీజ్ చేశాం. ఈ ముఠాలో ఎనిమిది మందిని అరెస్టు చేశాం. నిందితులు అందరూ మహారాష్ట్రలోని ఒకే గ్రామానికి చెందిన వారు. గంజాయి సరఫరా చేయడానికి వాహనాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్నారు. ఈ వాహనానికి ముందు మరొక వాహనంతో ఎస్కార్ట్‌గా వెళ్తున్నారు. మల్కాన్‌గిరి ప్రాంతంలో ఈ గంజాయిని ప్యాక్ చేసి మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు విచారణలో తెలింది. ఈ ముఠాలో ఇస్మాయిల్ అనే వ్యక్తి ప్రధాన నిందితుడుగా ఉన్నట్లు గుర్తించాం. పట్టుబడ్డ గంజాయి విలువ రూ. 34 లక్షలు ఉంటుంది. ఈ కేసులో నిందితుల నేర చరిత్రను బట్టి పీడీ యాక్ట్ పెడతాం" అని వివరించారు.




ఓ విద్యార్థిని టీచర్ వేధించింది. వాష్ రూమ్ వెళ్లినా సరే నరకయాతన చూపించింది. ఆ టీచర్ గురించి విద్యార్థిని పేరెంట్స్‌కు చెప్పుకోలేదు. కంప్లైంట్ చేస్తే ఎక్కువ టార్చర్ పెడుతోందని భయపడింది. వేధింపులు తాళలేక హాస్టల్ భవనంపై నుంచి దూకింది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా మద్దిరాలలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో జరిగింది. ఘటన జరిగిన తర్వాత విద్యార్థిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు. వాష్ రూమ్‌లో కాలు జారి పడిందని అబద్ధాలు చెప్పారు. ఏం జరిగిందని విద్యార్థిని ఆరా తీయడంతో అసలు విషయం తెలిసింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి వద్దకు కలెక్టర్ వచ్చి, పరామర్శించారు.

## రెచ్చిపోయిన కేటీఆర్.. సీఎం రేవంత్‌పై తీవ్ర వ్యాఖ్యలు..




హైదరాబాద్, సెప్టెంబర్ 14: మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రెచ్చిపోయారు. సీఎం రేవంత్ రెడ్డిపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో అసమర్థుడి జీవన యాత్రలా రేవంత్ పాలన నడుస్తోందని విమర్శించారు. అమెరికా నుంచి హైదరాబాద్ తిరిగొచ్చిన కేటీఆర్.. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేటీఆర్.. సీఎం రేవంత్ రెడ్డి, అరికెపూడి గాంధీలపై ఘాటైన పదజాలంతో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ప్రతి వర్గాన్ని మోసం చేసిన ఘన రేవంత్ రెడ్డికే దక్కుతుందన్నారు. తాము అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పే దమ్ము లేక రేవంత్ తొత్తులు చిల్లర ఎత్తుగడలు వేస్తున్నారని మండిపడ్డారు. సీఎం స్వయంగా ఎమ్మెల్యేల ఇళ్లకు వెళ్లి కండువాలు కప్పారని కేటీఆర్ గుర్తు చేశారు. సోషల్ మీడియాలో కాంగ్రెస్‌లో చేరినట్లు ప్రచారం చేసుకుని.. హైకోర్టు తీర్పు తరువాత స్వరం మార్చారని విమర్శించారు. రాష్ట్రంలో తొమ్మిది నెలలుగా ఒక వైపు హెడ్ లైన్ మేనేజ్‌మెంట్ చేస్తున్నారని.. మరోవైపు డెడ్‌లైన్‌లను దాటవేస్తూ గారడి మాటలు చెబుతున్నారని రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ విమర్శలు గుప్పించారు.

**కేటీఆర్ కామెంట్స్ యధావిధిగా..** '6 గ్యారెంటీలు అని సన్నాయి నొక్కులు నొక్కారు.. 2లక్షల ఉద్యోగాల పేరిట యువతను మోసం చేశారు.. రుణమాఫీ పేరున రైతులను మోసం చేశారు.. అటెన్షన్ డైవర్షన్ కోసమే రేవంత్ రోజుకో ఇష్యూను తెరపైకి తెస్తున్నారు. బజారు మాటలు, చిల్లర మాటలు, చిల్లర వేశాలు. రాజకీయాలు అంటేనే ప్రజలకు అసహ్యం వేసేలా చేస్తున్నారు. ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యేలను కలిసి బ్రతిమాలుకుని ఆయనే కండువా కప్పుతారు. సామ, ధాన, భేద దండోపాయాలు ఉపయోగించి పార్టీలో చేర్చుకుంటారు. ఆయనే ఎమ్మెల్యేల కాళ్ళు పట్టుకుని ఆయనే చేర్పించుకుంటారు. 10 మంది పోయారు అని, గేట్లు తెరిచామని మాటలు మాట్లాడారు. కోర్టు తీర్పు తర్వాత మళ్ళీ మాట మార్చారు. ఫిరాయింపులకు పాల్పడే వారి పదవి పోతదనే భయం పట్టుకుంది.' అని వ్యాఖ్యానించారు. 'స్పీకర్ మీరు తప్పు చేస్తున్నారని ముందే చెప్పాం.. ఫిరాయింపు దారులపై కౌశిక్ రెడ్డి, జగదీష్ రెడ్డి, వివేకానందలు కోర్టులో కేసు వేశారు. కౌశిక్ రెడ్డి ఏం తప్పు మాట్లాడాడు. నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని కోర్ట్ చెప్పింది. హై కోర్టు తీర్పు వల్ల ప్రజాస్వామ్యాన్ని గౌరవించారు. దమ్ముంటే రండి అన్నారు. ప్రజాక్షేత్రంలో తేల్చుకుందాం అన్నారు. అదేం తప్పు? సీఎం రేవంత్ రెడ్డి గతంలో రాళ్లతోని కొట్టి చంపండి అన్నారు.. ఉరి తీయాలి అన్నారు.. ఆయన లాగా ఎవరు మాట్లాడలేదు. పార్టీ మారిన గాంధీని పీఏసీ చైర్మెన్‌గా నియమించారు. ఆయన ఏ పార్టీలో ఉన్నారని అడిగారు. అందులో తప్పేముంది? పదవి పోతుందని ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారని చెబుతున్నారు.' అని కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. 'గుండాలతో దాడి చేశారు. రూమ్ అద్దాలు పగలగొట్టారు. ఏమైనా అయితే ఎవరు బాధ్యులు? ఈ దాడికి ముఖ్యమంత్రే బాధ్యత వహించాలి. ఫ్యాక్షన్ సినిమాను తలపించారు. చేతగాని సీఎం, హోం మంత్రి వల్లనే ఇలా జరిగింది. లా అండ్ ఆర్డర్ కంట్రోల్ చేయలేని అసమర్థ ముఖ్యమంత్రి. సీఎంగా ఆయన చేసిందేమీ లేదు. రాష్ట్రంలో శాంతి భద్రతలు ఎక్కడ ఉన్నాయి. కౌశిక్ రెడ్డే కాదు నేను కూడా అడుగుతున్నా.. గాంధీ నువ్వు అసలు ఏ పార్టీలో ఉన్నవ్? ఆ 10 మంది ఎమ్మెల్యేలు కూడా ఏ పార్టీలో ఉన్నారో సమాధానం చెప్పాలి? 6 గ్యారంటీలు ఎక్కడ? హైడ్రా పేరిట హైడ్రామా చేస్తున్నారు. చరిత్రలో నీలాంటి పనికిమాలిన ముఖ్యమంత్రి ఎవరూ ఉండరు. రేవంత్ నీకంటే ముందు చాలా మంది ముఖ్యమంత్రులు వచ్చారు. నువ్వు చిట్టి నాయుడివి.. నీలాంటి బుల్లబ్బాయిలను చాలా మందిని చూశాము. నువ్వు ఏం చేయలేవు. పదవి ఎవరికీ శాశ్వతం కాదు. నీ దుష్ట సంప్రదాయాలు కచ్చితంగా నిన్ను చుట్టుకుంటాయి.' అని వార్నింగ్ ఇచ్చారు. 'పోలీసులను వదిలి పెట్టం. న్యాయపరంగా పోరాడుతాం. ఏసీపీ, సీఐలను సస్పెండ్ చేయాలి. రేవంత్ రెడ్డి.. నువ్వు ఎన్ని డ్రామాలు ఆడినా నిన్ను వదిలిపెట్టం. ఎక్కడ ఇలాంటి సంఘటన జరిగినా మేము అండగా ఉంటాం. పార్టీ శ్రేణులకు మేమున్నాం. సీఎం సొంత జిల్లాలోనే చుక్కలు చూపెట్టాం. ఈ ప్రభుత్వానికి పాలమూరు పౌరుషం చూపెట్టాం. మా నాయకులను హౌస్ అరెస్ట్ చేశారు. ప్రాంతీయ తత్వం పేరున ఎక్కడా ఎలాంటి దాడులు, మాటలు లేవు. ఈ పనికి మాలిన సీఎం నాయకత్వంలో ఇలాంటివి జరుగుతున్నాయి. నువ్వే రెచ్చగొడుతున్నావు. హైదరాబాద్ ప్రజలు మమ్మల్ని కడుపు నిండా ఆశీర్వదించారు. హైదరాబాద్ ప్రజల మీద రేవంత్ పగబట్టారు. ప్రాంతీయ తత్వం కానీ, విబేధాలు కానీ లేవు. గాంధీ బజారు భాష మాట్లాడాడు. రాజకీయాల్లో కామెడీ గాళ్లు ఎక్కువయ్యారు. రూ. 9500 కోట్లతో అభివృద్ధి చేశామని చెప్పావు కదా మరి ఇప్పుడు చేస్తావా? దిక్కుమాలిన పీఏసీ పదవి కోసం దిక్కుమాలిన మాటలు ఎందుకు? ప్రజలు ఏ పార్టీలో ఉన్నారు అని చెబితే ఆయనది అదే పార్టీ అవుతుంది.' అని కేటీఆర్ అన్నారు.

## పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు భారాస మంత్రి పదవులు ఇవ్వలేదా?: మంత్రి పొన్నం



హైదరాబాద్: ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టింది భారాస కాదా అని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. హైదరాబాద్ వాసులను కాంగ్రెస్ ఏనాడూ విమర్శించలేదన్నారు. ఆంధ్రా ప్రజలను గతంలో కేసీఆర్ దారుణంగా విమర్శించారని ఆరోపించారు. భారాస పని అయిపోయిందని సొంత పార్టీ నేత అరెకపూడి గాంధీ అంటున్నారని చెప్పారు. ప్రాంతీయతను రాజకీయంగా వాడుకునేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. "అరెకపూడి గాంధీ, కౌశిక్‌రెడ్డి ఇద్దరూ చేసింది తప్పే. భౌతిక దాడులు మంచివి కాదు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రతిపక్షం వ్యవహరిస్తోంది. శాంతి భద్రతల అంశంలో కఠినంగా వ్యవహరిస్తాం. పార్టీ ఫిరాయింపులను మేం ఎక్కడా ప్రోత్సహించలేదు. భారాస గతంలో తెదేపా, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను చేర్చుకుంది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు భారాస మంత్రి పదవులు ఇవ్వలేదా?" అని పొన్నం ప్రశ్నించారు.

## యుద్ధ ప్రాతిపదికన కాలువ మరమ్మతులు చేపట్టాలి: మంత్రి పొంగులేటి

కూసుమంచి: పాలేరు ఏటి ఉద్ధృతికి ధ్వంసమైన కట్టడాలను, గండిపడిన కాలువల మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని చేపట్టాలని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. కూసుమంచి మండలంలోని పాలేరు జలాశయం వద్ద సాగర్ ఎడమ కాలువకు పడిన భారీ గండిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నీటి విడుదలకు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వారంలోగా జిల్లాలో పంటలకు సాగునీరు అందించే ఏర్పాటు, పత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని జుజ్జులరావుపేట ప్రాంతంలో రహదారిని మంత్రి పొంగులేటి శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో మంత్రి వెంట జిల్లా జన వనరుల శాఖ అధికారులు ఉన్నారు.



## యాదాద్రిలో ఘనంగా ఏకాదశి ఆరాధనలు



యాదగిరిగుట్ట: యాదాద్రి క్షేత్రంలో శనివారం ఏకాదశి ఆరాధనగా లక్ష పుష్పార్చన నిర్వహించారు. ప్రధాన ఆలయంలోని మహాముఖ మండపంలో యజ్ఞ మూర్తులను కొలుస్తూ, లక్ష పుష్పాలతో ఆరాధించారు. నిత్య పూజలు, కల్యాణ పర్వం, అలంకార సేవోత్సవాలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. గర్భగుడిలో మూలవరులకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు.
ఈ క్రతువులో ఆలయ ఈవో భాస్కరరావు, భక్తులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## మమత నిర్వేదం... రాజీనామా రాగం

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నోట తొలిసారి రాజీనామా మాట వచ్చింది. ఆమె 2011 నుంచి ఆ రాష్ట్ర ముఖ్య మంత్రిగా ఉంటూ వస్తున్నారు. ఇప్పటికి 13 ఏళ్ళుగా ఆమె ఆ పదవిలో ఉన్నారు. హ్యాట్రిక్ లేడీ సీఎం గా కూడా రికార్డు క్రియేట్ చేశారు. పశ్చిమ బెంగాల్ లో ఇటీవల జరిగిన లోక్ సభ ఎన్నికల్లో సైతం బీజేపీని వెనక్కి నెట్టి ఎక్కువ ఎంపీ సీట్లను తృణమూల్ కాంగ్రెస్ గెలుచుకుంది. అటువంటి మమతా బెనర్జీకి జూనియర్ డాక్టర్ల నిరసనలు సెగ రేపేలా ఉన్నాయి. కోల్‌కతాలో ఆర్‌జి కర్ మెడికల్ ఆసుపత్రిలో వైద్య విద్యార్థినీ హత్యాచారానికి గురైన దారుణ ఘటనను నిరసిస్తూ జూనియర్ డాక్టర్లు అక్కడ చాలా కాలంగా నిరసనలు చేస్తున్నారు. ఈ ఘటన ఆగస్ట్ 9 న జరిగింది. నాటి నుంచి నేటి వరకూ మమత ప్రభుత్వాన్ని ఈ ఆందోళలను గుక్క తిప్పుకోనీయడం లేదు. జూనియర్ డాక్టర్లు తాము చేస్తున్న ఆందోళన విరమించాలని చర్చలకు రావాలని మమతా బెనర్జీ సీఎం హెూదాలో ఇచ్చిన పిలుపును సైతం వారు పట్టించుకోవడం లేదు. వరసగా మూడో రోజు కూడా ముఖ్యమంత్రి చర్చలకు సిద్ధంగా ఉన్నా అవతల వైపు నుంచి వైద్య సంఘాల నుంచి ప్రతినిధులు ఎవరూ హాజరు కాకుండా షాక్ ఇచ్చారు. దాంతో వైద్యులతో చర్చలు జరపడంలో మమత ప్రభుత్వం విఫలం చెందింది అని అంటున్నారు. అదే సమయంలో పశ్చిమ బెంగాల్ లో చీకటి అంతా ఉందని జూనియర్ డాక్టర్లు పేర్కొనడం విశేషం. ఈ మేరకు వారు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి, ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఈ లేఖ కాపీని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్, కేంద్ర ఆరోగ్యశాఖా మంత్రి జెపి నడ్డాకు కూడా పంపారు. తమ సహచర జూనియర్ డాక్టర్‌ని దారుణంగా హతమార్చారని, ఆ ఘటన మీద సమగ్ర దర్యాప్తు జరగాలని ఆమెకు న్యాయం జరగాలనివారు ఆ లేఖలో పేర్కొన్నారు. అప్పుడే పశ్చిమబెంగాల్ లో డాక్టర్లు ఎలాంటి భయం లేకుండా తమ విధులు నిర్వహించగలుగుతారని వారు పేర్కొనడం విశేషం. తాము ఒక వైపు నిరసనలు తెలియచేస్తూంటే తమను బెదిరింపులు కూడా గురి చేస్తున్నారు అని వారు ఆరోపించారు. అంతే కాదు ఎక్కడ చూసినా హింసాత్మక ఘటనలు చోటు చేసుకుంటున్నాయని వారు అన్నారు పశ్చిమ బెంగాల్ లో ఇపుడు ఎటు చూసినా తమ చుట్టూ చీకటి అలుముకుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దారుణమైన పరిస్థితులు మారి వెలుగు రేఖలు వెల్లి విరియాలి అంటే మీ జోక్యం అవసరం అని కేంద్ర పెద్దలకు రాష్ట్రపతికి రాసిన లేఖలో పేర్కొన్నారు. అంతే కాదు కోల్‌కతాలో జరిగిన హత్యాచార సంఘటన గురించి వారు చెబుతూ మహిళలపై నేరాల పరంపరలో ఓ భాగంగా అభివర్ణించారు. గడచిన పుష్కర కాలంలో దేశంలో నిర్భయ వంటి లెక్కలేనన్ని అత్యాచారాలు జరిగాయని గుర్తు చేశారు. అయితే వాటిని అన్నింటినీ మరచిపోవడమే సమాజానికి ఉన్న చెడ్డ గుణం అని జూనియర్ డాక్టర్లు ఆ లేఖలో పేర్కొన్నారు. మరో వైపు చూస్తే పశ్చిమ బెంగాల్ లో జూనియర్ డాక్టర్ల ఆందోళనను విరమింపచేయాలన్న మమత ప్రయత్నాలు బెడిసికొడుతున్నాయి. ఒక ముఖ్యమంత్రి చర్చలకు పిలిచినా చర్చలకు వారు రావడం లేదు. దాంతో విసిగిన మమత ఇక తాను రాజీనామా చేయడమే మిగిలింది అని నిర్వేదాన్ని ప్రదర్శిస్తున్నారు. మరో వైపు మమత పాలనలో చీకటి కేంద్రం జోక్యం చేసుకోవాలని జూనియర్ డాక్టర్లు కోరిన నేపథ్యంలో ఏమి జరుగుతుంది అన్న చర్చ కూడా మొదలైంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

**- కోయల్ కార్ రామ్ దయానంద్**

# సింగరేణిలో సీబీఎస్ఈ విధానానికి పచ్చజెండా



గోదావరిఖని: సింగరేణి ఉద్యోగుల పిల్లలకు సీబీఎస్ఈ విద్యా విధానం అందుబాటులోకి రానుంది. యాజమాన్యం నిర్వహిస్తున్న సెక్టార్-3 పాఠశాలలో బోధనకు అభ్యంతరం లేదని రాష్ట్ర విద్యాశాఖ నివేదిక అందజేసింది. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నుంచి అనుమతులు రాగానే ఈ విధానాన్ని ప్రారంభించేందుకు సింగరేణి యాజమాన్యం కసరత్తు చేస్తోంది. ముందుగా రామగుండం ప్రాంతంలోని ఆర్జీ-2 సెక్టార్-3 పాఠశాలలో ఈ విధానం అమలు చేసి అనంతరం శ్రీరాంపూర్‌లోని పాఠశాలలో సైతం సీబీఎస్ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు నిర్ణయించింది. ఇప్పటివరకు సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించే పాఠశాలల్లో రాష్ట్ర విద్యాశాఖ విధానం ద్వారా బోధన చేపడుతున్నారు. కేంద్ర విద్యా విధానంపై కార్మికులు ఆసక్తి చూపడంతో ఆదిశగా యాజమాన్యం చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే ప్రస్తుతం సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలల్లో మొదటి దశలో సెక్టార్-3 పాఠశాలను ఎంపిక చేసింది. సింగరేణి వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో సెక్టార్-3లో ఉత్తమ ఫలితాలు సాధిస్తుంది. దీంతో ఈ పాఠశాలను ఎంపిక చేశారు.

**మూడు నెలల్లో ప్రక్రియ పూర్తి**

సీబీఎస్ఈ విధానానికి సంబంధించిన ప్రక్రియ మూడు నెలల్లో ముగియనుంది. కేంద్ర మంత్రిత్వ శాఖకు యాజమాన్యం లేఖరాయగా త్వరలోనే బృందం పర్యటించనుంది. సెక్టార్-3 పాఠశాలలో మౌలిక సదుపాయాలు, తరగతి గదులు, మైదానం తదితర అంశాలను పరిశీలించి ఆమోదించే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ పాఠశాలలో సీబీఎస్ఈ విధానానికి అనుకూలంగా తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టారు.

**వచ్చే విద్యా సంవత్సరం అందుబాటులోకి..**

వచ్చే విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్ఈ తరగతులు ప్రారంభం కానున్నాయి. అందుకు సంబంధించిన పనులను యాజమాన్యం వేగవంతం చేసింది. రామగుండం రీజియన్ మొత్తానికి సెక్టార్-3 పాఠశాలను ఏర్పాటు చేయనుండటంతో యువ కార్మికుల పిల్లలకు అందులోనే విద్యా బోధన చేపట్టనున్నారు. సంస్థలో ప్రస్తుతం యువ కార్మికులు ఎక్కువగా ఉండటంతో వారి పిల్లలకు మెరుగైన విద్యనందించేందుకు ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తున్నారు. యాజమాన్యం నిర్వహిస్తున్న పాఠశాలల్లో ఆస్థాయిలో విద్యా బోధన ఉండటంలేదని భావించిన కార్మికులు సీబీఎస్ఈ విధానంలో తరగతులు చేపట్టాలని డిమాండ్ చేయగా యాజమాన్యం చర్యలు తీసుకుంది. సింగరేణి వ్యాప్తంగా 9 పాఠశాలలు, పాలిటెక్నిక్ కళాశాల, మహిళా డిగ్రీ, జూనియర్ కళాశాలలను నిర్వహిస్తున్నారు. ఆయా విద్యా సంస్థల్లో 7,500 మంది విద్యార్థులు చదువుతున్నారు. కార్మికుల పిల్లల కోసం సంస్థ తొలిసారిగా 1975లో విద్యా సంస్థలను నెలకొల్పింది. 9 ఉన్నత పాఠశాలలతో పాటు రామగుండం రీజియన్‌లో కార్మికులు సమ్మె చేసిన సందర్భంలో అయిదు ప్రాథమిక పాఠశాలలను సైతం ఏర్పాటు చేసింది. కార్మికుల సంఖ్య తగ్గుతూ రావడంతో క్రమక్రమంగా నిర్వహణను తగ్గించుకుంటూ వచ్చింది. కొత్తగా ఉద్యోగాల్లో చేరిన యువ కార్మికులు తమ పిల్లలకు సీబీఎస్ఈ విధానం కావాలని ఒత్తిడి తేవడంతో యాజమాన్యం చర్యలు చేపడుతోంది.

# అసలే గుంతలు.. ఆపై వానలు



పెద్దపల్లి : 'మూలిగే నక్కపై తాటిపండు' చందాన అసలే గుంతలమయంగా మారిన రహదారులను ఇటీవలి వర్షాలు మరింత దెబ్బ తీశాయి. ముసురు వానలతో దారి పొడవునా గుంతలు పడ్డాయి. వాటిలో నీరు నిలవడంతో రాకపోకలకు అవస్థలు తీవ్రమయ్యాయి. పలు చోట్ల నిధులున్నా పనులు నత్తనడకన సాగుతుండటంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. మరికొన్ని మార్గాల్లో ఏళ్ల తరబడి ప్రతిపాదనల దశ దాటడం లేదు. కల్వర్టులు శిథిలావస్థలోకి చేరుతున్నాయి. దెబ్బతిన్న రహదారులకు మరమ్మతు అంచనాలు రూపొందించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

ఇది ముత్తారం మండలం కేశనపల్లి నుంచి ఓడేడ్ వెళ్లే రోడ్డు. తారు ఆనవాళ్లు లేకపోగా మట్టి గుంతలతో నిండిపోయింది. వర్షాలకు పెద్ద గోతులు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

కాల్వశ్రీరాంపూర్ మండలం తారుపల్లి, మీర్జంపేట గ్రామాల మధ్యలో లోలెవల్ కల్వర్టు వర్షాలకు దెబ్బతింది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలకు సాగించేందుకు అంతరాయం కలుగుతోంది. కొత్తగా వంతెన నిర్మాణానికి రూ.2.3 కోట్లతో ప్రతిపాదించారు.

ఓదెల మండలం ఇందుర్తి, శానగొండ గ్రామాల మధ్యలో రోడ్డు పూర్తిగా దెబ్బతింది. గతేడాది రూ.18 కోట్లతో పనులు చేపట్టినా అసంపూర్తిగా వదిలేశారు. ఇటీవలి వర్షాలకు రహదారి పూర్తిగా దెబ్బతింది.

**ఎక్కడెక్కడ.. ఎలా!**

పెద్దపల్లి నుంచి జూలపల్లి మార్గంలో రహదారిపై తారు పూర్తిగా కొట్టుకుపోయింది. రూ.19 కోట్లతో పనులు చేపట్టగా ఇరువైపులా చెట్లను తొలగించి వదిలేశారు. వర్షాలకు రహదారి మరింత దెబ్బతింది.

సుల్తానాబాద్ మండలం కదంబాపూర్ నుంచి కనుకుల క్రాస్ రోడ్డు వరకు గ్రానైట్ వాహనాల రాకపోకలతో గోతులు పడ్డాయి.

ఎలిగేడు నుంచి సుల్తాన్‌పూర్ మీదుగా గర్రెపల్లి వరకు రహదారి ఏళ్ల తరబడి మరమ్మతుకు నోచుకోవడం లేదు.

పెద్దపల్లి-ధర్మారం మార్గంలో కాసులపల్లి, కనగర్తి మధ్యలో రహదారి గుంతలమయంగా మారింది. పెద్ద పెద్ద గోతులతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

ముత్తారం మండలం దర్యాపూర్ సమీపంలో రహదారి అధ్వానంగా తయారైంది. ముత్తారం మండలం నుంచి ఖమ్మంపల్లి వెళ్లే మార్గంలో ఇసుక లారీలతో దెబ్బతింది.

మంథని నుంచి బిట్టుపల్లి వరకు రోడ్డుపై అడుగడుగునా గుంతలు పడ్డాయి. గోపాల్‌పూర్, ఖమ్మంపల్లి ఇసుక క్వారీల లారీలతో దెబ్బతింది.

జిల్లాలో ప్రధాన మార్గమైన రాజీవ్ రహదారిపై వాహనాల రద్దీతో పాటు వర్షాలకు పలు చోట్ల తారు లేచిపోతోంది. గుంతలతో వేగంగా వచ్చిన వాహనాలు అదుపు తప్పుతున్నాయి.

**ఎందుకీ పరిస్థితి!**

జిల్లాలో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల పరిధిలో రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు కొరవడుతున్నాయి.

సామర్థ్యానికి మించి అధిక బరువు వాహనాల రాకపోకలతో రహదారులు దెబ్బతింటున్నాయి.

పనులు చేసిన గుత్తేదార్లకు సకాలంలో బిల్లుల చెల్లించకపోవడంతో నత్తనడకన సాగుతుండటంతో పాటు నాణ్యత లోపిస్తోంది.

గతేడాది దెబ్బతిన్న రహదారులకు నామమాత్రంగా మరమ్మతు చేసి చేతులు దులుపుకున్నారు.

ప్రాధాన్య అవసరాలకు నిధులు కేటాయిస్తే రవాణా వెతలు తీరనున్నాయి. అధికారులు ఏమంటున్నారంటే..

జిల్లాలో తమ పరిధిలో రహదారుల నిర్మాణంలో జాప్యం లేకుండా పనులు చేపడుతున్నామని పంచాయతీరాజ్ ఈఈ గిరీశ్‌బాబు తెలిపారు. రెండు చోట్ల దెబ్బతినగా మరమ్మతుకు ప్రతిపాదించామని వెల్లడించారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి తాత్కాలిక మరమ్మతు పనులకు ప్రతిపాదిస్తామని ఆర్అండ్‌బీ ఈఈ బావుసింగ్ తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత పెండింగ్ పనులు ప్రారంభించి పూర్తి చేస్తామని చెప్పారు.

# రహదారులు అధ్వానం

మెట్‌పల్లి : మెట్‌పల్లి బల్దియా పరిధిలోని 26 వార్డుల్లో రహదారులు అధ్వానంగా మారాయి. చిన్నపాటి వర్షం పడితే చాలు మురుగు, వర్షం నీరంతా రహదారులపైకి రావడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. 54,335 జనాభా కలిగిన మెట్‌పల్లి బల్దియాలో సుమారు 78 కి.మీ మురుగుకాల్వలు, 132 కి.మీ సీసీరోడ్లు ఏర్పాటు చేశారు. కొత్తగా ఏర్పడుతున్న కాలనీలతో పాటు శివారు కాలనీలలో రహదారులు, మురుగుకాల్వలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు.
పట్టణంలోని వీధుల్లో సీసీరోడ్లు పూర్తిగా ధ్వంసమై ప్రజలు రాకపోకలకు నరకయాతన పడుతున్నారు. మిషన్ భగీరథ పనుల కోసం రహదారులను తవ్వి వదిలేయడంతో గుంతలుగా మారాయి. ఏళ్ల కిందట వేసిన సీసీ రహదారులు కంకరతేలి గుంతలమయంగా మారాయి. చిన్నపాటి వర్షానికి నీరు గుంతలలో చేరడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. గ్రామపంచాయతీ ఉన్న సమయంలో నిర్మించిన కాల్వలు కావడంతో చిన్నపాటి వర్షానికి నిండి మురుగు రోడ్లపైకి వస్తోంది. కాల్వలు కూలిపోతున్నా అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు తెచ్చి పెడుతున్నాయి. పట్టణంలోని కళానగర్, ఇందిరానగర్, మఠంవాడ, బోయవాడ చైతన్యనగర్, ఆదర్శనగర్ తదితర ప్రాంతాలలో మురుగుకాల్వలపై స్లాబుల సిమెంట్ ఊడి ఇనుపచువ్వలు బయటకు వచ్చి ప్రమాదకరంగా మారాయి.పట్టణంలోని పలు వార్డులలో సీసీరోడ్లు, మురుగుకాల్వల నిర్మాణంతో పాటు ప్యాచ్ వర్కులు, మురుగుకాల్వల కోసం రూ.10 కోట్ల టీయూఎఫ్ఐడీయూసీ నిధులు మంజూరై టెండర్లు కూడా పూర్తి చేశారు. మురుగుకాల్వల నిర్మాణానికి రూ.4 కోట్లు, సీసీరోడ్లకు రూ.2.50 కోట్లు మంజూరై టెండర్లు పూర్తి చేశారని త్వరలో పనులు ప్రారంభిస్తారని ఏఈ అరుణ్‌కుమార్ తెలిపారు.

# అడుగడుగునా నిర్లక్ష్యం!

కరీంనగర్ : నగరపాలక సంస్థ పరిధిలో 38 ఎంఎల్‌డీల సామర్థ్యం గల భూగర్భ మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని (యూజీడీ) రూ.76.50 కోట్లతో నిర్మించి.. సుమారు 275 కిలోమీటర్ల పొడవునా పైపులైను వేశారు. ఎస్టీపీకి సమీపంలోని 4,500 ఇళ్లకు అనుసంధానం చేశారు. గత ఆరేళ్లుగా రెండు, మూడు ఎంఎల్‌డీల నీటిని మాత్రమే శుద్ధి చేస్తున్నారు. 41 వేల ఇళ్ల నుంచి మురుగునీటిని తరలించి శుద్ధి చేసే సామర్థ్యం ఉండగా.. ఆ దిశగా చర్యలు తీసుకోవడంలేదు.

**శుద్ధి కేంద్రంతోనే 'స్మార్ట్' గుర్తింపు**

భూగర్భ మురుగునీటి శుద్ధి కేంద్రం ఉండడంతోనే నగర పాలక సంస్థకు 'స్మార్ట్‌సిటీ' గుర్తింపు లభిస్తోంది. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకులు, వాటర్‌ం, ఓడీఎఫ్‌ంలు, సఫాయిమిత్ర సురక్ష ఛాలెంజ్ అవార్డులతోపాటు నగదు పురస్కారం అందుకోగా.. స్మార్ట్‌సిటీ ఎంపికకు ఇదే ప్రధానంగా నిలిచింది. మురుగునీటిని శుద్ధి చేస్తున్నట్లుగా ప్రాజెక్టులో చూపించగా.. మిగతా పనులు పూర్తి చేసేందుకు కావాల్సిన



నిధులకు ప్రణాళికలు చేశారు.

**నిర్వహణ ఏదీ?**

సుమారు 120 కిలోమీటర్ల పొడవునా కొత్తగా రహదారులు, డ్రైనేజీలు నిర్మించారు. సీఎంఏ కింద రోడ్లు వేశారు. ఈ రహదారుల మధ్యలో భూగర్భ డ్రైనేజీ పైపులైను ఉండగా.. వంద మీటర్లకు ఒక ఛాంబర్ కూడా ఉంది. ఇన్‌స్పెక్షన్ ఛాంబర్ కట్టి రహదారికి ఇరువైపులా ఉన్న ఇళ్లకు అనుసంధానం చేయాల్సి ఉండగా.. అదేదీ కనిపించడం లేదు. పైగా రోడ్లు వేసే సమయంలో మధ్యలో ఉన్న ఛాంబర్లు మూసుకుపోయినా నిర్లక్ష్యం వహించారు. ఇటీవల ఇళ్ల ముందున్న బహిరంగ మురుగునీటి కాలువలు మూసివేసి, కొత్తగా యూజీడీ అని చెబుతూ నిర్మిస్తున్నారు. ఛాంబర్‌కు కనెక్షన్ ఇవ్వకుండా, వర్షం నీటి కోసం ఓపెన్ డ్రైనేజీలు వదిలిపెట్టకుండా అధికారులు ప్రజాధనం వృథా చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి.

**సామర్థ్యం ఉన్నా..!**

నగరానికి అత్యంత ప్రధానమైన మురుగునీటి శుద్ధి కేంద్రానికి ఆశించిన స్థాయిలో మురుగునీరు రావడం లేదు. కొన్ని ఇళ్ల నుంచి వస్తున్న నీటితోపాటు సమీప వరద కాలువలోని నీటిని తీసుకొని శుద్ధి చేస్తున్నారు. ఇన్‌స్పెక్షన్ ఛాంబర్లు నిర్మించాలంటే ప్రతి ఇంటికీ సుమారు రూ.7 వేల ఖర్చు వస్తుండడంతో అలాగే వదిలేశారు.

**రూ.కోట్లు కేటాయించినా..**

స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం, ఇంటింటా కనెక్షన్లు(హెచ్ఎస్‌సీ), ఇన్‌స్పెక్షన్ ఛాంబర్లు(ఐసీ) నిర్మించేందుకు రూ.26కోట్లు కేటాయించారు. అయితే 28 శాతం పనులు చేసినట్లు, 25 శాతం నిధులు గుత్తేదారుకు చెల్లించినట్లు చూపిస్తుండగా.. ఇంటింటా కనెక్షన్లు మాత్రం ఇవ్వలేదు. ప్రస్తుతం రహదారుల నిర్మాణ పనులన్నీ పూర్తికాగా.. మిగతా పనులు చేసేందుకు ముందుకొచ్చినా రోడ్లు దెబ్బతినే ప్రమాదముంది.

**కొనసాగుతున్న పనులు..**భూగర్భ డ్రైనేజీకి ఇంటింటా కనెక్షన్లు ఇచ్చే పనులు కొన్నిచోట్ల కొనసాగు తున్నాయి. డ్రైయిన్లకు అనుసంధానం చేసేలా ఆదేశాలిచ్చాం. ఇప్పటివరకు బిల్లులు ఇవ్వలేదు.ప్రఫుల్ దేశాయ్, కమిషనర్, కరీంనగర్ నగరపాలక

# అమ్మినవే..మళ్లీ అమ్మకం!

ఆలేరు : ప్రభుత్వాలు ఎన్ని కఠిన నిబంధనలు అమలు చేస్తున్నప్పటికీ.. స్థిరాస్తి వ్యాపారుల అక్రమాలకు కళ్లెం పడటం లేదు. వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి ఇక్కట్లు తప్పడం లేదు. గతంలో రైతుల నుంచి భూములను కొనుగోలు చేసిన రియల్టర్లు.. రెవెన్యూ దస్త్రాలు, ధరణిలో స్థల యజమానుల పేర్లు మారకపోవడంతో..స్థిరాస్తి వ్యాపారులు అమ్మిన వాటినే మళ్లీ అమ్ముతూ లక్షల రూపాయలు దండుకుంటున్నారు. పుణ్యక్షేత్రమైన యాదాద్రి ఆలయంతో పాటు హైదరాబాద్- భూపాలపట్నం, చౌటుప్పల్- సంగారెడ్డి జాతీయ రహదారులు విస్తరించి ఉండటం, ఉత్తర పశ్చిమ సరిహద్దుల్లో గ్రేటర్ హైదరాబాద్‌కు సరిహద్దుగా ఉండటంతో ఆలేరు నియోజకవర్గంలో స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతోంది. స్థిరాస్తి వ్యాపారులు సైతం ఇదే తీరున అక్రమాలకు పాల్పడుతున్నారు. వ్యాపారులు గతంలోనే పెద్ద ఎత్తున భూములు కొనుగోలు చేశారు. వెంచర్లు ఏర్పాటు చేశారు. కాగితాల పైన లేఅవుట్లు చేశారు. ఆనక అందమైన బ్రోచర్లు ముద్రించి పల్లె, పట్టణం అనే తేడా లేకుండా కొనుగోలు దారులను నమ్మిస్తూ, ఆకర్షిస్తూ పెద్ద ఎత్తున విక్రయాలు జరిపారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ..కొన్ని వెంచర్లకు సంబంధించి ప్రభుత్వం పరంగా ఎలాంటి సాంకేతిక అనుమతులు తీసుకోలేదు. అడ్డదారుల్లో ప్లాట్లను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

నాలా కన్వర్షన్ లేకుండానే...

వ్యవసాయ భూములను వ్యవసాయేతర పనులకు వినియోగించుకునే క్రమంలో నాలా అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఇక్కడ మాత్రం కొంతమంది నాలా అనుమతుల కోసం దరఖాస్తులే చేయడం లేదు. సదరు రైతుల భూములు రెవెన్యూ రికార్డులలో అలాగే ఉండిపోతున్నాయి. ఇదే సదరు స్థిరాస్తి వ్యాపారులకు వరంలా మారుతోంది. వారి అక్రమాలకు ఊతం ఇస్తోంది. ఇలాంటి ఆలేరు నియోజకవర్గం పరిధిలోని మండలాల్లో వందకు పైగా వెంచర్లు ఉన్నట్లు సమాచారం.

ఇప్పుడు ఫామ్ హౌస్‌లు

పది, పదిహేనేళ్ల క్రితం ప్రభుత్వ అనుమతులు లేకుండా వెంచర్లు ఏర్పాటు కాగా..గత నాలుగైదు సంవత్సరాలుగా తిరిగి ఇవే స్థలాలు కొత్త వెంచర్లుగా ఏర్పాటు అవుతున్నాయి. హైదరాబాదు, రంగారెడ్డి, కరీంనగర్, వరంగల్ జిల్లాలకు చెందిన బడా స్థిరాస్తి వ్యాపారులు సదరు స్థలాలను తక్కువ ధరలకు కొనుగోలు చేసి ఫామ్‌హౌజ్‌లు నిర్మించుకున్నారు. ఆయా స్థలాల చుట్టూ ప్రహరీలు నిర్మించి అందులో భవనాలు సైతం నిర్మించారు.

ఎప్పుడైనా చర్యలు తప్పవు:
శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దారు, ఆలేరు

నిబంధనలకు అనుగుణంగానే భూములు, పాట్ల క్రయవిక్రయాలు జరుపుకోవాలి. ప్రభుత్వ పరంగా అనుమతులు పొందకుండా విక్రయాలు జరపడం, నిర్మాణాలు చేపట్టడం నేరమవుతుంది. ఇలాంటి వారి విషయంలో కఠిన చర్యలు తప్పవు. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ భూములు, ప్లాట్లను కొనుగోలు చేసే ముందు ఆయా ఆస్తులు సరైనవేనా..అనే విషయాన్ని నిర్ధారించుకోవాలి.

# గల్ఫ్ కార్మికుల కోసం గల్ఫ్ సంక్షేమ బోర్డు

**మరణించిన గల్ఫ్ కార్మికుల కుటుంబానికి 5 లక్షల ఎక్స్ గ్రేషియా**

**ప్రజా భవన్ లో జరిగే ప్రజా వాణి లో గల్ఫ్ బాధితుల కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు**

**గల్ఫ్ కార్మిక కుటుంబాల పిల్లలకు గురుకులాల్లో సీట్లు**

**గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం తీసుకోవల్సిన చర్యల పై సలహాలు, సూచనలు**

**సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్**



హైదరాబాద్ ,సెప్టెంబర్ 14: (నిఘానేత్రం ప్రతినిధి) గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన గల్ఫ్ కార్మికులు అధికంగా ఉండే నియోజకవర్గ ఎమ్మెల్యేలు ఇతర ముఖ్య నేతలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, టిపిసిసి ఎన్ఆర్ఐ సెల్ వినోద్ ఆధ్వర్యంలో రూపొందిన గల్ఫ్ బాధితులకు సంబంధించిన 5 అంశాల పై సమావేశంలో చర్చించారు. అందులో ప్రధానంగా గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై అధ్యయనం చేయడానికి ప్రభుత్వం ఒక సలహా కమిటీ నీ ఏర్పాటు చేయాలని అందులో గల్ఫ్ ప్రభావిత ప్రాంత ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు , నాయకులు ఈ కమిటీ లో సభ్యులుగా నియమించి ఇందుకోసం జీవో విడుదల చేయాలని సూచించారు. హైదరాబాద్ ప్రజా భవన్ లో ప్రతి మంగళ వారం , శుక్రవారం ప్రజావాణి లో గల్ఫ్ కార్మికుల కోసం ప్రవాసి ప్రజావాణి నిర్వహిస్తే బాగుంటుందని సూచించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రస్తుతం నిర్వహిస్తున్న ప్రజావాణి లో ఈనెల 20 వ తేది నుండి గల్ఫ్ కోసం ప్రత్యేక కౌంటర్ ప్రారంభిస్తామని తెలిపారు. గురుకుల పాఠశాలలో, కళాశాలలో గల్ఫ్ కార్మికుల పిల్లలకు గురుకులాల్లో చదవాలని అనుకునే వారికి 100 శాతం అడ్మిషన్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 7 డిసెంబర్ 2023 నుండి గల్ఫ్ దేశాల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు 5 లక్షల ఎక్స్ గ్రేషియా ఇచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. గతంలో చనిపోయిన వారి కుటుంబాలకు మానవతా దృక్పథంతో లక్ష రూపాయల ఎక్స్ గ్రేషియ ఇవ్వాలని %చీ=×% సెల్ సూచించింది. దీనిని తెలంగాణ ఏర్పడినప్పటి రోజు జూన్ 2 ,2014 లేదా ఏరోజు తీసుకుంటే బాగుంటుందనే దానిపై కమిటీ లు పలువురు సూచనలు చేశారు.సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు ఇతర ముఖ్య నేతలు పలు సలహాలు సూచనలు చేశారు. ఇప్పటికే తన వేములవాడ నియోజకవర్గానికి చెందిన గల్ఫ్ లో మృతి చెందిన రెండు కుటుంబాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో సిఎంఆర్ఎఫ్ నుండి వారికి ఎక్స్ గ్రేషియా ఇచ్చినట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. రైతు భీమా మాదిరి గల్ఫ్ భీమా ఉండాలని సూచించారు. పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో సింగపూర్ , మలేషియా కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని సూచించారు. టీపిసిసి ఎన్ఆర్ఐ కన్వీనర్ ఇమిగ్రేషన్ 1982 యాక్ట్ లో గల్ఫ్ దేశాల్లో 18 దేశాలు ఉంటాయని అందులో సింగపూర్ లాంటి దేశాలు కూడా గల్ఫ్ కిందకి వస్తాయన్నారు.తెలంగాణ లో 150 ట్రెడ్ లైసెన్స్ మన్ పవర్ ఎక్సపోర్ట్ కంపెనీలు ఉన్నాయని సెట్విన్, టాంటం, న్యాక్ లాంటి వాటిపై ప్రజల్లో అవగాహన కల్పించాలనీ సూచించారు. ఏజెన్సీల పేరుతో మోసం జరుగుతుందని అలా జరగకుండా కఠినంగా వ్యవహరించాలని సూచించారు. గల్ఫ్ కార్మికులు చనిపోతే శవం రావడానికి వారం రోజులకు పైగా పడుతుందని దానిని 48 గంటల్లో ఇక్కడికి వచ్చేలా చూడాలని తెలిపారు. దేశంలో బెస్ట్ గల్ఫ్ పాలసీ కేరళ రాష్ట్రంలో ఉందని అక్కడ ఉన్న దానిని స్టడి చేయాలని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కేరళ లో జీడీపీ కి ప్రధానంగా గల్ఫ్ కార్మికుల ద్వారా వస్తుందని తెలంగాణ లో కూడా జీడీపీ గల్ఫ్ కార్మికుల ద్వారా అభివృద్ధి జరగాలని సూచించారు.సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,ఎమ్మెల్యేలు డా.,సంజయ్ రేకులపల్లి భూపతి రెడ్డి , కెఆర్ నాగరాజు , మేడిపల్లి సత్యం, వాకిటి శ్రీహరి ముదిరాజ్ ,సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి,మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ కాంగ్రెస్ పార్టీ నేతలు వెలిచాల రాజేందర్ రావు , వినయ్ రెడ్డి NRI సెల్ చైర్మన్ వినోద్ పాల్గొన్నారు..

# కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుపర్చాలి




నిజామాబాద్ , సెప్టెంబర్ 14 (నిఘానేత్రం ప్రతినిధి) కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఏకకాలంలో ఎలాంటి షరతులు లేకుండా రెండు లక్షల రూపాయలు రుణమాఫీ,రెండు పంటలకు రైతు భరోసా 15000 రూపాయలు యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని,సెప్టెంబర్16వ తేదీ ఆర్మూర్ డివిజన్ పరిధిలో అన్ని తహసిల్ కార్యాలయల ముందు నిరసన కార్యక్రమం నిర్వహించాలని రైతు జేపీసీ పిలుపునిచ్చింది.అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం కార్యాలయం కుమార్ నారాయణ భవన్ ఆర్మూర్లో ఈరోజు రైతు ఐక్య కార్యాచరణ కమిటీ (జేపీసీ ) పాత్రికేయ మిత్రుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు.వి . ప్రభాకర్, లింగారెడ్డి,దేగామ్ యాదగౌడ్ లు మాట్లాడుతూ 16వ తేదీన ఆర్మూర్ డివిజన్ పరిధిలో మాట తప్పిన కాంగ్రెస్ కు నిరసనగా ధర్నాలు చేయాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఆరు గ్యారెంటీలను అందులో ప్రధానంగా ఏ రైతు అడగకముందే ఏకకాలంలో ఎలాంటి షరతులు లేకుండా 2 లక్షల రూపాయల రుణమాఫీ చేస్తానని రెండు పంటలకు కలిపి 15000 రూపాయలు రైతు భరోసా ఇస్తానని హామీ ఇచ్చి అధికరణకు వచ్చి 9 మాసాలు గడుస్తున్న రైతు భరోసా కు అతిలేదు ,గతి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం రుణమాఫీలో రైతుల్ని మోసం చేసిందని మైకులు పగిలిపోయే విధంగా ఉపన్యాసాలు ఇచ్చి అధికారంలోకి రాగానే నామ్కే వాస్తే లక్ష యాభై వేల రూపాయల వరకు అందులో కూడా అందరికీ కాకుండా కొంతమేరకే రుణమాఫీ చేసి 2 లక్షల రుణమాఫీ ప్రారంభం కూడా కాలేదని ఎద్దేవా చేశారు.ఇప్పటివరకు చేసిన రుణమాఫీ 40 నుండి 50 శాతం కూడా పూర్తి కాలేదని గత ప్రభుత్వాలు అనుసరించిన విధానాల్ని ఈ ప్రభుత్వం అనుసరిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని పంటలకు 500 రూపాయల బోనస్ ఇచ్చి, మాట నిలబెట్టుకుని యోచినే చేయడం లేదని ఇది చేతుల ప్రభుత్వం కాదని మాటల ప్రభుత్వం అని అన్నారు.గత నెల 24వ తేదీన ఆర్మూర్. బాల్కొండ. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల రైతులు వేలాదిమంది ఆర్మూర్ హైవే రోడ్డుపై నిరసన వ్యక్తం చేసి ఈ నెల 15వ తేదీ లోపు పూర్తిస్థాయిలో ఎలాంటి షరతులు లేకుండా. కుటుంబ నిర్ధారణ లేకుండా పాస్బుక్ ఉన్న ప్రతి రైతుకు రెండు లక్షల రూపాయలు రుణమాఫీ.. 2 లక్షలకు పైగా అప్పు ఉన్న రైతులు పైన అప్పు చెల్లిస్తే ఈ స్కీమ్ వర్తిస్తుందని ఆటంకపరచడం సరికాదని బె శరత్తుగా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసాను. రుణ మాఫీ ని యుద్ధ ప్రాతిపదికను అమలు చేయాలని.. అన్ని పంటలకు 500 రూపాయలు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.. ఈ పాత్రికేయ మిత్రుల సమావేశంలో నాయకులు బి దేవారం. ఆకుల గంగారాం.. తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారులుగా ఈరోజు పదవీ బాధ్యతలు స్వీకరించిన బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 14: (నిఘానేత్రం ప్రతినిధి) నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ రాష్ట్ర ఉద్యాన శాఖ భవనంలోని తన కార్యాలయంలో జరిగిన ఈ పదవీ బాధ్యతల స్వీకార కార్యక్రమానికి హాజరై పోచారం శ్రీనివాస్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు ,రాష్ట్ర ఎక్సైజ్ మరియు టూరిజం శాఖ మంత్రి వర్యులు శ్రీ జూపల్లి కృష్ణారావు ,రాష్ట్ర రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ , తెలంగాణప్రదేశ్ కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు %మీజ% శ్రీ బి మహేష్ కుమార్ గౌడ్ ,రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కేశవరావు , షబ్బీర్ అలీ , జితేందర్ రెడ్డి , జహీరాబాద్ ఎంపీ శ్రీ సురేష్ షెట్కార్ ,రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ , శాసన సభ్యులు పి సుదర్శన్ రెడ్డి ,శ్రీ మనోహర్ రెడ్డి , కాలె యాదయ్య ,శ్రీ ప్రకాష్ గౌడ్ , దానం నాగేందర్ ,హైదరాబాద్ నగర మేయర్ శ్రీమతి గద్వాల విజయ లక్ష్మి , రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు కాసుల బాలరాజు ,ఈరవత్రి అనిల్ కుమార్ ,రాష్ట్ర టెస్కాబ్ చైర్మన్ ఎం రవీందర్ రావు ,హైదారాబాద్ %DCC% అధ్యక్షులు రోహిన్ రెడ్డి , ఆదిలాబాద్ జిల్లా డిసిసిబి చైర్మన్ బోజా రెడ్డి ,రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్ రావు , రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ బి.గోపి , ఉద్యానవన శాఖ కమిషనర్ శ్రీమతి యాస్మిన్ భాషా ,



ప్రజాప్రతినిధులు,రాష్ట్ర స్థాయి నాయకులు ఈ పదవీ బాధ్యతల స్వీకారానికి బాన్సువాడ నియోజకవర్గంతో పాటుగా నిజామాబాద్,కామారెడ్డి జిల్లాల నుండి భారీ ఎత్తున హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులు,అభిమానులు, కార్యకర్తలు,మిత్రులు, శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున హాజరై పోచారం శ్రీనివాస్ రెడ్డి కి శాలువాలు,పుష్ప గుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు మాజీ డీసీసీబీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పోచారం భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# కామ్రేడ్ సీతారాం ఏచూరి పోరాటపటిమను కొనసాగిద్దాం

**-సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శంకర్ గౌడ్ పిలుపు**



నవీపేట్, సెప్టెంబర్14 (నిఘానేత్రం ప్రతినిధి) నవీపేట్ మండల కేంద్రంలో శనివారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి సంతాప సభను నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సిపిఎం పార్టీ మండలం కార్యదర్శి నాయక్ వాడి శ్రీనివాస్ లు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ 1952వ సంవత్సరంలో జన్మించిన సీతారాం ఏచూరి మన తెలుగు బిడ్డ అవడం గర్వము అని వారి తండ్రి సోమయాజులు తల్లి కల్పకం వృత్తి ఐఏఎస్ క్యాడర్ కావడం ఆయన హైదరాబాద్లో మెట్రిక్యులేషన్ వరకు చదువుకొని ఢిల్లీ వెళ్లడం జరిగిందని, తదుపరి చదువు మొత్తం ఢిల్లీలోనే సాగడం జె ఎన్ యు యూనివర్సిటీ నాలుగుసార్లు అధ్యక్షులుగా రెండుసార్లు పార్లమెంట్ రాజ్యసభ సభ్యుడిగా ఆ తర్వాత మూడు మహాసభల్లో అఖిలభారత ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై ప్రస్తుతం అదే హోదాలో మరణించడం జరిగిందని అన్నారు. మన తెలుగు రాష్ట్రాలకు ఆనాటి చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యుత్ ఉద్యమం వహించడం లో కీలక పాత్ర పోషించారని రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం భూపోరాటాం నిర్వహించి ముదిగొండ లో ఏడుగురు పార్టీ నాయకులపై కాల్పులు జరిపి వీర మరణం పొందారని ఆ సమయంలో ఇందిరమ్మ ఇండ్లు సాధించుకోవడం జరిగిందని గుర్తు చేశారు, రాజకీయవేత్త, ఆర్థిక వేత్త, మార్క్సిస్టు సిద్ధాంత రూపకర్తగా, కేంద్ర ప్రభుత్వాలకు పోరాట రూపాలను వ్యూహాత్మకంగా నిర్వహించేవారని గుర్తు చేశారు. ఆయనకు నిజమైన నివాళి మరో సీతారాం ఏచూరి ని తయారు చేయడమే అని వారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ బోధన్ ఏరియా కార్యదర్శి వేషాల గంగాధర్, నవీపేట్ సిపిఎం మండల నాయక్ వాడి శ్రీనివాస్, దేవేందర్ సింగ్, ఏ ఐ కె ఎస్ నాయకులు రామ్ సింగ్, సిఐటియు నాయకులు మేకల ఆంజనేయులు, సావిత్రి, పోగుల వసంత్, పార్టీ సభ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.


# హాస్టల్, రెసిడెన్షియల్ స్కూళ్లను తనిఖీ చేసిన కలెక్టర్

**-నిర్వహణ తీరుపై సంతృప్తి వెలిబుచ్చిన జిల్లా పాలనాధికారి**



నిజామాబాద్ సెప్టెంబర్ 14 (నిఘానేత్రం ప్రతినిధి) నిజామాబాద్ నగరంలోని వినాయకనగర్ లో గల ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని, మోపాల్ మండలం కంజరలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, డార్మెటరీ, స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్, టాయిలెట్స్, ఆఫీస్, స్టాఫ్ రూమ్ లు తదితర వాటిని పరిశీలించారు. స్టోర్ రూమ్ లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, ఇతర సరుకుల నాణ్యతను, విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. బోధనా సిబ్బంది హాజరును, సీ.సీ కెమెరాల పనితీరును పరిశీలించారు. విద్యార్థులను పలుకరించి వారికి అందిస్తున్న భోజన, వసతి సదుపాయాలు, రోజువారీ దినచర్య గురించి ఆరా తీశారు. జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ స్కూల్ ఆవరణలో నూతనంగా నిర్మించిన భవన సముదాయం, డార్మెటరీని సందర్శించారు. హాస్టల్, రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్వహణ సజావుగా ఉండడం, పరిసరాలు పరిశుభ్రంగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకనూ ఏమైనా మౌలిక సదుపాయాలు అవసరం ఉన్నాయా అని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. సరిపడా సిబ్బంది, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, నీటి వసతి వంటి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అయితే వినాయకనగర్ సంక్షేమ వసతి గృహానికి చెందిన విద్యార్థినులు అనునిత్యం బోర్గం(పి) పాఠశాలకు వెళ్లి వచ్చేందుకు రవాణా వసతి లేక ఇబ్బందులు పడుతున్నారని, బడి వేళల్లో ఉదయం, సాయంత్రం పూట బస్సు సదుపాయం కల్పించాలని హాస్టల్ నిర్వాహకులు కోరగా, కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కలెక్టర్ వెంట జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి అధికారిణి నిర్మల, సహాయ సంక్షేమ అధికారి భూమయ్య, మోపాల్ ఎంపీడీఓ రాములు తదితరులు ఉన్నారు.

# పదవి బాధ్యతలు చేపట్టిన పోచారం



బాన్సువాడ,సెప్టెంబర్ 14 (నిఘానేత్రం ప్రతినిధి) తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారులుగా బాన్సువాడ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి శనివారం పదవి బాధ్యతలు స్వీకరించారు.హైదరాబాద్, నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ రాష్ట్ర ఉద్యాన శాఖ భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు.పలువురు మంత్రులు,నాయకులు విచ్చేసి పోచారంను అభినందించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి వర్యులు జూపల్లి కృష్ణారావు ,రాష్ట్ర రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ , తెలంగాణ కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బి మహేష్ కుమార్ గౌడ్ ,రాష్ట్ర ప్రభుత్వ సలహా దారులు కేశవరావు , షబ్బీర్ అలీ, జితేందర్రెడ్డి,జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ ,రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ , శాసన సభ్యులు పి సుదర్శన్ రెడ్డి, మనోహర్రెడ్డి ,కాలెయాదయ్య ,ప్రకాషగౌడ్ ,దానంనాగేందర్ ,హైదరాబాద్ నగర మేయర్ గద్వాల విజయ లక్ష్మి , రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు కాసుల బాలరాజు ,ఈరవత్రి అనిల్ కుమార్ ,రాష్ట్ర టెస్కాబ్ చైర్మన్ ఎం రవీందర్ రావు ,హైదారాబాద్ డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి , ఆదిలాబాద్ జిల్లా డిసిసిబి చైర్మన్ బోజా రెడ్డి ,రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్ రావు , రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ బి.గోపి , ఉద్యానవన శాఖ కమిషనర్ శ్రీమతి యాస్మిన్ భాషా , ప్రజాప్రతినిధులు,రాష్ట్ర స్థాయి నాయకులు ఆయనను అభినందించారు. ఈ పదవీ బాధ్యతల స్వీకారా నికి బాన్సువాడ నియోజకవర్గంతో పాటు,నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుండి భారీ ఎత్తున ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు,కార్యకర్తలు, శ్రేయోభిలాషులు హాజరై పోచారం శ్రీనివాస్ రెడ్డి ని శాలువాలు,పుష్ప గుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోచారం కుటుంబ సభ్యులు,మాజీ డీసీసీబీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీ పోచారం భాస్కర్ రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ కాలనీ గణేష్ మండపం వద్ద మహా అన్నప్రసాద వితరణ

నిజామాబాద్ ,సెప్టెంబర్ 14 (నిఘానేత్రం ప్రతినిధి) నిజామాబాద్ నగరంలోని మహాలక్ష్మి నగర్లో ఉన్న జర్నలిస్ట్ కాలనీలో గణేష్ మండపం వద్ద శనివారం మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.అన్నప్రాసద కార్యక్రమంలో నగరంలో ఉన్నటువంటి జర్నలిస్ట్ కుటుంబ సభ్యులతో పాటు కాలనీ జర్నలిస్టు కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి నగర సీఐ నరహరి, నాలుగవ టౌన్ ఎస్ఐ శ్రీకాంత్ లు విచ్చేసి పూజలు జరి పించి అన్నప్రాసదలను స్వీకరించారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్ కాలనీ సంఘ అధ్యక్షుడు జెట్టి గోవిందరాజ్, కార్యదర్శి మల్లెపూల నరసింహ చారి లు సిఐ,ఎస్ఐ లను శాలువాలతో సత్కరించారు.కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.



## నీలకంఠేశ్వరాలయంలో మహా అన్నదానం

నిజామాబాద్ , సెప్టెంబర్ 14 (నిఘానేత్రం ప్రతినిధి) గణపతి నవరాత్రు ల సందర్భంగా నీల కంటేశ్వర్ ఆలయంలో ఏర్పాటు చేసిన పూజ,అన్న దానం కార్యక్రమంలో ముఖ్యఅతిగా అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు: సనాతన ధర్మ రక్షణకై యావత్ హిందూ సమాజం యువతీ యువకులు చిన్నారులంతా కలిసి భక్తిశ్రద్ధలతో గణపతి నవరాత్రులు నిర్వహించడం హిందువుగా గర్వించు దగ్గ విషయం అన్నారు. హిందువుల ఐక్యత 9 రోజులే కాకుండా భవిష్యత్తులోనూ హిందూ సమాజానికి హిందూ ధర్మానికి ఎటువంటి ఆపద వచ్చినా హిందువులంతా ఐక్యతతో జయించాలన్నారు. హిందువులపై జరుగుతున్న దాడులు దృష్టిలో పెట్టుకొని హిందువులంతా ఏకం కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు



నాగోళ్ళ లక్ష్మీనారాయణ , బీజేపీ నాయకులు ఆనంద్, పవన్ ముందడ,కార్తీక్,హరీష్, శేఖర్,తదితరులు భక్తులు పాల్గొన్నారు.

## సౌత్ జోన్ మహిళల సైక్లింగ్ లీగ్ పోటీలను ప్రారంభించిన ఎంపీ

నిజామాబాద్ , సెప్టెంబర్ 14 (నిఘానేత్రం ప్రతినిధి) నిజామాబాద్ నగరంలోని బైపాస్ రోడ్డులో ఖేలో ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సౌత్ జోన్ మహిళల సైక్లింగ్ లీగ్ పోటీలను నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ శనివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఖేలో ఇండియా ద్వారా నిజామాబాద్ లాంటి ద్వితీయ శ్రేణి పట్టణాల్లో ఇలాంటి పోటీలు నిర్వహిస్తున్నందుకు కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ ,



అసిస్టెంట్ డైరెక్టర్ స్పోర్ట్స్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ కుమారి నిషా విద్యార్థి , జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు ఈగ సంజీవరెడ్డి , నిజామాబాద్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కృపాకర్ రెడ్డి , తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయకాంతరావు ,వందలాదిమంది క్రీడాకారిణులు పాల్గొన్నారు.

## మిలాద్-ఉన్-నబీ ఊరేగింపు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

**-జిల్లా పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్**

నిజామాబాద్ , సెప్టెంబర్ 14 (నిఘానేత్రం ప్రతినిధి)ముస్లింల పవిత్ర దినమైన మిలాద్– ఉన్ నబీ పండుగ సందర్భంగా నిజామాబాద్లో ఈ నెల 16న భారీ ఊరేగింపు జరగనుంది. ఈ సందర్భంగా నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా నిజామాబాద్ పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ నెల 16న ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు భారీ ఊరేగింపు కారణంగా కొన్ని మార్గాలలో



ట్రాఫిక్ ఆంక్షలు విధించి, దారి మళ్లింపు చేసినట్లు జిల్లా పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగనెవర్ ప్రకటించారు. బోధన్ వైపు నుండి వచ్చే వాహనాలు అర్సపల్లి చౌరస్తా, అర్సపల్లి రైల్వే గేట్, న్యూ కలెక్టరేట్, కాలూర్ చౌరస్తా, ఖాజా హోటల్, బైపాస్, ఎన్టీఆర్ చౌరస్తా మీదుగా ఆర్టీసీ బస్టాండ్ కు వెళ్ళాలని పేర్కొన్నారు. అలాగే నిజామాబాద్ నుంచి బోధన్ వైపు వెళ్ళు వాహనాలు ఆర్టీసీ బస్టాండ్, రైల్వే ఫై ఓవర్, శివాజీ చౌక్, నిజాం కాలనీ, అర్సపల్లి రైల్వే గేట్ మీదుగా బోధన్ వైపు వెళ్లాలని సూచించారు.

# వృథా నీటికి అడ్డుకట్ట

మల్లాపూర్: ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ ద్వారా సరఫరా అవుతున్న సాగునీరు చివరి ఆయకట్టుకు పూర్తిస్థాయిలో అందక.. రైతులు పూర్తిస్థాయిలో పంటలు పండించుకోని పరిస్థితులు గతంలో ఉండేవి. వాగులపై నిర్మించిన చెక్‌డ్యాంలతో వేలాది ఎకరాల బీడు భూములు సస్యశ్యామలం కావడం, భూగర్భ జలాలు పెరగడంతో పాటు మత్స్యకారుల ఉపాధికి మార్గం సుగమమైంది. జిల్లాలోని పెద్దవాగులో వృథాగా పోతున్న జలాలను పంట పొలాలకు అందిస్తే ప్రయోజనం ఉంటుందన్న భావనతో చెక్‌డ్యాంల నిర్మాణంతో పలువురు రైతులు సాగు చేసుకుంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మెట్పల్లి, మల్లాపూర్, కోరుట్ల, రాయికల్ మండలాల మీదుగా ప్రవహిస్తున్న పెద్దవాగు, కోరుట్ల వాగులను ఆనుకోని మొత్తం 11 చెక్‌డ్యాంలను నిర్మించారు. మెట్పల్లి మండలం ఆత్మకూర్ వద్ద రూ.2.01 కోట్లు, పెద్దపూర్ గ్రామ శివారులో రూ.2.18 కోట్లు, అరపేట శివారులో రూ.2.36 కోట్లు, కొండ్రికర్ల వద్ద రూ.2.27 కోట్లు, చౌలమద్ది వద్ద రూ.2.22 కోట్లు, వెంపేట వద్ద రూ.3.15 కోట్లు, మల్లాపూర్ మండలం చిట్టాపూర్ శివారులో 3.74 కోట్లు, కోరుట్ల మండలం ధర్మారం శివారులో రూ.2.12 కోట్లు, అయిలాపూర్ శివారులో రూ.2.08 కోట్లు, రాయికల్ మండలం బొర్నపల్లి వద్ద రూ.3.20 కోట్లతో చేపట్టిన చెక్‌డ్యాంల నిర్మాణాలు పూర్తవడంతో జలకళను సంతరించుకొన్నాయి.



నిర్మాణాలు పూర్తవడంతో 5 ఎంసీఎఫ్టీ మేర నీటి నిల్వ సామర్థ్యం పెరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. భూగర్భ జలాలు పెరగడంతో రైతులకు రెండు పంటలకు సాగునీరు పుష్కలంగా అందనుంది. ఒక్కో చెక్‌డ్యాం ఎత్తు 9 నుంచి 11 ఫీట్ల మేర ఉండటంతో మత్స్యకారులు చేపలను పెంచుకునేందుకు మార్గం సుగమమైంది. గతంలో ఎస్సారెస్పీ కాలువల ద్వారా సాగునీరు అందని బీడు భూములకు చెక్‌డ్యాంల ద్వారా నేడు సాగునీరు అందనుంది.

రెండు పంటలకు సాగునీరు – సురకంటి అంజిరెడ్డి, చిట్టాపూర్ రైతు

ఎస్సారెస్పీ ప్రాజెక్టు పరిధిలో ఉన్నప్పటికీ గతంలో సాగునీరు అందక అనేక ఇబ్బందులు పడ్డాం. చిట్టాపూర్ శివారులో రెండేళ్ల కిందట నిర్మించిన చెక్‌డ్యాంతో ఖరీఫ్, రబీ సీజన్లలో వరి, మొక్కజొన్న పంటలను పండిస్తున్నాం. ప్రభుత్వం ముందు చూపుతో నిర్మించిన చెక్‌డ్యాంలతో రైతులతో పాటు మత్స్యకారులు చేపలను పెంచుతూ ఉపాధి పొందుతున్నారు.

# వైద్య సేవలు మరింత వేగవంతం

జమ్మికుంట: వైద్య విధానపరిషత్ పరిధిలోని జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు మెరుగయ్యేందుకు జిల్లా పాలనాధికారి ప్రత్యేక దృష్టి సారించడంతో.. అనేక గ్రామాలకు కేంద్రమైన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఇబ్బందులు తీరనున్నాయి. కొన్ని నెలలుగా పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బంది కొరతతో ఇబ్బందులు తప్పడం లేదు. గత 6 మాసాలుగా గైనకాలిజిస్టు లేకపోవడంతో ఆసుపత్రిలో ప్రసవాలు నిలిపివేశారు. దీంతో గర్భిణులు హుజూరాబాద్ ప్రాంతీయ ఆసుపత్రి లేదా కరీంనగర్, వరంగల్‌లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. తాజాగా జిల్లా కలెక్టర్ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వారంలో రెండు రోజులు ప్రసవాలు చేసేందుకు గైనకాలజిస్ట్ సోమశేఖర్‌ను నియమించారు. దీంతో ఆసుపత్రిలో సోమవారం, గురువారం గర్భిణులకు ప్రసవాలు చేసేందుకు ఏర్పాట్లు చేశామని ఆసుపత్రి సూపరింటెండెంట్ ఇన్‌చార్జి డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆసుపత్రిలో ఒక హెడ్‌స్టాఫ్ నర్స్, 13 మంది నర్సులు, సిబ్బంది ఉన్నట్టు పేర్కొన్నారు.

8కి చేరిన వైద్యుల సంఖ్య

ఇప్పటివరకు ఆసుపత్రిలో దంత, ఆర్థోపెడిక్, మరో నలుగురు వైద్యులతో కేవలం ఓపీ సేవలే అందేవి. తాజాగా వైద్యుల సంఖ్య 8కి పెరగడంతో మరిన్ని సేవలు అందనున్నాయి. ఆసుపత్రిలో ప్రసవాలు, శస్త్రచికిత్సలు చేయించుకున్నవారికి ఆహారాన్ని అందించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు. ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ వైద్యుడు ఉన్నా.. ఎక్స్‌రే సౌకర్యం లేకపోవడంతో డబ్బులు చెల్లించి వేరేచోట చేయించుకుంటున్నామని రోగులు వాపోతున్నారు. దంత వైద్యుడు ఉన్నా పూర్తిస్థాయిలో సేవలు అందించాల్సి ఉంది. ల్యాబ్ నిర్వాహకుడు ఒక్కరే ఉండటంతో పలు రకాల పరీక్షలు చేయడంలో ఇబ్బంది ఎదురవుతుంది. ఆసుపత్రిలో మరో ల్యాబ్ టెక్నిషియన్, సహాయకుడిని నియమించాలని కోరుతున్నారు.

మెరుగైన వైద్యం అందిస్తాం

జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు, మెరుగైన వైద్యం అందించేందుకు దృష్టి సారిస్తాం. ఇప్పటికే వైద్యులకు, సిబ్బందికి సూచనలు చేశా. ఆసుపత్రిలో సోమవారం, గురువారం ప్రసవాలు, శస్త్రచికిత్సలు చేస్తాం. ప్రస్తుతం అవసరమైన సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. – శ్రీకాంత్‌రెడ్డి, ఇన్‌చార్జి సూపరింటెండెంట్, ప్రభుత్వ ఆసుపత్రి, జమ్మికుంట

# సరదా అనుకోకు.. ప్రమాదం పాలవకు



వికారాబాద్ : ఇటీవలి వర్షాలకు జిల్లాలోని చెరువులు, కుంటలు, వాగులు, బావులు పొంగి పొర్లుతున్నాయి. వీటిని చూసేందుకు సందర్శకులు వస్తున్నారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా వాటిలో దిగి ఈత కొట్టేందుకు, స్నానం చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు ఈత రాక నీట మునిగి 13 మంది మృతి చెందారు. మరోవైపు జిల్లా వ్యాప్తంగా గణేశ్ నిమజ్జనాలు జరుగుతున్నాయి. ఇందుకోసం పిల్లలు, యువకులు నీళ్లలోకి దిగుతున్నారు. ఇలాంటి క్లిష్ట తరుణంలో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలపాలు కాకుండా ఉంటారు. దీనికి సంబంధించి కథనం.

తొర్రుకుంట.. లోతు చాలా ఎక్కువ

తాండూరు పట్టణ శివారు కోకట్ గ్రామ సమీపం తొర్రుకుంటలో నెలల తరబడి తవ్వకాలు జరపడంతో 100 నుంచి 120 అడుగుల లోతు గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవలి భారీ వర్షాలకు వచ్చిన వరదతో నిండుగా కనిపిస్తోంది. చెరువు సమీపంలోనే ప్రభుత్వ పాఠశాల ఉంది. విద్యార్థులు బహిర్భూమి కోసం ఇక్కడికి వస్తుంటారు. చెరువును ఆనుకునే వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణం, డంపింగ్ యార్డు ఉన్నాయి. ఇక్కడ వచ్చే వారు చెరువు నీటితో కాళ్లు, చేతులు శుభ్రం చేసుకోవడానికి వెళ్లినప్పుడు అదుపు తప్పి పడిపోతే ఇక అంతే సంగతులు. నీటి పారుదల శాఖ కట్టపై హెచ్చరికగా.. 'చెరువులోకి దిగడం ప్రమాదకరం' అని రాసిన బోర్డుపై ఇప్పుడు అక్షరాలు కనిపించడంలేదు.

తాత్కాలిక ముళ్లకంచెతో సరి!

పరిగి మండలంలోని లఖ్నాపూర్ రిజర్వాయర్ జలకళను సంతరించుకోవడంతో సందర్శకుల సంఖ్య పెరుగుతోంది. ప్రాజెక్టు మీదుగా ఏర్పాటు చేసిన నడక దారి ప్రమాదకరంగా మారింది. అక్కడికి వెళ్లకుండా అధికారులు తాత్కాలికంగా ముళ్లకంచెను ఏర్పాటు చేశారు. కానీ ప్రజలు మాత్రం వాటిని దాటుకొని ప్రాజెక్టు అందాలను తిలకించేందుకు ప్రమాదకర పరిస్థితిలోకి వెళ్తున్నారు.

తీసుకోవాల్సిన కనీస జాగ్రత్తలు

చెరువుల మరమ్మతులు చేసే సందర్భాల్లో అక్కడ ప్రమాద హెచ్చరిక బోర్డును అధికారులు ఏర్పాటు చేయించాలి.

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ బావుల దగ్గర సంబంధిత యజమానులు కంచె ఏర్పాటు చేయాలి.

చెరువులు, ఇతర జలాశయాల్లో అడుగున బురద పేరుకుపోయి ఉంటుంది. లోతు తెలుసుకోకుండా ఈత వచ్చినా అందులో దూకితే ప్రమాదం తప్పదు.

ఇవిగో ఉదాహరణలు

ఈ నెల 7న యాలాల్ మండలం హాజీపూర్‌లో ప్రమాదవశాత్తు బావిలో పడి ఈత రాక ఎర్ర హన్మంతు (34) మృతి.

ఇటీవల పెద్దేముల్ మండలం శివారులోని సుద్దగుంతలో పడి వ్యక్తి చనిపోయాడు.

ఈ నెల 6న యాలాల్ మండలం దౌలాపూర్‌లో నీటి సంపులో పడి పదేళ్ల బాలుని మృతి.

2023 లో మన్నెగూడకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురు యువకులు కోట్‌పల్లి ప్రాజెక్టుకు విహరించడానికి వెళ్లి ఈత రాక నీట మునికి మృత్యువాత పడ్డారు.

రక్షణలేని పాలేపల్లి తూము

దోమ: దోమ మండలం పాలేపల్లి ఊరచెరువు నిండితే చూడ్డానికి పిల్లలు, మహిళలు వస్తారు. చెరువు కట్ట నిటారుగా ఉంటుంది. చూసే క్రమంలో కాలు జరితే నీటిలోకి పడిపోతారు. రక్షణలేక గతంలో గ్రామానికి చెందిన పాష, రాములుగౌడ్, చంద్రయ్య, లక్ష్మి మృతిచెందారు. కంచె ఏర్పాటు చేస్తే సమస్య ఉండదు.

పిల్లలు, యువకులపై కన్నేసి ఉంచాలి

చెరువులు, కుంటలు, బావుల లోతు తెలియక, ఈత రాక మృత్యువాత పడ్డ పిల్లల సంఘటనలు జిల్లాలో అక్కడక్కడా చోటు చేసుకుంటున్నాయి. అందుకే పిల్లలు, యువతపై తల్లిదండ్రులు ఓ కన్నేసి ఉంచాలి. ఇంటి నుంచి బయటికి వెళ్లి ఎవరితో ఆటలాడుకుంటున్నారు, ఎక్కడికి వెళ్తున్నారనే విషయాన్ని గమనించాలి. నారాయణరెడ్డి, జిల్లా పోలీసు అధికారి.

# పెద్దపల్లి రైల్వేస్టేషన్ ఉన్నతీకరణ




పెద్దపల్లి: పెద్దపల్లి రైల్వేస్టేషన్ ఉన్నతీకరణకు కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖ ఉత్తర్వులను వెలువరించింది. రైల్వేస్టేషన్ ఉన్నతీకరణతో పెద్దపల్లి స్టేషన్‌లో ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పలు సూపర్ ఫాస్ట్ రైళ్ల హాల్టింగ్‌లు లభించనున్నాయి. కాజీపేట, బల్హార్షా సెక్షన్‌లలో పెద్దపల్లి స్టేషన్ మాత్రమే ఎన్ఎస్‌జీ(నాన్ సబర్బన్ గ్రేడ్)–5 స్థాయి నుంచి ఎన్ఎస్‌జీ–4 స్థాయికి ఉన్నతీకరణ జరిగింది. దీంతో దక్షిణమధ్య రైల్వే జోన్‌లో ఎన్ఎస్‌జీ–4 స్టేషన్ల సంఖ్య 38కి పెరిగింది. ఈ సెక్షన్‌లోని రామగుండం, సిర్పూర్‌కాగజ్‌నగర్ స్టేషన్లు ఇప్పటికే ఎన్ఎస్‌జీ–4 స్థాయిలో ఉండగా, మంచిర్యాలతో పాటు కాజీపేట, వరంగల్ స్టేషన్లు ఎన్ఎస్‌జీ–3 స్థాయిలో ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, జమ్మికుంట స్టేషన్లు ఎన్ఎస్‌జీ– 5 స్థాయిలో ఉన్నాయి. రైలు ప్రయాణికులు, టికెట్ల విక్రయాల ద్వారా వచ్చే ఆదాయం ఆధారంగా రైల్వే బోర్డు రైల్వేస్టేషన్ స్థాయిని నిర్ణయిస్తుంది. అందుకు అనుగుణంగా ప్రయాణికులకు వసతులను కల్పిస్తుంది.

అమృత్‌స్టేషన్ నమూనాలో మార్పులు

పెద్దపల్లి రైల్వేస్టేషన్ స్థాయి పెంపుపై గతంలోనే రైల్వే బోర్డు నిర్ణయం తీసుకోవడంతో ఇక్కడ చేపట్టిన అమృత్ స్టేషన్ పనులు తాత్కాలింగా నిలిచిపోయాయి. మారిన స్టేషన్ స్థాయికి అనుగుణంగా మార్పులు, చేర్పులు చేసేందుకు పనులు నిలిపివేశారు. స్టేషన్ డిజైనింగ్ మార్చడంతో పాటు పలు సాంకేతిక అంశాలపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుత అవసరాలతో పాటు భవిష్యత్తు ప్రణాళికలకు అనుగుణంగా రైల్వేస్టేషన్ నమూనాను మార్చనున్నారు. రాఘవపూర్– మణుగూరు రైల్వే మార్గానికే కేంద్రం ఆమోదం తెలపడంతో సింగరేణి ప్రాంతాలకు కూడలిగా పెద్దపల్లి స్టేషన్ మారనుంది. సింగరేణి ప్రాంతాన్ని ప్రతిబింబించే విధంగా రైల్వేస్టేషన్ నమూనా రూపకల్పనకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. తుదిరూపం వచ్చిన తరువాతే అమృత్ స్టేషన్ పనులు మొదలయ్యే అవకాశముంది.

పెరగనున్న వసతులు

పెద్దపల్లి రైల్వేస్టేషన్, ప్రయాణికుల ద్వారా రైల్వే శాఖకు గత ఆర్థిక సంవత్సరంలో రూ.10,69,48,439 ఆదాయం సమకూరింది. ఈస్టేషన్ ద్వారా 7,23,007 మంది ప్రయాణించారు. కేవలం 24(వీక్లీ ట్రైయిన్‌లతో కలిపి) రైళ్లు మాత్రమే హాల్టింగ్ కలిగిన ఈస్థాయిలో ఆదాయం సమకూరింది. సమీపంలోని రామగుండంలో 43, మంచిర్యాలలో 32 రైళ్లకు హాల్టింగ్ ఉండగా ఆయా స్టేషన్లకు ఆదాయం కొంత ఎక్కువగా ఉంటుంది. స్టేషన్ స్థాయి పెరగడంతో ఇక్కడ కూడా పలు సూపర్ ఫాస్ట్ రైళ్లకు హాల్టింగ్‌లను రైల్వేశాఖ కల్పించనుంది. ఇక్కడి నుంచి కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు అనుసంధానం లేదు. ఉత్తరాది రాష్ట్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తాంధ్రకు మాత్రమే అనుసంధానం ఉంది. తిరుపతి మినహా రాయలసీమ ప్రాంతానికి రైల్వే అనుసంధానం పెద్దపల్లి జిల్లా కేంద్రం నుంచి లేదు. దీంతో ఉమ్మడి జిల్లా ప్రయాణికులు కాజీపేట, వరంగల్, మంచిర్యాల స్టేషన్ల ద్వారా ఆయా ప్రాంతాలకు ప్రయాణాలకు సాగిస్తున్నారు.

# ఆక్రమణలో వరద కాలువ స్థలాలు

మెట్‌పల్లి: జలవనరుల శాఖకు చెందిన విలువైన స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి. వరద కాలువ అవసరాల కోసం సేకరించిన మిగులు భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. సంబంధిత అధికారులు నోటీసులు జారీ చేసి మిన్నకుండిపోతుండడంతో యథేచ్ఛగా వరద కాలువ స్థలాల ఆక్రమణలు, నిర్మాణాలు చేపడుతున్నారు. జగిత్యాల జిల్లాలో వరద కాలువ ఇబ్రహీంపట్నం మండలంలో 28వ కి.మీ నుంచి ప్రారంభమై మల్యాల మండలంలో 86వ కి.మీ వద్ద ముగుస్తోంది. సుమారు 58 కి.మీ పొడవున వరద కాలువ ఉంది. కాలువ నిర్మాణంతో పాటు తవ్విన మట్టి నిల్వకు అనుగుణంగా భూసేకరణ చేశారు. కాలువ నిర్మించడంతో పాటు ఇరువైపులా రహదారి, కాల్వ కోతకు గురి కాకుండా పటిష్ఠత కోసం మట్టిని పోశారు. ప్రధాన కాలువ మధ్యలో నుంచి ఇరువైపులా 70–100 మీటర్ల చొప్పున భూసేకరణ చేశారు. సరైన పర్యవేక్షణ, హద్దురాళ్లు లేకపోవడంతో వరద కాలువ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా గ్రామాలకు సమీపంలో ఉన్న చోట మట్టి తరలించి చదును చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. మట్టి తొలగించడంతో పలు చోట్ల వరద నీటికి కట్ట బలహీనపడి కోతకు గురై ప్రమాదకరంగా మారుతోంది. పక్కా నిర్మాణాలు.. పంటలు వరద కాలువ పటిష్ఠత కోసం పోసిన మట్టిని కొందరు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కాలువ మట్టిని అక్రమార్కులు తరలించడంతో ఖాళీ స్థలాలు ఏర్పడుతున్నాయి. దీంతో సమీపంలోని రైతులు స్థలాన్ని తమ భూమిలో కలిపేసుకొని చదును చేయడంతో పాటు దుక్కి దున్ని పంటల సాగు చేపడుతున్నారు. అంతే కాకుండా పలు చోట్ల పక్కా నిర్మాణాలు కూడా చేపట్టారు. ఆలయాలు, ప్రభుత్వ భవనాలు, ఫంక్షన్ హాళ్లు, కంపోస్టు షెడ్లు, వైకుంఠధామాలు, క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాలు ఇలా పలు రకాలుగా వినియోగించుకుంటున్నారు. జలవనరుల శాఖ అధికారులు నోటీసులు ఇస్తున్నప్పటికీ రాజకీయ ఒత్తిళ్లతో మిన్నకుండిపోతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ అవసరాల కోసం వినియోగిస్తున్నందున చూసీచూడనట్లు వ్యవహరించాలని సూచిస్తుండడంతో ఏమీ చేయలేకపోతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో వరద కాలువ స్థలాలను ఆక్రమించడం పరిపాటైంది.

నోటీసులు ఇస్తున్నాం

వరద కాలువ స్థలాలను ఆక్రమించిన వారికి నోటీసులు ఇస్తున్నాము. పక్కా నిర్మాణాలు చేపట్టవద్దని ఆదేశిస్తున్నాము. చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటాము.

– వెంకటేశ్వర్లు, ఈఈ, మెట్‌పల్లి జలవనరుల శాఖ

# ఇంధన పోటీలు..!

నల్గొండ : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఇంధన వనరులపై ఆసక్తి పెంచేలా చేయడం, వాటి పరిరక్షణపై అవగాహన లక్ష్యంగా రెడ్కో సంస్థ చిత్ర లేఖన పోటీలకు శ్రీకారం చుట్టింది. కేంద్ర విద్యుత్తు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయివరకు పోటీలను నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యార్థుల నుంచి జూనియర్, సీనియర్ విభాగాలుగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులంతా ఇందులో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు.

అక్టోబరు 20 లోగా దరఖాస్తులు..

ఆసక్తి ఉన్న విద్యార్థులు అక్టోబరు 20వ తేదీ నాటికి దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. 'ఎ', 'బి', గ్రూపులుగా పోటీలుంటాయి. 'ఎ' గ్రూపులో 5, 6, 7 తరగతుల విద్యార్థులు, 'బి' గ్రూపులో 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉంటారు. ప్రతి విద్యార్థి తమ పెయింటింగ్స్ ఎ–4 పేపర్‌లోనే వేయాల్సి ఉంటుంది. అక్టోబరు చివరి వారంలో జిల్లా స్థాయి పోటీలు ఉంటాయి.

టీఎస్ రెడ్కో ఆధ్వర్యంలో నవంబరు 14న రాష్ట్ర స్థాయి పోటీలు ఉంటాయి. రెండు గంటల వ్యవధి ఉంటుంది. ఇందులో విజేతలుగా నిలిచిన వారికి మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో విజేతకు రూ.30 వేలు, మూడో బహుమతిగా రూ.20 వేలు అందిస్తారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి రూ.2 వేల నగదు, ప్రశంసాపత్రాలు అందజేస్తారు. డిసెంబరు 14న ఇంధన వనరుల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తారు. మొదటి మూడు బహుమతుల కింద వరుసగా రూ.లక్ష, రూ.50 వేలు, రూ.30 వేలు అందజేస్తారు. ల్యాప్‌టాప్ ఇస్తారు. టాప్ టెన్ వరకు నిలిచిన వారి వరకు రూ.15 వేల నగదు, ప్రశంసాపత్రం, ట్యాబ్‌లను అందిస్తారు. పోటీలు ఇంధన శక్తిని పరిరక్షించడం, పర్యావరణాన్ని కాపాడటం.. శక్తి సంరక్షణే పర్యావరణ సంరక్షణపై నిర్వహిస్తారు.

విద్యార్థులకు మంచి అవకాశం..

చిత్రలేఖనంలో రాణించే విద్యార్థులకు ఇది మంచి అవకాశం. ఇంధనం శక్తి పర్యావరణానికి సంబంధించి పెయింటింగ్స్ వేసి జాతీయ స్థాయి వరకు వెళ్లొచ్చు. విజేతలకు మంచి బహుమతులున్నాయి. పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. చిత్రలేఖన పోటీల విషయమై ఇప్పటికే కలెక్టర్లు, డీఈవోలకు లేఖలు పంపాం. పాండు రంగారావు, రెడ్కో సంస్థ ఉమ్మడి జిల్లా మేనేజర్

# ఏరు పారినా.. నీరుండదు..!

నల్గొండ : ఎంత వర్షం కురిసినా.. వాగులు, వంకలు పారినా ఇక్కడి చెరువులు నిండవు.. ఈ ప్రాంత కరవు తీరదు. ఎందుకీ దుర్భిక్షం.. ఎక్కడుందీ నిర్లక్ష్యం.. సాగునీటి వనరులు లేక పూర్తిగా వర్షాధారంపైనే పంటలు పండించే నాంపల్లి మండల రైతులకు వాన నీటిని ఒడిసి పట్టే వనరులు లేకపోవడంతో నీరు వృథాగా పోతోంది. వానాకాలంలో అడపాదడపా కురిసే వర్షాలతో చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతుందని ఆశించే అన్నదాతలకు ఏటా నిరాశే మిగులుతోంది. అత్యంత విలువైన వర్షపు నీరు చెరువుల్లోకి మళ్లించే పరిస్థితులు లేకపోవడంతో వాగు పాలవుతోంది. ఇటీవల భారీ వర్షాలు పడినా ప్రధాన చెరువుల్లో నీరు చేరలేదు. బోర్లు అప్పుడే ఆగి పోస్తున్నాయి. నాంపల్లి, పెద్దాపురం చెరువులు 2013 నుంచి ఇప్పటివరకు అలుగు పోయలేదంటే పరిస్థితులు అర్థం చేసుకోవచ్చు.

పదిహేనేళ్ల క్రితం ఫీడర్ ఛానల్ పునరుద్ధరణకు అప్పటి ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసింది. రూ.90 లక్షలతో నెమిళ్లగూడెం వద్ద శేషిలేటి వాగుపై ఫీడర్ ఛానల్ ఏర్పాటుకు చెక్ డ్యాం నిర్మించి, రూ.10 లక్షలతో ఫీడర్ ఛానల్ కాలువ పనులకు శ్రీకారం చుట్టారు. కానీ అప్పటి రాజకీయ పరిస్థితుల కారణంగా పనులు అర్ధంతరంగా నిలిపివేశారు. ఏటా శేషిలేటి వాగు పొంగి ప్రవహిస్తున్నా చెరువులకు చుక్క నీరు చేరడంలేదు. ఇటీవల రాష్ట్రమంతటా భారీ వర్షాలు కురిశాయి. మండలంలోని శేషిలేటి వాగూ పొంగి ప్రవహించినప్పటికీ చెరువులు జలకళకు నోచుకోలేదు. ఫీడర్ ఛానల్ పనులు పూర్తయితే నాంపల్లి, పెద్దాపురం చెరువులు జలకళ సంతరించుకోవడంతోపాటు సుమారు 700 ఎకరాల ఆయకట్టు భూములు సాగులోకి వచ్చే అవకాశం ఉంది. భూగర్భ జలాలు పెరిగి మండలంలో తాగు, సాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

చెరువులకు చేరని వాన నీరు.. నాంపల్లి మండలంలో ప్రధానంగా శేషిలేటి వాగు, పులుసు వాగులున్నాయి. చింతపల్లి మండలం నుంచి ప్రవహించే పులుసువాగు మండలంలోని పస్నూరు పెద్ద చెరువులో కలుస్తుంది. శేషిలేటివాగు మర్రిగూడ మండలం నుంచి ప్రారంభమై మండలంలోని దామెర, నెమిళ్లగూడెం, రాందాస్‌తండా, చామలపల్లి, గానుగుపల్లి గ్రామాల ద్వారా ప్రవహించి గుర్రంపోడు మండలంలోని చేపూరు చెరువులో కలుస్తుంది. స్థానికంగా కురియకున్నా.. పై మండలాల్లో కురిసిన వర్షాలకు ఏటా ఈ వాగుల్లో నీరు ప్రవహిస్తోంది. పులుసు వాగు ద్వారా పస్నూరు పెద్దచెరువుకు ఏటా కొద్దోగొప్పో నీరొచ్చి చేరుతోంది. ఇక నాంపల్లి నాగుల, పెద్దాపురం పెద్ద చెరువులను నింపేందుకు నిజాం కాలంలోనే ఫీడర్ ఛానల్ నిర్మించారు. దీని కాలువ భూములను ఆక్రమించి చదును చేసి సాగుకు అనుకూలంగా మలుచుకోవడంతో దశాబ్ధాలుగా ఈ చెరువులకు నీరు చేరడంలేదు.

# డైరెక్టర్ల స్థానాలు దక్కేదెవరికో..!

భువనగిరి : నల్గొండ– రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ల ఎన్నిక ఈ నెల 13న జరగనుంది. ఖాళీగా ఉన్న ఆరు స్థానాలకు పోటీ తీవ్రంగా ఉంది. ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి నాలుగు, రంగారెడ్డి జిల్లా నుంచి రెండు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. జిల్లా నుంచి ఒగ్గు భిక్షపతి, కల్లెపల్లి శ్రీశైలం, గుడపాటి మధుసూదన్‌రెడ్డి, డి.సోమిరెడ్డి, పుష్పాల నర్సింహులు, బత్తుల నరేందర్‌రెడ్డి, ఎస్.భాస్కర్, ఎం కొండల్‌రెడ్డి పోటీలో ఉన్నారు. రంగారెడ్డి జిల్లా నుంచి నలుగురు బరిలో ఉన్నారు. అత్యధిక స్థానాలు గెలుచుకుని డెయిరీ ఛైర్మన్ పీఠం కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. అధికార పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించేందుకు అన్ని రకాలు ప్రయత్నాలు చేస్తున్నారు. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష భారాస తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు క్యాంపు రాజకీయాలకు తెరదీశాయి. 297 మందికి ఓటు..సంఘంలో 348 మంది సభ్యులుగా ఉండగా.. 297 మంది పాల సంఘాల సొసైటీ ఛైర్మన్లకు ఓటు హక్కు ఉంది. వీరంతా ఈ నెల 13న హయత్‌నగర్‌లోని మదర్‌డెయిరీ కార్యాలయంలో ఆరు డైరెక్టర్ స్థానాలకు తమ ఓటు వేయనున్నారు. డెయిరీలో మొత్తం 15 స్థానాలు ఉంటాయి. ప్రతి సంవత్సరం రొటేషన్ పద్ధతిలో మూడు స్థానాలు ఖాళీ అవుతుంటాయి. ఖాళీ అయిన వాటికి ఎన్నికలు నిర్వహిస్తుంటారు. గతేడాది ఖాళీ అయిన మూడు స్థానాలకు ఎన్నికల నిర్వహించకపోవడంతో మొత్తం ఈ ఏడాదితో కలుపుకొని ఆరింటికి ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఎన్నికైన ఒక్కో డైరెక్టర్ ఐదేళ్లు కొనసాగుతారు. ప్రస్తుత ఎన్నిక అనంతరం 14వ తేదీన ఛైర్మన్ ఎన్నిక జరగనుంది.

# చిన్న అపార్ట్‌మెంట్లకు 'షాక్'

హైదరాబాద్: నగరంలో సర్కిళ్ల వారీగా విద్యుత్తు నియంత్రికల(డీటీఆర్) లోడ్‌పై డిస్కం చేపట్టిన సర్వేలో విస్తుగొలిపే విషయాలు వెల్లడయ్యాయి. అపార్ట్‌మెంట్లలో 20 కిలోవాట్ కంటే అధికంగా లోడ్ ఉంటే ప్రత్యేకంగా డీటీఆర్ ఏర్పాటు చేసుకోవాలి. పలు సర్కిళ్లలో పెద్ద సంఖ్యలో చిన్న అపార్ట్‌మెంట్లు పబ్లిక్ డీటీఆర్‌ల నుంచి కనెక్షన్లు పొందాయి. తాజాగా చేపట్టిన సర్వేలో క్షేత్రస్థాయిలో కొందరు సిబ్బంది, అధికారులు బిల్డర్లతో కలిసి నిబంధనలకు విరుద్ధంగా జారీ చేసిన కనెక్షన్ల బాగోతం వెలుగులోకి వస్తోంది. ఇప్పటి వరకు 1585 అపార్ట్‌మెంట్లకు రహదారిపై ఉండే పబ్లిక్ డీటీఆర్ నుంచి విద్యుత్తు కనెక్షన్లు ఇచ్చినట్లు గుర్తించారు. సర్వే పూర్తయితే ఆ సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందని ఇంజినీర్లు అంటున్నారు.

మణికొండలో కుప్పలుగా... మణికొండ పంచాయతీ పరిధిలో ఉ



న్నప్పుడు భారీగా అక్రమ నిర్మాణాలు వెలిశాయి. అక్రమంగా విద్యుత్తు కనెక్షన్లూ పొందారు. పబ్లిక్ డీటీఆర్‌ల నుంచి అపార్ట్‌మెంట్లకు 200కు పైగా కనెక్షన్లు పొందారు. సైబర్‌సిటీ సర్కిల్‌లోనూ ఈ తరహా కనెక్షన్లు వెలుగుచూడటం అధికారులను ఆశ్చర్యానికి గురి చేసింది.

ఆయా అపార్ట్‌మెంట్లకు నోటీసులు.. నిబంధనలకు విరుద్ధంగా పబ్లిక్ డీటీఆర్ నుంచి విద్యుత్తు కనెక్షన్లు పొందిన అపార్ట్‌మెంట్లకు, వాణిజ్య భవనాలకు అధికారులు నోటీసులు ఇవ్వనున్నారు. అపార్ట్‌మెంట్లు, గ్రూప్ హౌసింగ్, వాణిజ్య భవనాలకు సంబంధించి 20 కిలోవాట్లకు మించిన లోడ్ ఉంటే ప్రత్యేకంగా డీటీఆర్ ఏర్పాటు తప్పనిసరి అని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ 'ఈనాడు'తో అన్నారు.

# దత్తత ఉత్తమాట.. ఆక్రమణలకు వేశారు బాట

హైదరాబాద్: రాజధానిలో కొన్ని సంస్థలు చెరువుల దత్తత మాటున చేసిన అక్రమాలను హైడ్రా వెలుగులోకి తీసుకొస్తోంది. చెరువుల దత్తతలో భారీ ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని అనేకమంది హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో 20 రోజులుగా వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. పూర్తి ఆధారాలతో నివేదిక తయారుచేస్తే చర్యలకు సిద్ధమవుదామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అధికారులకు సూచించారు

చెరువుల పక్కనే వెంచర్లు: గత ప్రభుత్వ హయాంలో కొంతమంది బిల్డర్లకు, ఇతర సంస్థలకు నగరంలోని 23 చెరువులను సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేయడానికి దత్తత ఇచ్చారు. దీన్ని కొందరు వారికి అనుకూలంగా మార్చుకున్నారు. కొన్ని సంస్థలకు ఆయా చెరువు వద్దే వారి వెంచర్లు ఉండటంతో.. వాటిని ఆక్రమించి దాన్ని సెట్‌బ్యాక్‌గా చూపించి హెచ్ఎండీఏ/జీహెచ్ఎంసీ నుంచి అనుమతులు తీసుకున్నా



యి. ఒకరిద్దరు చెరువు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేసినట్లు గుర్తించారు. ఎంతమేరకు ఆక్రమణకు గురైంది..ఎవరు ఎక్కడ నిర్మాణాలు చేపట్టారన్న దానిపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. సంబంధిత సంస్థలపై చర్యలతోపాటు ఆక్రమణలోని నిర్మాణాలను కూల్చివేయాలని భావిస్తున్నారు.

ఎవరా అధికారులు..?

హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన లేకుండా ఎలా అనుమతులిచ్చారు.. దానికి ఎవరు బాధ్యులు అన్నదానిపైనా ఆరా తీస్తున్నారు. దీనిపై కొద్ది రోజుల్లోనే చర్యలుంటాయని కమిషనర్ రంగనాథ్ తెలిపారు. దీంతోపాటు కొందరు నాలాలను కొంతమేర ఆక్రమించి వాటిపై శ్లాబులు వేసి వాటిని తమ స్థలంగా చూపించి నిర్మాణ అనుమతులు పొందినట్లు తేల్చారు. ఇప్పుడు వాటన్నింటిపైనా అధికారులు దృష్టిపెట్టారు.

# హెచ్ఎండీఏలో ఇంటర్‌నెట్ సేవలు కట్

హైదరాబాద్: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ)లో ఇంటర్‌నెట్ లేకపోవడంతో దాదాపు 10 నుంచి 12 గంటలపాటు ఆన్‌లైన్ సేవలు నిలిచిపోయాయి. ఇతర కార్యకలాపాలు బందయ్యాయి. ఈ పరిస్థితి ఏర్పడింది. తిరిగి మధ్యాహ్నం తర్వాత సేవలను అధికారులు పునరుద్ధరించారు. ప్రస్తుతం హెచ్ఎం డీఏ సిఫ్ సంస్థ నుంచి ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్(ఐఎస్‌పీ) సేవలను పొందుతోంది. ఈ సంస్థ గడువు తీరడంతో కొత్త సంస్థకు ఐఎస్‌పీ సేవలు కేటాయించారు. దీంతో ఐఎస్‌పీ కనెక్షన్లలో మార్పులు చేర్పుల వల్ల ఇంటర్నెట్‌లో కొంత అంతరాయం ఏర్పడింది. అదే సమయంలో స్టేట్ డేటా సెంటర్(ఎస్‌డీసీ)లో కూడా సర్వర్ల డౌన్ కావడంతో ఆ ప్రభావం హెచ్ఎండీ సేవలపై పడింది. హైడ్రా కూల్చివేతలు జరుగుతు ండటంతో ఒక్కసారిగా చెరువుల డేటా కన్పించకపోవడంతో పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. తర్వాత అధికారులు యథావిధిగా సమస్యను పరిష్కరించి సేవలను పునరుద్ధరించడంతో ఊపిరి పీల్చుకున్నారు.

# వలపు వల.. ఉచ్చులో చిక్కి విలవిల



హైదరాబాద్: నగరంలో ఏటా సుమారు 400కు పైగా పోక్సో కేసులు నమోదవుతున్నాయి. 80 శాతం కేసుల్లో నిందితులు బాలికలను మాటలతో మభ్యపెట్టి లోబరచుకున్న వారే ఉంటున్నారు. ఈ ఏడాది 8 నెలల వ్యవధిలో 500కు పైగా పోక్సో కేసులు నమోదయ్యాయి. వీటిలో 279 మంది బాధితులు ప్రేమికులు, స్నేహితుల కోసం ఇల్లొదిలిన వారు కావటం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతోంది. నగర పరిధిలోని 71 ఠాణాల్లో ఈ తరహా ఫిర్యాదులు సగటున రోజూ 1-2 వస్తుంటాయని సమాచారం.

ఓ ఇంటర్ విద్యార్థిని(16) ఆటోడ్రైవర్(35)తో ప్రేమలో పడింది. ఇల్లు విడిచి అతడితో వెళ్లిపోయింది. కొద్దిరోజులయ్యాక వ్యభిచార ముఠాకు విక్రయించేందుకు సిద్ధమయ్యాడు. ప్రమాదం పసిగట్టిన బాధితురాలు తప్పించుకొని బయటపడింది. అతడు అప్పటికే ముగ్గురు విద్యార్థినులను మోసగించినట్టు దర్యాప్తులో తేలింది.

ఉన్నత కుటుంబం. ఒక్కతే కూతురు(15). తల్లిదండ్రులు గారాబం చేశారు. పదో తరగతి వయసులో ముగ్గురి ప్రేమలో పడి మూడుసార్లు ఇల్లొదిలి వెళ్లిపోయింది. ప్రతిసారి ఇంటికి తీసుకొచ్చి పద్ధతి మార్చుకోమంటూ బతిమాలారు. కౌన్సెలింగ్‌లోనూ ఆ బాలికను దారికెలా తేవాలో అర్థం కావట్లేదని పోలీసు అధికారి తెలిపారు.

తెలిసీ తెలియని వయసు.. మంచిచెడు విచక్షణను అర్థం చేసుకోలేని మనసు. ఆప్యాయంగా పలకరించే వారంతా ఆత్మీయులుగా భావిస్తారు. వారి అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని యువకులు, మధ్యవయస్కులు బాలికలను వంచిస్తున్నారు. ప్రేమ, పెళ్లి అంటూ వంచిస్తున్నారు. వారు తీసుకొచ్చిన నగలు, డబ్బు కాజేసిన ప్రబుద్ధులు.. తర్వాత వ్యభిచార గృహాలకు విక్రయించేందుకు బరితెగిస్తున్నారని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు.

మోసపోతున్న బాలికల సగటు వయసు 12-15

మోసగాళ్ల సగటు వయసు 25-35

ఎందుకిలా వెళ్తున్నారంటే..

పరిణతిలేని వయసు

కుటుంబ సభ్యులకంటే బాగా చూసుకుంటాడనే నమ్మకం

తల్లిదండ్రుల పర్యవేక్షణలోపం

ప్రలోభాలకు గురికావటం

కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు, మానసిక ఒత్తిళ్లు

తాను చిన్నపిల్లని కాదని సొంత నిర్ణయాలు తీసుకోగలననే అభిప్రాయం.

హార్మోన్ల ప్రభావం, లైంగిక అంశాలపై ఆసక్తి.

దాచకుండా.. పంచుకోవటమే మార్గం

డాక్టర్ గీత, చిన్నారుల కౌన్సెలింగ్ నిపుణురాలు

వయసులో హార్మోన్ల మార్పు, ఆకర్షణ వారిపై ఎలాంటి ప్రభావం చూపుతుందో తల్లిదండ్రులు వివరించాలి. ప్రేమవలలో చిక్కి మోసపోయిన బిడ్డలను శత్రువులుగా చూడకుండా... సాధారణ జీవనం వైపు అడుగులు వేసేలా తోడ్పాటును అందించాలి.

# చర్లపల్లి స్టేషన్.. వెళ్లాలంటే పరేషాన్




హైదరాబాద్ : అత్యాధునిక హంగులతో.. అంతర్జాతీయ ప్రమాణాలతో చర్లపల్లి రైల్వే స్టేషన్ సిద్ధమైంది. జాతికి అంకితం చేయడానికి ప్రధాని నరేంద్రమోదీ త్వరలో రానున్నారు. ఇవన్నీ బాగున్నా.. ఆ స్టేషన్‌కు చేరుకోవడమెలా అనేదే ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. స్టేషన్ నిర్మాణం ప్రారంభించిప్పటినుంచి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు రాస్తూ.. ఇరువైపులా రోడ్లను 100 మీటర్ల మేర విస్తరించాలని రైల్వే విజ్ఞప్తులు చేస్తూనే ఉంది. అవేవీ నాటి పాలకులకు పట్టలేదు. కొత్త ప్రభుత్వం కూడా ఇప్పటివరకు దృష్టి సారించకపోవడంతో.. స్టేషన్ ప్రారంభంనాటికి రహదారుల విస్తరణ జరిగేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎంఎంటీఎస్ రెండోదశ అందుబాటులోకి వచ్చినా ప్రయాణికులు ఈ స్టేషన్‌కు చేరుకునే వెసులుబాటు కలగలేదు. సరైన రహదారులు లేకపోవడంతో సిటీ బస్సుల సేవలు కూడా అందుబాటులోకి రాలేదు. ఇలాంటి తరుణంలో స్టేషన్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే.. ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందితప్పని పరిస్థితి ఏర్పడింది.

పెండింగ్‌లోనే ప్రక్రియ..

40 కిలోమీటర్ల పరిధి నుంచి ప్రయాణికులు చర్లపల్లి స్టేషన్‌కి చేరేందుకు రెండు మార్గాలున్నాయి. మహాలక్ష్మినగర్ నుంచి ఉన్న 40అడుగుల పాతరోడ్డును 80 అడుగుల మేర విస్తరించాల్సిఉంది. చర్లపల్లి టెర్మినల్ ముఖద్వారం నుంచి ఐవోసీఎల్‌ను కలుపుతూ 100 అడుగుల మేర మరోరోడ్డు విస్తరించాలని ప్రతిపాదించారు. జీహెచ్ఎంసీ అధికారులు సర్వేలు చేశారు. మహాలక్ష్మిరోడ్డు విస్తరణకు రూ.15కోట్ల విలువైన ఆస్తులను తొలగించాలని గుర్తించారు. ఇచ్చేందుకు కాలనీవాసులు సుముఖంగా లేకపోవడంతో విస్తరణ పెండింగ్‌లో పడింది. ఇక 100 అడుగుల రోడ్డు విస్తరణలో 80శాతం భూములను అటవీశాఖ నుంచి, 20 శాతం చర్లపల్లి పారిశ్రామికవాడ నుంచి సేకరించాల్సి ఉంది. పెట్రోలియం, గ్యాస్ సంస్థలను తరలిస్తే..చర్లపల్లి స్టేషన్ చుట్టూ ఐవోసీ, హెచ్‌పీ, బీపీసీఎల్ సంస్థల గ్యాస్, పెట్రోలియం సంస్థల గోదాములు న్నాయి. వీటిని వేరే ప్రాంతాలకు తరలించాలనే ప్రతిపాదనలున్నాయి. ఐవోసీ, బీపీసీఎల్‌ను నార్కెట్‌పల్లికి తరలించే ప్రక్రియ దశలవారీగా కొనసాగుతోంది. మిగిలిన వాటిని తరలించే ప్రక్రియ పూర్తయితే దాదాపు 100 ఎకరాల స్థలం లభిస్తుంది. దీన్ని రైల్వేకు బదలాయిస్తే సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ కంటే సువిశాలమైన రైల్వే స్టేషన్ ఇక్కడ నిర్మించడానికి వెసులుబాటు ఉండేది. భూ సేకరణ జాప్యం కావడంతో రైల్వే వద్ద ఉన్న 50 ఎకరాల్లోనే చర్లపల్లి రైల్వే స్టేషన్ విస్తరణ పనులు జరిగాయి.

# తవ్వుతూ.. తరలిస్తూ



సిరిసిల్ల : కాళేశ్వరం ప్యాకేజీలు, అదనపు టీఎంసీ పనుల్లో బయటపడ్డ బండరాళ్లు అక్రమార్కులకు ఆదాయ వనరులుగా మారాయి. కాల్వలు, సొరంగాల తవ్వకాల్లో బయటపడ్డ రాళ్లను వాహనాల్లో క్రషర్‌లకు తరలిస్తున్నారు. కొన్నిచోట్ల అసంపూర్తి పనులు, మరికొన్ని చోట్ల గుత్తేదారు సంస్థలు క్యాంపులను వదిలివెళ్లడంతో నీటిపారుదలశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో అక్రమార్కులకు అడ్డు చెప్పేవారు లేకుండా పోయారు. ఫలితంగా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. జిల్లాకు సాగునీరందించే కాళేశ్వరం 9, 10 ప్యాకేజీలతో పాటు అదనపు టీఎంసీ పనులు జరుగుతున్నాయి. కాళేశ్వరం ప్రధాన కాల్వలు, సొరంగాలు తవ్వకాల పనులన్నీ మూడేళ్ల క్రితమే పూర్తయ్యాయి. అదనపు టీఎంసీ పనులపై ప్రభుత్వంలో సందిగ్ధత నెలకొనడంతో ఆరు నెలల క్రితమే గుత్తేదారు సంస్థ పనులను మధ్యలో నిలిపేసి, క్యాంపులను ఖాళీ చేసి వెళ్లిపోయింది. సొరంగాలు, కాల్వలు, జలాశయాల తవ్వకాల్లో భారీగా రాళ్లు బయటపడ్డాయి. వీటిని చాలా వరకు జలాశయాల రివిట్‌మెంట్ కోసం గుత్తేదారులు కంకరగా మార్చారు. సీసీల నిర్మాణాలకు, సొరంగంలో గ్రౌటింగ్ పనులకు అందులో బయటపడ్డ రాళ్లనే వాడారు. మిగిలిన రాళ్లను కాల్వలు, సొరంగం సమీపంలోనే వదిలేశారు.కాల్వలు, జలాశయాల తవ్వకాల్లో విలువైన మట్టిని కూడా అక్రమార్కులు వదలడం లేదు. బోయినపల్లి, ఇల్లంతకుంట, తంగళ్లపల్లి, కోనరావుపేట మండలాల పరిధిలో ఎత్తిపోతల పథకం పంపుహౌస్‌ల సమీపం నుంచి భారీ ఎత్తున తరలించారు. ఇక్కడి నుంచి మట్టిని తవ్వి సమీపంలోని గ్రామాలకు తరలిస్తున్నారు. పట్టణంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు విక్రయించేందుకు స్థానికంగా ట్రాక్టర్ యజమానులు సిండికేట్‌గా మారారు.

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం సాగునీటి ప్రాజెక్టుల పనులేవీ జరగడం లేదు. నీటిపారుదల, రెవెన్యూ, గనుల శాఖల అధికారులు ఎవరూ ఇటువైపు రావడం లేదు. ఈ ప్యాకేజీల పరిధిలోని ఏఈల మొదలు ఈఈల వరకు అందరూ సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల కేంద్రాల్లోని డివిజన్ కార్యాలయాలకే పరిమితమయ్యారు. ప్రాజెక్టుల తవ్వకాల్లో బయటపడిన బండరాళ్లను గుట్టుచప్పుడు కాకుండా క్వారీలకు తరలిస్తున్నారు.

కాలువ తవ్వే సమయంలో కొన్ని చోట్ల రాతి పొరలు వచ్చాయి. వాటిని పగులగొట్టి కరకట్టల వెంట పటిష్ఠతకు కుప్పలుగా పోశారు. మిగిలిన వాటిని ఎక్కడికక్కడే వదిలేశారు. ఇప్పుడు వాటిపై క్రషర్ యజమానుల కన్ను పడింది. వీటిని అనువైన సమయంలో క్రషర్లకు తీసుకెళ్లి కంకరగా మార్చుతున్నారు. కంకర విక్రయాల్లో జిల్లాలోని క్రషర్ యజమానులంతా సిండికేట్‌గా మారి ధరలు నిర్ణయిస్తున్నారు. వీటిని అడ్డుకునేవారు లేకుండా పోయారు.

వేలం ద్వారా విక్రయించాలి

ప్రాజెక్టుల తవ్వకాల్లో బయటపడిన గ్రావెల్, బండలను గుత్తేదారులు ఆయా ప్రాజెక్టుల్లో అంతర్గత పనులకు వినియోగించుకోవచ్చు. మిగిలిన వాటికి సంబంధించి నీటిపారుదలశాఖ మాకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. అక్కడి నిల్వల ప్రకారం వేలం ద్వారా విక్రయించాల్సి ఉంటుంది. - క్రాంతికుమార్, సహాయ సంచాలకుడు, గనులశాఖ

# మన జాగాలో వద్దు.. రోడ్డు మీద పెట్టు

హైదరాబాద్: నగరంలో గృహ, అపార్ట్‌మెంట్ల యజమానులు, నిర్మాణదారులు కొందరు సెట్‌బ్యాక్ లేకుండా నాలుగైదు అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు. జాగా లేక విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ఏకంగా రహదారులను ఆక్రమిస్తున్నారు. సెట్‌బ్యాక్ లేకుండా భారీ నిర్మాణాలు కడుతుంటే అడ్డుకోవాల్సిన పురపాలక శాఖ చోద్యం చూస్తోంది. వారికి లేని అభ్యంతరాలు తమకెందుకు అన్నట్లుగా విద్యుత్తు అధికారులు పరిశీలించకుండానే కరెంట్ కనెక్షన్ ఇస్తున్నారు.

కాలనీ దారిలో.. మైలార్‌దేవ్‌పల్లి ఠాణా ఎదురుగా ఒక వాణిజ్య భవనం నిర్మించారు. దీనికి సంబంధించిన విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల ఇతర వ్యవస్థలన్నీ వారి ప్రాంగణంలోనే ఉండాలి. కానీ ప్రాంగణం బయట వీటిని ఏర్పాటు చేశారు. 3 అడుగుల మేర రోడ్డు ఆక్రమించడంతో దారి కుంచించుకుపోయింది.

గృహ నిర్మాణాల్లోనూ...ఐటీ కారిడార్ మాదాపూర్ అయ్యప్పసొసైటీ చుట్టుపక్కల కాలనీల్లో ఇరుకు రహదారులు. ఇక్కడ తక్కువ విస్తీర్ణంలో



ఐదు అంతస్తుల అపార్ట్‌మెంట్ కట్టడం, వాటికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లను రహదారులపై ఏర్పాటు చేస్తున్నారు. ఫిర్యాదులు వస్తున్నా ఇక్కడ ఈ దందా కొనసాగుతూనే ఉంది. ఇక్కడ చూసి శివార్లలోనూ చేస్తున్నారు. పెద్ద ట్రాన్స్‌ఫార్మర్ అయితే ఎక్కువ విస్తీర్ణం అవసరం ఉంటుందని.. కొందరు బిల్డర్లు తక్కువ సామర్థ్యం కల్గిన రెండు డీటీఆర్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

జనరేటర్లతో ఆక్రమణ..

ప్రముఖులు నివాసం ఉండే జూబ్లీహిల్స్ రోడ్‌నంబరు 60, ఇతర రహదారుల్లో కొందరు పెద్దలు ఏకంగా పాదబాటలపై జనరేటర్లను ఏర్పాటు చేశారు. బయటికి కనిపించకుండా చుట్టూ ఫెన్సింగ్ వేశారు. 500 నుంచి వెయ్యి గజాల స్థలాల్లో ఉన్నప్పటికీ కొందరు యథేచ్ఛగా పాదబాటలపై డీజీసెట్లను ఏర్పాటు చేశారు. ఇక్కడికి సమీపంలోని మరో కాలనీలో తక్కువ విస్తీర్ణంలో ఇళ్లు ఉన్నవారు.. కార్ల పార్కింగ్ కోసం పాదబాటలను ఆక్రమించి షెడ్లు వేసుకున్నారు. ఈ తరహాలో చాలా కాలనీల్లో రహదారులపై షెడ్లు వేశారు.

# లాభాల వాటా.. అభివృద్ధికి బాట

రామగుండం : యూరియా ఉత్పత్తి ప్రారంభమైన మొదటి సంవత్సరంలో నష్టాల్లో కూరుకుపోయిన రామగుండం ఎరువుల కర్మాగారం ఆ తర్వాత వరుసగా మూడేళ్లుగా లాభాల బాటలో వెళుతుంది. దీంతో సామాజిక అభివృద్ధి నిధుల విడుదలకు మార్గం సుగమం కానుంది. ఫెర్టిలైజర్ సిటీ నుంచి లక్ష్మీపురం మీదుగా వీర్లపల్లికి వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణంతో పాటు గౌతమినగర్ నుంచి ఎన్టీపీసీ కూడలి వరకు కేంద్రీకృత విద్యుత్తు దీపాల ఏర్పాటుకు గత సంవత్సరమే స్థానిక యాజమాన్యం కేంద్రానికి ప్రతిపాదనలు పంపినప్పటికీ ఆమోదం కాలేదు. ఈ ఆర్థిక సంవత్సరం అయినా అభివృద్ధి పనులకు మోక్షం లభిస్తుందేమో చూడాలి.

ప్రభావిత ప్రాంతాల సమస్యలు

రామగుండం ఎరువుల కర్మాగారం ఏర్పాటుతో పక్కనే ఉన్న లక్ష్మీపురం, గుంటూరుపల్లి, వీర్లపల్లి, విఠల్‌నగర్, సంజయ్‌గాంధీనగర్, శాంతినగర్ తదితర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా కర్మాగారం నుంచి వెలువడే భారీ శబ్దాలతో పాటు దుర్వాసనతో వీర్లపల్లి వాసులు ఆందోళన చెందుతున్నారు. కర్మాగారం ప్రహరీ పక్కనుంచి వీర్లపల్లికి వెళ్లే ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డు నిర్మిస్తే కేవలం వీర్లపల్లి వాసులకే కాకుండా గోదావరిఖని పరిసర ప్రాంతాల నుంచి యైటింక్లయిన్, పోతన కాలనీలు, కమాన్‌పూర్ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రజల ఇక్కట్లు తప్పనున్నాయి. వర్షాకాలంలో కర్మాగారం బూడిద చెరువు నుంచి వచ్చే వరద నీరుతో శాంతినగర్, సంజయ్‌గాంధీనగర్ ప్రాంతాల్లోని ఇళ్లు జలమయమౌతున్నాయి. గతంలో బూడిద చెరువు తెగడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఈ సమస్యకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉంది. కర్మాగారం ఏర్పాటునకు ప్రోత్సాహకంగా రాష్ట్ర ప్రభుత్వం ఫెర్టిలైజర్ సిటీ నుంచి ఎన్టీపీసీ కూడలి వరకు రహదారి, కేంద్రీకృత విద్యుత్తు దీపాలు, విభాగినిల నిర్మాణానికి నిధులు కేటాయించింది. ఈ నిధులతో కర్మాగారం, ఫెర్టిలైజర్ సిటీలో అంతర్గత రోడ్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయగా మిగిలిన కొద్దిపాటి నిధులతో గౌతమినగర్-ప్రగతినగర్ వరకు రోడ్డు నిర్మించి వదిలేశారు. కర్మాగారం ప్రారంభోత్సవానికి ప్రధాని వచ్చినప్పుడు నగరపాలిక నిధులతో మిగతా రోడ్డు పూర్తిచేశారు. ఈ రోడ్డు నిర్మాణానికి నగరపాలిక కేటాయించిన నిధులను ఎరువుల కర్మాగారం తిరిగి చెల్లించాలనే షరతు ఉంది. రోడ్డుపై విభాగినిలతో పాటు కేంద్రీకృత విద్యుత్తు దీపాల ఏర్పాటునకు చర్యలు తీసుకోవాలి. లక్ష్మీపురంలోని పట్టణ పీహెచ్‌సీలో సదుపాయాల కొరత ఉంది. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటే ప్రభావిత ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి.

లాభాల పరంపర ఇలా


సాంకేతిక అవరోధాలు, వివిధ కారణాలతో యూరియా ఉత్పత్తి ప్రారంభమైన మొదటి సంవత్సరంలో రామగుండం ఎరువుల కర్మాగారం ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయింది. ఎలాగోలా రెండో సంవత్సరం(2022-23)లో రూ.8 కోట్లు, మూడో సంవత్సరం (2023-24)లో రూ.445 కోట్లు, 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసికంలో సుమారుగా రూ.150 కోట్ల లాభాన్ని అర్జించింది. ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి ఆశించిన దానికంటే ఎక్కువే లాభాలు వచ్చే అవకాశముంది. వరుసగా మూడేళ్లు లాభాలు వచ్చిన నేపథ్యంలో నిబంధనల ప్రకారంగా సామాజిక అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులను కేటాయించాలి. దీంతో 2025-26 ఆర్థిక సంవత్సరం ఆరంభం నుంచి సామాజిక నిధులు విడుదలయ్యే అవకాశముంది. రామగుండం ఎరువుల కర్మాగారం నుంచి కనీసం రూ.10 కోట్లకు పైగా నిధులు విడుదలయ్యే అవకాశముండటంతో ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు మార్గం సుగమం అవుతోంది.

# దోమల నియంత్రణ.. కార్యాచరణ మమ!

పెద్దపల్లి: పల్లె, పట్టణం అనే తేడా లేకుండా జ్వరాలు విజృంభిస్తున్నాయి.. జ్వర బాధితులు లేని ఇళ్లు ఉండటం లేదు.. వర్షాలతో దోమల బెడద పెరిగింది.. పట్టణాల్లో ఖాళీ స్థలాలు, మురుగు నిల్వ ప్రాంతాలు వాటికి ఆవాసాలుగా మారాయి.. స్థానిక సంస్థలకు క్రమం తప్పకుండా పన్నులు చెల్లిస్తున్నప్పటికీ ఆ స్థాయిలో ప్రజలకు సేవలందడం లేదు. ఉమ్మడి జిల్లాలోని రెండు నగరపాలికలు, 14 పురపాలికల పరిధిలో పారిశుద్ధ్య చర్యలు, దోమల నివారణ, ఇంటింటికీ చెత్త సేకరణ–నిర్వహణ కార్యక్రమాలు నామమాత్రంగా సాగుతున్నాయి. పురపాలిక బడ్జెట్‌లో దోమల నివారణ, పారిశుద్ధ్య చర్యలకే అధిక మొత్తం కేటాయింపులుంటున్నాయి. నగరపాలికల్లో గరిష్ఠంగా రూ.6 కోట్లు, పురపాలికల్లో రూ.2 కోట్ల వరకు ఏటా ఖర్చు చేస్తున్నామని చెబుతున్నా వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉంటున్నాయి. పైగా నిధులు పక్కదారి పడుతున్నాయి. వానాకాలంలో ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది చోద్యం చూడటమే తప్ప వ్యాధుల నివారణ చర్యలు చేపట్టడం లేదంటూ ప్రతి వారం కలెక్టరేట్‌లలో ప్రజావాణికి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

**వారానికి ఒక్క రోజు కూడా గగనమే**

అర్బన్ మలేరియా విభాగానికి చెందిన కార్మికుడు ప్రతి రోజూ 300 ఇళ్ల పరిసరాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయాలి. పని చేసినట్లు ఆధారంగా కాలనీవాసుల సంతకాలు తీసుకోవాలి. ఆ



వివరాలను సంబంధిత విభాగానికి అందించాలి. అయితే ఇది ఉన్నతాధికారుల తనిఖీల సమయంలో తప్ప రోజువారీగా జరగడం లేదు. ఫాగింగ్ విధులు నిర్వర్తించే కార్మికులు నిత్యం తెల్లవారుజామునే ఆరోగ్యాధికారి, ఆరోగ్య కార్యకర్తలకు కనిపిస్తారు. సాయంత్రం ఫాగింగ్ పూర్తయిందని చెబుతూ పెట్రోల్, డీజిల్ కూపన్లు తీసుకుంటున్నారు. నామమాత్రంగా ఫాగింగ్ చేసి మిగిలిన ఇంధనాన్ని నల్లబజారుకు తరలిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. రామగుండం, కరీంనగర్ నగరాల్లోని మురికివాడల్లో, ప్రధాన వీధుల్లో కనీసం వారానికి ఒక్క రోజైనా ఫాగింగ్ చేయలేదనే విమర్శలున్నాయి.

ఫాగింగ్ యంత్రాలను తరలించే వాహనాలకు జీపీఎస్ పరికరాలు బిగిస్తే తప్ప ఈ ప్రక్రియ సజావుగా జరిగేలా లేదు. ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు చేసినప్పుడు యంత్రాలు పని చేయడం లేదని తాపీగా సమాధానాలిస్తున్నారు. కొందరు సీనియర్ అధికారుల అండదండలతోనే ఈ విభాగంలో అక్రమాలు జరుగుతున్నాయని, కలెక్టర్లు ప్రత్యేకంగా దృష్టి సారించి సమగ్ర విచారణ జరిపిస్తే అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**యంత్రాలకు మరమ్మతులేవీ!**

ఉమ్మడి జిల్లా జనాభా దాదాపు 40 లక్షలు కాగా దోమల నివారణకు ప్రతి కుటుంబం ఏటా సగటున రూ.3 వేల వరకు వెచ్చిస్తోంది. దాదాపు రూ.10 కోట్ల మేర రీపెల్లెంట్స్, కాయిల్స్, రసాయన ద్రావణాల వాడకం జరుగుతోంది. ఒక ఇంటిలో ఒకరికి జ్వరం వస్తే మిగతా అందరికీ విస్తరిస్తోంది. దీంతో నెల రోజుల వ్యవధిలో చికిత్సకు, వివిధ పరీక్షలకు రూ.10 వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది.

కరీంనగర్ నగరపాలక సంస్థలో 10 ఫాగింగ్ యంత్రాలుంటే 6 మాత్రమే పని చేస్తున్నాయి. మిగిలిన నాలుగు మరమ్మతుకు నోచుకోవడం లేదు. తరచూ కాకుండా ఎప్పుడో ఓసారి ఫాగింగ్ చేస్తున్నారు. రామగుండం నగరపాలికలో 5 యంత్రాలుంటే 3 మాత్రమే పని చేస్తున్నాయి. మిగిలిన రెండింటిని మరమ్మతు చేయాల్సి ఉండగా చేయడం లేదు. ఒక్కో పురపాలికలో నాలుగేసి చొప్పున మొత్తం 14 పురపాలికల్లో 56 యంత్రాలుండగా ఇందులో 25 పని చేయడం లేదని సిబ్బంది చేతులు దులుపుకుంటున్నారు.

# గ్రేటర్‌లో వాహన విస్ఫోటం

హైదరాబాద్: నగరంలో వ్యక్తిగత వాహనాల రద్దీ ఊహించని విధంగా ఉంటోంది. ఏటా 6 నుంచి 10 శాతం వరకు వాహనాల సంఖ్య పెరుగుతోంది. గ్రేటర్‌లో 9100 కి.మీ.ల మేర రోడ్లుండగా.. వాహనాల సంఖ్య 81.21 లక్షలకు దాటింది. ప్రతి కి.మీ.కి దాదాపు 892 వాహనాలు తిరుగుతున్నాయి. ఇప్పటికే బైక్‌ల సంఖ్య 59 లక్షలకు దాటింది. ప్రజారవాణాతోనే అడ్డుకట్ట హెచ్ఎండీఏ సమకూర్చుకున్న డబుల్‌డెక్కర్ బస్సులను ఖాళీగా తిప్పుతున్నప్పటికీ.. ప్రజారవాణాకు సంబంధించి వివిధ రకాల పద్ధతులను హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) అధ్యయనం చేస్తోంది. హెచ్ఎండీఏలోని ఉ



మ్టా(యూనిఫైడ్ మెట్రోపొలిటిన్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ) దీనిపై ప్రత్యేక దృష్టి సారించింది. వివిధ దేశాల్లో ఉన్న విధానాలపై అధ్యయం చేసి మన నగరానికి ఎలాంటి రవాణా విధానం అమల్లోకి తెస్తే బాగుంటుందో అధికారులు పరిశీలిస్తున్నారు. మెట్రోను ట్రాఫిక్ రద్దీ ఎక్కువున్న ప్రాంతాలకు విస్తరించడంతో పాటు.. 2–3 కిలోమీటర్ల దూరానికి ప్రజలు వ్యక్తిగత వాహనాలు వాడకుండా...ప్రజారవాణా వైపు దృష్టిసారించేలా ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఆల్టనేటివ్ అర్బన్ మొబిలిటీ సొల్యూషన్ ఫర్ హైదరాబాద్ పేరుతో వివిధ విధానాలపై ప్రత్యేక దృష్టి సారించారు. కేబుల్ కార్లు, పర్సనల్ రాపిడ్ ట్రాన్సిట్ లాంటి రవాణా సదుపాయాలు నగరానికి ఎంతవరకు అనుకూలంగా ఉంటాయనే విషయమై పరిశీలిస్తున్నారు.

ఇంటి నుంచి కార్యాలయాలకు నేరుగా ప్రజారవాణా ఉండేలా ఏర్పాట్లు చేసినప్పుడే ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు. ప్రజారవాణాను ప్రజారోగ్య సంక్షేమ కార్యక్రమంగా చూడాలంటున్నారు.

# పునరావాస స్థలం.. పరాధీనం



సిరిసిల్ల: ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి భూములు కొనుగోలు చేసి నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో ప్లాట్లుగా చేసి పంపిణీ చేసింది. ప్రస్తుతం ఈ కాలనీలోని ఖాళీ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. రూ.కోట్ల విలువైన స్థలాలకు రక్షణ కరవైంది. మధ్యమానేరు జలాశయం ముంపు గ్రామాల నిర్వాసితుల కోసం బోయినపల్లి, వేములవాడ గ్రామీణ, అర్బన్ మండలాల్లోని జరుగుతున్న ఈ ఆక్రమణలపై రెవెన్యూశాఖ దృష్టి సారించకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

జిల్లాలోని మధ్యమానేరు జలాశయం నిర్మాణంలో బోయినపల్లి, తంగళ్లపల్లి, వేములవాడ మండలాల్లోని 11 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. 2008లో ముంపు గ్రామాల వివరాలతో ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. నిర్వాసితులకు తొమ్మిది చోట్ల ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు 1109.59 ఎకరాలను ప్రభుత్వం కొనుగోలు చేసింది. వీటిలో మౌలిక వసతులు కల్పించి.. 2010–11లో పంపిణీ చేసింది. కాగా ప్రాజెక్టు నిర్మాణంలో 2016 నుంచి వేగం పెరిగింది. అప్పటి నుంచి నిర్వాసితులు తమకు కేటాయించిన కాలనీల్లోని ప్లాట్లలో ఇంటి నిర్మాణాలు ప్రారంభించారు. పంపిణీ చేయగా ఉన్న ఖాళీ స్థలాలను భవిష్యత్తులో పంచాయతీల అవసరాలకు వినియోగించాల్సి ఉంది. కానీ ఆ స్థలాలపై అక్రమార్కుల కన్ను పడింది. రెవెన్యూశాఖ మాత్రం పంపిణీ చేయగా మిగిలిన స్థలాలను దస్త్రాల్లో భద్రంగా ఉంచామనే భ్రమలో ఉంది. 2022లో ప్రభుత్వం పంపిణీ చేసిన ప్లాట్లను నిర్వాసితులు క్రయవిక్రయాలు జరుపుకోవచ్చని ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి వరకు స్తబ్దుగా ఉన్న కాలనీల్లో ఆక్రమణలకు తెరతీసినట్లు అయింది. శాభాష్‌పల్లిలో పంపిణీ చేసిన ప్లాట్లను కొందరు తిరిగి ఇచ్చినట్లు సమాచారం. కాగా ఆ ప్లాట్లు మాత్రం రికార్డుల్లో చూపించడం లేదు. నీలోజిపల్లిలో ఖాళీ ప్లాట్లను చదును చేసి పంటలు సాగుచేస్తున్నారు. చింతల్‌ఠాణాలో రెవెన్యూశాఖ ఏర్పాటు చేసిన ప్లాట్ల హద్దురాళ్లను తొలగించి స్థానికులు ప్లాట్లుగా చేసి రిజిస్ట్రేషన్లు చేసినట్లు సమాచారం. వీటన్నింటిని చూస్తూ అధికారులు ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

**పర్యవేక్షణ కొరవడి**

వేములవాడ పట్టణ సమీపంతోపాటు సిరిసిల్ల– కరీంనగర్ ప్రధాన రహదారిని ఆనుకుని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలు ఉన్నాయి. పట్టణ విస్తరణతోపాటు రహదారికి సమీపంలో ఉండటంతో భూముల విలువ రోజురోజుకు పెరుగుతుంది. రిజిస్ట్రేషన్లలో ఖాళీ స్థలాలు నమోదు కాలేదు. ఇదే అదనుగా సర్వే నంబరులో పక్క ఇంటి నంబరుతో మార్పులు చేసి దస్త్రాలు సృష్టిస్తున్నారు. వీటి ఆధారంగా రిజిస్ట్రేషన్‌లతో చేతులు మారుతున్నాయి. పలు కాలనీల్లో హద్దురాళ్లను తొలగించడంతో వివాదాలు చోటు చేసుకున్నాయి. ఖాళీ స్థలాల రక్షణకు బోర్డులు, కంచెవంటి నిర్మాణాలు లేవు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు కలిపి ఇద్దరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఉండటం.. ఆయా ప్రాంతాలపై అవగాహన కొరవడటం.. దీనికితోడు పర్యవేక్షణలేమితో అక్రమార్కులకు కలిసివస్తోంది.

**రక్షణ చర్యలు చేపడతాం**

ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో ఆక్రమణలు జరుగుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. అనుపురంలో ఇలాంటి వ్యవహారంపై విచారణ జరుపుతున్నాం. ఖాళీ స్థలాల పరిరక్షణ బాధ్యత పంచాయతీలకే ఉంది. ఎక్కడైనా ఆక్రమణలు జరిగితే ప్రజలు నేరుగా మా దృష్టికి తీసుకురావచ్చు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లోని ఖాళీ స్థలాల రక్షణకు చర్యలు చేపడతాం.రాజేశ్వర్, ఆర్డీవో, వేములవాడ

# దృశ్య సహితం.. విజ్ఞాన వికాసం



పెద్దపల్లి : పది సార్లు విన్న మాట కన్నా ఒక్కసారి చూసిన దృశ్యం చాలా కాలం గుర్తుండిపోతుంది. మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుంటేనే మేధస్సు వికసిస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యాంశాలపై లోతైన విషయ పరిజ్ఞానం అందించేందుకు విద్యా శాఖ గతేడాది డిజిటల్ టచ్ స్క్రీన్ టీవీలను అందుబాటులోకి తీసుకొచ్చింది. వాటి సాయంతో ఉన్నత పాఠశాలల్లోని 8, 9, 10 తరగతులకు సాంకేతిక పాఠాలు బోధిస్తున్నారు. దృశ్య సహిత బోధన సత్ఫలితాలిస్తోంది.

**విడతల వారీగా పంపిణీ**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు ఏటికేడు పడిపోతున్నాయి. పోటీ ప్రపంచంలో అవసరమైన సామర్థ్యాలు కొరవడి విద్యార్థులు రాణించలేకపోతున్నారు. ప్రైవేటు బడులకు దీటుగా కార్పొరేట్ స్థాయిలో డిజిటల్ బోధన అందించేందుకు గతేడాది ఉన్నత పాఠశాలలకు విడతల వారీగా 'ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్' డిజిటల్ స్క్రీన్ టీవీలు పంపిణీ చేశారు. ఉచిత వైఫై సౌకర్యం కల్పించారు. దీంతో దృశ్య సహిత బోధన విద్యార్థులకు మరింత చేరువైంది.

**ఒక్కో బడికి రూ.10.58 లక్షలు**

తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీసెస్(టీఎస్‌టీఎస్) ద్వారా సమగ్ర శిక్షా నిధులతో ప్రతి పాఠశాలకు రూ.10.58 లక్షల విలువైన మూడు పరికరాలను సమకూర్చారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ స్క్రీన్(ఐఎఫ్ఎస్)లో 75 అంగుళాల గ్రీన్ ప్యానల్, 2 కేవీఏ యూపీఎస్, 12 వోల్టేజీ సామర్థ్యంతో ఆరు ఎక్స్పైడ్ బ్యాటరీలు, ఇతర పరికరాలను పంపిణీ చేశారు. బ్యాటరీలతో విద్యుత్తు సరఫరా లేకున్నా బోధించే వీలుంది. గ్రీన్‌బోర్డ్ ప్యానల్‌లో ఆన్‌లైన్ పాఠాలు, టచ్ స్క్రీన్ బోధన.. ఇలా రెండు రకాల ప్రయోజనాలు కలుగుతున్నాయి.

**చిత్రాలతో సందేహాల నివృత్తి**

పాఠ్యాంశం పూర్తి చేసిన ఉపాధ్యాయుడు లోతైన విజ్ఞానం కోసం డిజిటల్ తెరపై బోధిస్తున్నారు.

గణితంలో కీలకమైన బీజ గణితం, తదితర అంశాలపై టూల్స్‌ను వినియోగించి బోధిస్తున్నారు.

భౌతిక, రసాయన, జీవశాస్త్ర పాఠాల్లోని కష్టతరమైన అంశాలపై చిత్రాలతో సందేహాలు నివృత్తి చేస్తున్నారు.

యూట్యూబ్, యాప్‌ల సాయంతో అవగాహన కల్పిస్తుండటంతో విద్యార్థులకు సులభంగా అర్థమవుతోంది.

ఈ ప్యానల్‌లో సబ్జెక్టులకు సంబంధించి పాఠాలు నిక్షిప్తమయ్యాయి. యూట్యూబ్, యాప్‌లతో కూడా దృశ్య బోధన అందుబాటులోకి వచ్చింది.

అవాంతరాలు అధిగమిస్తే..

ఉమ్మడి జిల్లాలో 660 ఉన్నత, కస్తూర్బా, ఆదర్శ పాఠశాలల్లో 96,694 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొత్తం 1,980 ఇంటరాక్టివ్ ప్యానళ్లకు రూ.69.89 కోట్లు వెచ్చించారు.

ఈ ప్యానల్‌లో కొన్ని పాఠ్యాంశాలకు సంబంధించి విషయ పరిజ్ఞానాన్ని మాత్రమే అప్‌లోడ్ చేశారు. అన్ని పాఠాలు అందుబాటులో ఉంటే బాగుంటుంది.

ఉచిత వైఫై పరికరాలున్నా కొన్ని చోట్ల కనెక్షన్ ఇవ్వలేదు. మారుమూల ప్రాంతాల్లో సిగ్నల్ సమస్య ఇబ్బందికరంగా మారింది.

పాఠం మధ్యలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగితే బ్యాటరీలు ఆశించిన స్థాయిలో పని చేయడం లేదు.

అంతర్జాలం నుంచి సేకరించిన అంశాలను స్క్రీన్‌పై చూపిస్తూ వివరిస్తుండటంతో విద్యార్థులు విషయ పరిజ్ఞానాన్ని పెంచుకుంటున్నారు. ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తే పూర్తి స్థాయిలో సార్థకత చేకూరుతుంది.

కఠిన అంశాలపై పట్టు

పాఠం పూర్తయిన తర్వాత సాంకేతికత సాయంతో బోధనలో అదనపు విజ్ఞానం అందిస్తుండటంతో సులువుగా అర్థమవుతోంది. గణితంలో కఠినమైన అంశాలపై పట్టు సాధిస్తున్నాం. కవులు, రచయితల సాహిత్య అంశాలను లోతుగా తెలుసుకుంటున్నాం.

నమిత, 9వ తరగతి, మంథని జడ్పీ ఉన్నత బాలికల పాఠశాల

ఆసక్తిగా వింటున్నారు

స్మార్ట్ బోధన విద్యార్థుల మెదడులో నిలుస్తుంది. ఒక పాఠ్యాంశంపై సమగ్రంగా పట్టు సాధించేలా వారిని సిద్ధం చేస్తున్నాం. సబ్జెక్టుకు అవసరమైన అదనపు సమాచారాన్ని తెరపై చూపిస్తుండటంతో విద్యార్థులు ఆసక్తిగా వింటున్నారు.జక్కం శ్రీనివాస్, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు, పోతారం, ముత్తారం మం.

పకడ్బందీగా అమలుకు పర్యవేక్షణసాంకేతిక బోధనపై ఉపాధ్యాయులకు నిపుణులతో శిక్షణ ఇచ్చాం. దృశ్య సహిత బోధనతో విద్యార్థులు పాఠాలను ఆసక్తిగా వింటున్నారు. ఈ విధానాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు పర్యవేక్షిస్తున్నాం. కార్పొరేట్ స్థాయి బోధనతో ప్రమాణాలు పెరుగుతున్నాయి. మల్లేశంగౌడ్, సమగ్ర శిక్షా జిల్లా సమన్వయకర్త

# గాడితప్పిన చెత్త సేకరణ

రాజధానిలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. ఇంటింటి చెత్త సేకరణ పూర్తిగా గాడి తప్పింది. ప్రతి ఇంటికి వెళ్లి ఉదయాన్నే చెత్త సేకరించాల్సిన స్వచ్ఛ ఆటోలు వీధులకు రావడం లేదు. వ్యక్తిగత కారణాలతో కొందరు డ్రైవర్లు విధులకు డుమ్మా కొడుతుంటే.. మరికొన్ని ఆటోలు నగరంలోనే కనిపించట్లేదు. మరోవైపు కొన్ని స్వచ్ఛ ఆటోలు క్రమం తప్పకుండా విధులు నిర్వహిస్తున్నాయి. అలాంటి వారిని గుర్తించి సత్కరించాలని.. తద్వారా మిగిలిన కార్మికుల్లో మార్పు వస్తుందని ఇటీవల కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. అయినప్పటికీ కింది స్థాయి యంత్రాంగంలో చలనం కనిపించట్లేదు.

రెండు వేల కుప్పలు..నగరంలో ఇంటింటి చెత్త సేకరణ, హోటళ్లు, ఇతర వ్యాపార కేంద్రాలు, రోడ్లపై పడుతోన్న చెత్త కుప్పల నుంచి రోజుకు 7,000 నుంచి 7,500 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. చెత్త కుప్పల వ్యర్థాలే 1,500 టన్నులు. ఇంటింటి చెత్త సేకరణ సరిగా లేక ఈ సమస్య.ఐదేళ్ల కిందట నగరంలో 1,200 చెత్తకుప్పలుండేవి. అప్పట్లో బల్దియా కేంద్ర కార్యాలయం కఠినంగా వ్యవహరించేది. అనంతరం వచ్చిన ఉన్నతాధికారులు.. చెత్తకుప్పలున్నా ఫర్వాలేదు.. ఉదయాన్నే శుభ్రం చేయాలని సూచించారు. దీంతో ఇళ్లలోని చెత్తను రోడ్లపై వేసే నివాసితులు, హోటళ్లు, సంతలు, తోపుడుబండ్లు, సంచార హోటళ్లు, రెస్టారెంట్లు, బార్ల యజమానులు అడ్డదారి ఎంచుకుని రోడ్లపై పడేయటం ప్రారంభించారు. 30 సర్కిళ్లలో 2 వేలకుపైగా చెత్త కుప్పలు వెలిశాయి. నగరం మొత్తాన్ని జీహెచ్ఎంసీ 4,864 కాలనీలుగా గుర్తించింది. ఎస్ఎఫ్ఏ(శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్), డీసీ, ఇంజినీర్లు, సహాయ వైద్యాధికారులు.. పర్యవేక్షణ మొక్కుబడిగా చేసి వాట్సప్ గ్రూపులో ఫొటోలు పెట్టి వదిలేస్తున్నారు.

# ప్రైవేటు కొలువుల జోరు.. రూ.8లక్షల నుంచి రూ.23 లక్షల వేతనం

హైదరాబాద్: ప్రాంగణ నియామకాలు ప్రారంభమయ్యాయి. ఒకటి రెండేళ్లుగా ఆఫ్‌లైన్ దరఖాస్తులనే పరిశీలిస్తూ వస్తున్న కార్పొరేట్ సంస్థలు ఇప్పుడు కళాశాలల బాట పడుతున్నాయి. అయితే నెమ్మదిగా అడుగులేస్తున్నాయి. దీంతో ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ కళాశాలల్లో నియామకాల సందడి ప్రారంభమైంది. నిజాం కళాశాలలో ఫార్మా కంపెనీలు విద్యార్థులకు నియామక పత్రాలు ఇస్తుండగా.. తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ హైదరాబాద్‌లో ప్రాంగణ నియామకాలు మొదలయ్యాయి. నగర శివారులోని ఇంజినీరింగ్ కళాశాలల్లోనూ విద్యార్థులకు రూ.లక్షల్లో ప్యాకేజీలు ఇచ్చేందుకు కొన్ని ఐటీ సంస్థలు ఆసక్తి ప్రదర్శిస్తున్నాయి. ఓయూలో ఇటీవల జరిగిన ప్రాంగణ నియామకాల్లో ఎంబీఏ, టెక్నాలజీ మేనేజ్‌మెంట్ విద్యార్థులు 17 మందికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కొలువులు ఇచ్చింది. రూ.8 లక్షల నుంచి రూ.23 లక్షల మధ్య వార్షిక వేతనంతో ఈ నియామకాలు జరిగాయి. ఎంబీఏ కళాశాలలో నాలుగో సెమిస్టర్ చదువుతున్న 120 మంది విద్యార్థుల్లో 109 మందికి వేర్వేరు కంపెనీలు నియామక పత్రాలు అందించనున్నాయి. ఆగస్టు తొలివారంలో మరో 10 కంపెనీలు ప్రాంగణ నియామకాల కోసం ఓయూకు రానున్నాయి.

మౌఖిక పరీక్షలకు శిక్షణ..ఉద్యోగ నియామక ఇంటర్వ్యూలకు విద్యార్థులను సిద్ధం చేసే పనిలో ఆయా కళాశాలలు నిమగ్నమయ్యాయి. తడబాటు లేకుండా కంపెనీల ప్రతినిధులతో మాట్లాడటం.. వారి ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు వీలుగా ఓయూలో హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఇంజినీరింగ్ కళాశాల సంయుక్తంగా శిక్షణ ఇచ్చారు. జేఎన్‌టీయూతో పాటు ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు తమ విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ ఇప్పిస్తున్నాయి.

# ఇల్లు కట్టారా.. కట్టి ఇచ్చారా..!

నల్గొండ : కేసీఆర్ నేతృత్వంలోని గత భారాస ప్రభుత్వం నిర్మించిన రెండు పడకగదుల ఇళ్ల స్థితిగతులపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత పదేళ్లలో ఎన్ని ఇళ్లు నిర్మించారు, ప్రస్తుతం అవి ఏ పరిస్థితుల్లో ఉన్నాయి, పూర్తయిన ఇళ్లను ఎంత మందికి కేటాయించారనే వివరాలను సమగ్రంగా నివేదించాలని మూడు జిల్లాల అధికారులకు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు మౌఖికంగా ఆదేశించినట్లు తెలిసింది. దీంతో గత రెండు రోజులుగా అధికారులు నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లోని రెండు పడకగదుల సముదాయాల వద్దకు వెళ్లి ఫొటోలతో సమగ్ర వివరాలను సేకరిస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మార్గదర్శకాల రూపకల్పనలో నిమగ్నమైన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికారులు ఇళ్లపై సర్వే నిర్వహిస్తున్నారు. తాజా బడ్జెట్‌లో ఏడాదికి ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున నిర్మిస్తామని..తొలుత సొంత జాగా ఉన్న వారికి రూ.5 లక్షల సాయం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీనిపై మార్గదర్శకాల విడుదలకు ముందే ప్రస్తుతం రాష్ట్రంలో గత ప్రభుత్వం చేపట్టిన రెండు పడకగదుల ఇళ్ల స్థితిగతులను తెలుసుకొని నిర్మాణం పూర్తయిన వాటిని లబ్ధిదారులకు కేటాయించి, తుది దశలో ఉన్నవాటిని పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు.

గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలో మొత్తం 17,199 ఇళ్లు మంజూరు చేయగా..ఇప్పటి వరకు 6,391 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. ఇందులో కేవలం 880 ఇళ్లను మాత్రమే లబ్ధిదారులకు అందజేశారు. దేవరకొండ, నల్గొండ నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణం పూర్తయి మూడేళ్లు కావొస్తుంది. నల్గొండ పట్టణంలో 540 ఇళ్లను నిర్మించగా.. గతంలో మౌలిక వసతులు పూర్తి కాలేదనే నెపంతో లబ్ధిదారులకు కేటాయించాలేదు. ఇప్పటికే సగం వరకు ఇళ్లు శిథిలావస్థకు చేరాయి.

ఎక్కువ దరఖాస్తులు వాటికే...

జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో ప్రస్తుతం నిర్వహిస్తున్న ప్రజావాణిలో ఎక్కువ దరఖాస్తులు ఇళ్లు కావాలనే వస్తుండటం గమనార్హం. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల్లోనూ ఇవే అత్యధికంగా ఉన్నాయని అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులు నిర్వహిస్తున్న సర్వేలో ఈ దరఖాస్తులను సైతం పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

అర్హులుగా ఉండి ఇళ్లు రానివారితో పాటూ కేటాయించిన వాటిలో అనర్హులు ఎవరైనా ఉన్నారా, రాజకీయ పలుకుబడి, పైరవీలతో గత ప్రభుత్వం ఎంత మందికి ఇళ్లను కేటాయించిందనే దానిపైనా వివరాలు సేకరిస్తున్నామని ఓ ఇంజినీరింగ్ ఉన్నతాధికారి 'ఈనాడు'తో అభిప్రాయపడ్డారు. నాగార్జునసాగర్‌లో ఒక్కటి కూడా రెండు పడకగదుల ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టకపోగా.. యాదాద్రి జిల్లాలో 829 ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా... ఒక్కటిని కూడా లబ్ధిదారులకు కేటాయించలేదు. తాజా ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఈ ప్రాంతాలకు మొదటి ప్రాధాన్యం ఉండనున్నట్లు తెలిసింది. త్వరలోనే సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని.. అన్ని జిల్లాల నుంచి నివేదికలు అందిన తర్వాత ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లపై మార్గదర్శకాలు వెలువడే అవకాశం ఉన్నట్లు ఓ జిల్లా ఉన్నతాధికారి తెలిపారు.

# వీధిరుణం.. విధికి వరం

సూర్యాపేట: వీధి వ్యాపారులకు ఆత్మనిర్భర్ పథకం వరంగా మారింది. పథకం కింద రుణాలు పొందుతూ ఆర్థికంగా బలోపేతమవుతున్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో ఈ పథకం ద్వారా రుణాలు మంజూరవుతున్నాయి. జిల్లాలో మొదటి, రెండు విడతల్లో 17,785 మంది వీధి వ్యాపారులు రుణాలు పొందారు. నిర్ణీత గడువులోగా బ్యాంకులకు చెల్లించిన వారికి రుణ పరిమితిని పెంచారు. మూడో విడతలో జిల్లాలోని పుర పురపాలికల్లో 1701 మందికి రుణాలకు ఎంపికయ్యారు.

నాలుగో విడతకు సిద్ధం

జిల్లాలోని ఐదు పురపాలికల్లో రుణాలు సక్రమంగా చెల్లించిన వారికి నాలుగో విడత రుణాలు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఆత్మనిర్భర్ పథకం కింద వీధి వ్యాపారులకు రుణ లక్ష్యం పెంచేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ రుణాలతో పేద, మధ్య తరగతి వర్గాలను ఆదుకోవడానికి సర్కారు దృష్టి పెట్టింది. ఆర్థికంగా బలోపేతమయ్యేలా స్వయం సంఘాలకు, వీధి వ్యాపారులకు తోడ్పాటు అందిస్తున్నారు. ప్రధాన ప్రాంతాలతో పాటు అంతర్గత వార్డుల్లో ఉన్న వీధి వ్యాపారులను పరిగణనలోకి తీసుకోనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

శ్వేత, టీఎంసీ, సూర్యాపేట

కేంద్ర ప్రభుత్వం ఆత్మనిర్భర్ పథకం కింద అందించే రుణాలను వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలి. సకాలంలో చెల్లించిన వారికి రుణాలు మంజూరవుతాయి. రెండు, విడతల్లో చెల్లించిన వ్యాపారులకు మూడోసారి రెండింతలు రుణం పెంచే అవకాశం ఉంది.

# స్వర్ణముఖిలో ఇసుక మాఫియా!

సూళ్లూరుపేట : స్వర్ణముఖి నదిలో ఇసుక మాఫియా పేట్రేగిపోతోంది. అడ్డుకోవాల్సిన యంత్రాంగం అక్రమ రవాణాకు బందోబస్తు కల్పిస్తోంది. అవినీతిని అడ్డంగా పెంచి పోషిస్తోంది. సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల్లో జరుగుతున్న ఈ బాగోతంలో అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తుంటడం పరిస్థితికి అద్దం పడుతోంది. అధికార పార్టీ నేతలు ఇసుక జోలికి వెళ్లొద్దని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇప్పటికే పలుమార్లు హెచ్చరికలు చేశారు. ఆయన మాటలను పెడచెవిన పెట్టిన కొందరు బరితెగించి అక్రమ రవాణాకు తెరలేపారు. కొందరు వైకాపా నేతలతో కలిసి ఈ దందా సాగిస్తున్నారు. పెళ్లకూరు మండలం కల్వకూరు, ముమ్మారెడ్డిగుంట, కోట మండలం మెట్టు సమీపాన స్వర్ణముఖి నదిలో ఇసుక తవ్వకాలు ఇబ్బడిముబ్బడిగా చేస్తున్నారు. ఇందులో కొందరు కంపెనీలకు ఇసుక తరలిస్తున్నారు. మరికొందరు నాయుడుపేట, బాలాయపల్లి మండలాల సరిహద్దులోని అటవీ ప్రాంతంలో నిల్వ ఉంచి టిప్పర్లతో ఇతర ప్రాంతాలకు తీసుకెళు తున్నారు. కల్వకూరు ప్రాంతం నుంచే తమిళనాడుకు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారు. అన్నీ శాఖల అధికారులకు ఈ విషయం తెలిసినా కళ్లప్పగించి చూస్తున్నారు.

**ఇసుక అక్రమ రవాణాపై వివాదం**

పెళ్లకూరు మండలంలోని కల్వకూరు సమీపాన స్వర్ణముఖి నది నుంచి



ఇసుక అక్రమ తోలకాలపై అధికారపార్టీలో వివాదం నెలకొంది. దీనిపై పలువురు నేతలు జోక్యం చేసుకుని తమకు అడ్డులేకుండా పన్నాగం పన్నుతున్నారు. ఈ నేపథ్యంలో నదిలో నుంచి ఇసుక తెచ్చే ట్రాక్టర్లకు నంబర్లు ఇచ్చేలా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ అక్రమ రవాణాను పర్యవేక్షించేలా హుకుం జారీ చేస్తున్నట్లు సమాచారం.

**ఫిర్యాదు చేసినా అంతే..**

స్వర్ణముఖి, కాళంగి నదుల్లో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై స్థానిక పోలీసులకు, రెవెన్యూ సిబ్బందికి ఫిర్యాదు చేసినా అదిగో.. ఇదిగో అంటున్నారు. ఒకవేళ ఘటన స్థలికి వెళ్లేసరికి, అక్కడ ఎవరూ కనిపించడం లేదు. ఫిర్యాదు చేసిన నిమిషాల వ్యవధిలోనే అధికారుల్లో కొందరు అక్రమార్కులకు సమాచారం చేరవేస్తున్నారు. 100 నంబరుకు ఫోన్ చేసినా స్థానిక పోలీసులు స్పందించి వెళ్లేసరికి పరారవుతున్నారు.

**పొర్లుకట్ట తెగ్గొట్టినా..**

అధికార పార్టీ నేతలు తాజాగా మంగళవారం పెళ్లకూరు మండలం కప్పగుంటకండ్రిగ వద్ద స్వర్ణముఖి నది పొర్లుకట్టను తెగ్గొట్టి, ఇసుక అక్రమ రవాణాకు తెరలేపారు. ఇక్కడ ఇంత జరుగుతున్నా.. ఈ వైపు రెవెన్యూ, పోలీసు, సెబ్, జలవనరుల శాఖ అధికారులు కన్నెత్తి చూడలేదు.

చర్యలు తీసుకుంటాం - కె.రవికుమార్, డీఎవో

స్వర్ణముఖి నదిలో ఇసుక తవ్వకాలు లేకుండా చర్యలు తీసుకుంటాం. దీనిపై పోలీసు, మండల రెవెన్యూ యంత్రాంగంతో మాట్లాడి, వారికి దిశానిర్దేశం చేస్తాం. ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేస్తాం.

# పరిశ్రమించకుంటే పక్కనబెడతారు..!

చిత్తూరు : ఈఎంసీ-2లో రూ88 కోట్ల పెట్టుబడితో పరిశ్రమ స్థాపనకు ఓ కంపెనీకి 2021లో 3 ఎకరాలు కేటాయించారు. ఇప్పటి వరకు పరిశ్రమ ఏర్పాటు కాలేదు. ఇదే ప్రాంతంలో మరో పరిశ్రమ ఏర్పాటుకు 2021లో ఆరు ఎకరాలు కేటాయించారు. రూ.26 కోట్ల పెట్టుబడితో పరిశ్రమ ఏర్పాటుకు భూమిని పొందిన సంస్థ ఇప్పటి వరకు పనులు పూర్తి చేయలేదు.

ఈఎంసీ-2లో ఒక హోటల్‌తో పాటు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూములు కేటాయించినా పనులు చేపట్టలేదు.

పరిశ్రమల స్థాపన పేరుతో కొందరు వైకాపా నేతలే పారిశ్రామికవేత్తల అవతారమెత్తి భూములు కొట్టేసేందుకు యత్నిం చారు. దీనిపై దృష్టిసారించిన కూటమి ప్రభుత్వం తదనుగుణంగా చర్యలకు ఉపక్రమించింది. ఈ భూముల విషయమై ఆరా తీస్తోంది. సమస్యలుంటే వాటిని పరిష్కరించి పరిశ్రమల స్థాపన దిశగా ప్రోత్సహి ంచనుంది. పారిశ్రామికవేత్తల ముసుగులో భూములు కొట్టేసేందుకు తీసుకుంటే రద్దు చేసి మరొకరికి కేటాయించేందుకు సిద్ధమవుతోంది. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకున్న సానుకూల అంశాలను దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వాలు పారిశ్రామికవాడలు ఏర్పాటు చేస్తూ వచ్చాయి. ప్రధానంగా రేణిగుంట విమానాశ్రయాన్ని ఆనుకుని గత తెదేపా హయాంలో ఈఎంసీ-1, ఈఎంసీ-2లను ఏర్పాటు చేశారు. నాడు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎలక్ట్రానిక్ పరిశ్రమల ఏర్పాటుకు చేసిన కృషికి ఫలితంగా ఈఎంసీ-1లో సెల్‌కాన్, కార్బన్‌తోపాటు ఈఎంసీ-2లో డిక్సన్‌తోపాటు పలు పరిశ్రమలు ఏర్పాటయ్యాయి.



వీటితోపాటు శ్రీసిటీ, వికృతమాల పరిధిలో భారీ పరిశ్రమలు తమ ఉత్పత్తులను ప్రారంభించాయి.

125 యూనిట్లకు..వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిశ్రమలకు భూకేటాయింపులు పెరిగినా చాలా వరకు పనులు ప్రారంభించలేదు. తిరుపతి ఏపీఐఐసీ జోన్ పరిధిలో సుమారు 940 యూనిట్లకు భూములు కేటాయించగా 125 యూనిట్లు తమ ఉత్పత్తులు ప్రారంభించలేదు. భూకేటాయింపులు చేసి ఒప్పందం చేసుకున్న తర్వాత పరిశ్రమ స్థాపనకు ఆరు నెలల వరకు వారికి వ్యవధి ఇస్తారు. నిర్దిష్ట గడువు ముగిసినా పనులు ప్రారంభించకుంటే తాఖీదులు ఇస్తారు. కొందరు పారిశ్రామికవేత్తలు తమకు ఇచ్చిన నిర్దిష్ట గడువును పెంచేందుకు ఈవోటీ అడుగుతుండగా, మరికొందరు పట్టించుకో వట్లేదు.లీజుల పేరుతో దందా..పారిశ్రామికవాడల్లో భూములు కొట్టేసేందుకు కొందరు వైకాపా నేతలు కొందరు పారిశ్రామికవేత్తలకు భూములు ఇప్పించారు. ఏపీఐఐసీతో ఒప్పందాలు కుదుర్చుకున్న తర్వాత ఇతరులకు లీజుకు ఇచ్చేందుకు (లైన్ ఆఫ్ యాక్టివిటీ) ప్రతిపాదనలు పంపించారు. వీటిని జిల్లా యంత్రాంగం ఏపీఐఐసీ ఉన్నతాధికారులకు పంపిస్తుంటారు. అక్కడ తమ పలుకుబడితో వీటిని లీజుకు తీసుకున్నారన్న ఆరోపణలున్నాయి. ఇటువంటి వాటిల్లోనే నిర్మాణాలు ప్రారంభం కాలేదన్న వాదనలున్నాయి. ఈ భూములను ఎవరెవరికి కట్టబెట్టేందుకు యత్నించారన్న వివరాలు సేకరిస్తున్నారు.

# మాట్లాడి మరీ దోచేస్తారు!!



విశాఖపట్నం : మీకు లాటరీ తగిలింది... ముందుగా మేం చెప్పినంత పంపండి! మీరు మా కంపెనీ బహుమతికి అర్హత సాధించారు. అది కావాలంటే కొంత సొమ్ము మాకు పంపండి! ఫోన్‌లో ఈ లింక్ తాకితే అద్భుతం చూస్తారు...! మీ బ్యాంకు ఖాతా నవీకరణకు పిన్ చెప్పండి...! మీ పేరు నేరగాళ్ల జాబితాలో ఉంది... తొలగించాలంటే చెప్పినంత ఇవ్వండి!

ఇలా ఆశ చూపి... బెదిరించి సైబర్ నేరగాళ్లు విశాఖ వాసుల సొమ్ములు స్వాహా చేసేస్తున్నారు.

చిటికెలో రూ.లక్షలు సంపాదించేద్దాం అని అంతర్జాలంలో అరాటపడే ప్రతి ఒక్కరూ సైబర్ నేరగాళ్లకు చాలా తేలికగా చిక్కుతున్నారు. గతంలో నిరక్షరాస్యత, అజాగ్రత్తల వల్ల సైబర్ మోసాల బారిన పడేవారు. నేడు ఉన్నత చదువులు చదివిన యువత, ఐటీ ఉద్యోగులే ఎక్కువగా మోసపోతున్నారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా...సొమ్ములన్నీ పోగొట్టుకునే భయంకరమైన పరిస్థితిలో ఉన్నామని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు. రాష్ట్రంలో నమోదవుతున్న సైబర్ కేసుల్లో అత్యధికంగా విశాఖ నుంచే ఉండటం కలవరపెట్టే అంశం.

ఇంకా రూ.13కోట్లు అక్కడే: మోసపోయామని తెలిశాక...వెంటనే సైబర్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పోలీసులు రంగంలోకి దిగుతారు. మాయగాళ్లు ఆ సొమ్ము బ్యాంకుల నుంచి తీసేసేలోపు ఫ్రీజ్ చేయటానికి అవకాశం ఉంటుంది. ఈ నగదు చెల్లించాలంటూ బీఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్లు 497, 503 కింద కోర్టులో దరఖాస్తు చేసుకుంటే పోలీసు, న్యాయ, ఆర్థిక రంగాల సమన్వయంతో డబ్బు తిరిగి పొందవచ్చు. సైబర్ క్రైం గణాంకాల ప్రకారం విశాఖలో రూ.18 కోట్లు వివిధ బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ అయింది. మొదటి విడతగా ఇటీవల రూ.4.65 కోట్లు బాధితులకు తిరిగి ఇచ్చారు. ఇంకా రూ.13 కోట్లకు పైగా బాధితులకు అందించాల్సి ఉంది.

వెంటనే ఇలా చెప్పండి: 'సైబర్ మోసానికి గురైన వ్యక్తి గోల్డెన్ అవర్‌లో(బ్యాంకు నుంచి మోసగాళ్లు డబ్బు తీసేసేలోపు) 1930 నంబర్‌కు కాల్ చేయాలి. లేదా... 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. సైబర్‌క్రైం. జీవోవీ.ఇన్'లో ఫిర్యాదు చేయాలి. తద్వారా బ్యాంకు ఖాతాల్లో నగదును ఫ్రీజ్ చేయటానికి అవకాశం ఉంటుంది' అని జేసీపీ ఫక్కీరప్ప తెలిపారు.

అవగాహనకు: సైబర్ క్రైంపై డాక్యుమెంటరీని విశాఖ పోలీసులు రూపొందిస్తున్నారు. ఇప్పటి వరకు ఎలాంటి సైబర్ నేరాలు జరిగాయి? ఎన్ని విధాలుగా ప్రజలను మోసం చేసే అవకాశాలున్నాయి? అనేదానిపై దీనిని సిద్ధం చేస్తున్నారు. 'మరో రెండు నెలల్లో పూర్తి చేసి ప్రతి గ్రామంలో, థియేటర్లలో, వాణిజ్య సముదాయాల్లో బస్‌స్టాండ్‌లలో ప్రదర్శించేలా ప్రణాళిక చేస్తున్నాం' అని విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీతో తెలిపారు.

**అలా మోసం చేయిస్తూ..**

విదేశాల్లో డేటా ఎంట్రీ ఉద్యోగాల పేరిట రాష్ట్రానికి చెందిన పలువురిని కంబోడియాకు తీసుకెళ్లి చీకటి గదుల్లో బంధించి ఫెడెక్స్, టాస్క్‌గేమ్స్, ట్రేడింగ్‌తోపాటు ఆన్‌లైన్ స్కాంలు చేయాలని యువతను చిత్రహింసలకు గురి చేసిన విషయం ఇటీవల వెలుగులోకి వచ్చింది. సైబర్ మోసాల్లో వచ్చిన డబ్బులో 99 శాంత కంబోడియా ముఠా తీసుకుని, మిగిలిన ఒక శాతం కూడా బాధితులు అక్కడే ఖర్చు చేసేలా పబ్, క్యాసినో, వ్యభిచారం వంటి సదుపాయాలు కల్పించినట్లు విచారణలో తేలింది. ఇటీవల విశాఖ పోలీసులు ఈ ముఠా చేతుల్లో చిక్కిన 58 మందిని రక్షించారు.

**సైబర్ వల విసురుతారు ఇలా..**

సైబర్ నేరగాళ్లు ప్రతి రోజూ వందల మందికి ఫోన్ కాల్స్, లింకులు పంపి వల వేస్తుంటారు. స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్, టాస్క్ గేమ్, ఫెడెక్స్, ట్రాయ్ కాల్, పార్ట్ టైం జాబ్ టాస్క్ కాల్స్ పేరిట నమ్మిస్తారు. తాజాగా మనీ ల్యాండరింగ్ కేసులున్నాయంటూ బెరింపు కాల్స్ చేస్తూ డబ్బులు గుంజేస్తున్నారు.

ఇటీవల విశాఖలోని ఓ మహిళకు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి 'మనీ ల్యాండరింగ్ కేసులో మీపై ఫిర్యాదు ఉంది. ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్టు చేస్తాం' అంటూ బెదిరించి రూ.37లక్షలు గుంజారు.

ప్రతిరోజూ సైబర్ క్రైమ్ స్టేషన్‌కు వస్తున్న బాధితులు 20 మందికి పైగారోజూ నష్టపోతున్న నగదు రూ.50 లక్షల నుంచి రూ.2కోట్ల వరకుబాధితుల్లో 75% (యువత, ఐటీ ఉద్యోగులు, మహిళలు)

# ఇసుక కష్టాలు ఇసుమంతైనా వినరే



ముదిగుబ్బ : శ్రీసత్యసాయి జిల్లాలో ఇసుక కొరత తీవ్రమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత ఇసుక విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. జిల్లాలో జులై 8వ తేదీ నుంచి రామగిరి, కదిరిలోని కుటాగుళ్ల, బత్తలపల్లిలోని నల్లబోయినపల్లి, ముదిగుబ్బలోని ఉప్పలపాడు, కొడవండ్లపల్లి నిల్వ కేంద్రాల్లో టన్ను రూ.277తో రోజుకి ఒక్కొక్కరికి 20 టన్నులతో మొత్తం 61,300 మెట్రిక్ టన్నుల ఇసుకను విక్రయించారు. గత ప్రభుత్వంలో తవ్వి నిల్వ చేసిన ఇసుకంతా అన్నిచోట్ల ఖాళీ అయ్యింది. కేవలం ముదిగుబ్బ మండలంలోని కొడవండ్లపల్లి నిల్వ కేంద్రంలో మాత్రమే లభిస్తోంది. అందులోనూ కేవలం 1400 టన్నులు మాత్రమే ఉండటంతో ఒక్కరోజులో మొత్తం ఖాళీ కానుంది. ఇప్పటి వరకు కొత్తగా రేవు ప్రారంభించకపోవడంతో కొరత ఏర్పడుతోంది.

**పట్టపగలే తెగించేస్తున్నారు..**

ఇసుక రేవులు, వాగులుల్లో ఎద్దులబండ్లకు మాత్రమే ఉచితంగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వం అనుమతి ఉంది. కానీ, ముదిగుబ్బ మండలంలోని బ్రహ్మదేవరమర్రి కొట్టాల సమీపంలోని మద్దిలేరువాగు నుంచి పట్టపగలే యథేచ్ఛగా అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. గత రెండు నెలలుగా ఇసుకాసురులు రోజుకు పది, పదిహేను ట్రాక్టర్లలో లోడు చేసుకుని ట్రిప్పు రూ.4 వేలు నుంచి 5 వేలకు విక్రయిస్తున్నారు. ముదిగుబ్బతోపాటు, నల్లమాడ, బుక్కపట్నం, కదిరి, తలుపుల ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. బూదనాంపల్లి సమీపంలోని మద్దిలేరు వాగు నుంచి కూడా కొందరు ట్రాక్టర్లకు ఇసుక నింపుకొని అక్రమంగా తరలిస్తున్నా మైనింగ్, పోలీసులు, అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. కొందరు నాయకుల ఒత్తిళ్లతో అక్రమ రవాణా జరుగుతున్నా నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారన్న విమర్శలున్నాయి.

**రాత్రంతా పడిగాపులు**

జిల్లాలోని ఐదు నిల్వ కేంద్రాల్లో నాలుగింటిలో నిల్వలు ఖాళీ అయ్యాయి. నల్లబోయినపల్లి స్టాక్‌పాయింట్‌లో 9 వేల టన్నులు ఉన్నా ప్రభుత్వ భవన నిర్మాణాలకే వినియోగిస్తున్నారు. ఉప్పలపాడులో 660 టన్నులు మాత్రమే ఉంది. కొడవండ్లపల్లి స్టాక్‌పాయింట్‌లో మాత్రమే ఇసుక ఉండటం, అందులోనూ రోజుకి 80 టిప్పర్లు మాత్రమే అనుమతించడంతో టిప్పర్లు బారులు తీరుతున్నాయి. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా చేయాలన్న నిబంధన ఉన్నా 11 గంటలకు ప్రారంభించి 6 గంటలకు ముగిస్తుండటంతో అనంతపురం, కదిరి, రామగిరి దూర ప్రాంతాల నుంచి వచ్చిన వినియోగదారులు రాత్రంతా అక్కడే పడిగాపులు కాస్తున్నారు. తినేందుకు భోజనం, నీటి సౌకర్యం లేకుండా టిప్పర్లను వరుసలో ఉంచి మరుసటిరోజు ఉదయం వరకు వేచిచూస్తూ అవస్థలు పడుతున్నారు.

**త్వరలోనే కొత్త రేవులు ప్రారంభిస్తాం- రామ్మోహన్‌రావు, మైన్స్ ఏడీ**

ముదిగుబ్బ, తాడిమర్రిలోని పెద్దచిగుళ్లరేవు, చిన్నచిగుళ్లరేవులో సుమారు 20 వేల టన్నుల ఇసుక సరఫరా చేసేందుకు గుర్తించాం. త్వరలోనే నూతనంగా రేవులు ప్రారంభించి వినియోగదారులకు ఇసుక కొరత లేకుండా చూస్తాం.


అక్రమ రవాణా చేస్తే చర్యలు - యతీంద్ర, ముదిగుబ్బ టౌన్ సీఐ

బ్రహ్మదేవరమర్రి కొట్టాల సమీపంలో ఇసుక అక్రమ రవాణా చేయకుండా బందోబస్తు నిర్వహిస్తాం. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

# గండ్రాజుపల్లిని గాలికొదిలేసి

చిత్తూరు :రాష్ట్ర విభజనకు ముందు కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో గండ్రాజుపల్లి పారిశ్రామికవాడను ఏర్పాటు చేశారు. దీన్ని ఆనుకుని జాతీయ రహదారి ఉండటం, 120 కి.మీ దూరంలోనే బెంగళూరు ఉన్నందున ఎక్కువ మంది ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపారు. ఆహార ఉత్పత్తుల దిగ్గజ కంపెనీ అయిన పార్లే, ఫాంగేట్, తిరుమల డెయిరీ, ఆహారశుద్ధి పరిశ్రమలు, పలు టెక్స్‌టైల్ కంపెనీలు గండ్రాజుపల్లికి వచ్చాయి. దాదాపు 50 పరిశ్రమలు ఉన్నాయి. 2017లో కుర్లాన్ ఇండస్ట్రీస్ సంస్థ రూ.500 కోట్ల పెట్టుబడి పెడతామని ప్రతిపాదించింది. 1,250 మందికి ఉపాధి కల్పిస్తామని ప్రకటించింది. స్థల వివాదం కారణంగా ఇది కార్యరూపం దాల్చలేదు. ఐదేళ్లుగా వైకాపా ప్రభుత్వం పరిష్కారానికి ఎటువంటి చొరవ చూపలేదు.

రోజుకు ఐదారుసార్లు కోతలు గండ్రాజుపల్లి పారిశ్రామికవాడలో ప్రధానంగా విద్యుత్తు సమస్యలు ఎదురవుతున్నాయి. విద్యుత్తు ఉప కేంద్రం ఏర్పాటు చేయాలని పెట్టుబడిదారులు ఐదేళ్లుగా విజ్ఞప్తి చేస్తూనే ఉన్నారు. జిల్లాకే చెందిన అప్పటి విద్యుత్తు శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పందిస్తారని ఆశించినా ప్రయోజనం లేకపోయింది. రోజుకు ఐదారుసార్లు కోతలు విధిస్తున్నందున తరచూ ఉత్పత్తి కార్యకలాపాలకు అవాంతరం కలుగుతోంది. ముఖ్యంగా ప్లాస్టిక్ పరిశ్రమలు ఇబ్బంది పడుతున్నాయి. ఒక్కసారి విద్యుత్తు పోతే ముడి సామగ్రి పనికిరాకుండా పోతోంది. డెయిరీలకు నిరంతరం విద్యుత్తు అవసరమని అధికారులకు చెప్పినా



వారు చేతులెత్తేశారు. ఏపీఐఐసీ భూమి కేటాయించినా ఇప్పటికీ ఉప కేంద్రం పనులు మొదలు కాలేదు.

వేలాది మందికి ఉపాధి గండ్రాజుపల్లి పారిశ్రామికవాడలో 416 ప్లాట్లున్నాయి. ఇందులో 150 వరకే పరిశ్రమల కోసం తీసుకున్నారు. కొత్తగా పెట్టుబడులు పెట్టేందుకు ఎవరైనా ఇక్కడకు వచ్చి స్థల పరిశీలన చేసిన సమయంలో విద్యుత్తు ఇబ్బందులు ఉన్నట్లు తెలిసి వెనక్కు వెళుతున్నారు. ఉప కేంద్రాన్ని అందుబాటులోకి తెస్తే పారిశ్రామికవేత్తలు ఉత్సాహంగా ముందుకొస్తారు. తద్వారా పలమనేరు, పుంగనూరు నియోజకవర్గంలోని మహిళలు, యువత వేలాది మందికి ఉపాధి దొరుకుతుంది. కూటమి ప్రభుత్వమైనా దీనిపై దృష్టి పెడితే ఫలితం ఉంటుంది.

# అధికారుల నిర్లక్ష్యం.. ఆయకట్టుకు శాపం

చిత్తూరు : అన్నదాతల పట్ల ఎక్కడాలేని ప్రేమ ఒలకబోసే వైకాపా అధినేత జగన్.. జిల్లా జల వనరుల పురోగతిని అథఃపాతాళానికి తొక్కేశారు.. ప్రాజెక్టుల నిర్వహణ గాలికొదిలేశారు.. జగన్ సర్కారు చేసిన పాపం రైతుల్ని ఇప్పటికీ వెంటాడుతోంది.. ప్రధానంగా పెనుమూరు మండలంలోని ఎన్టీఆర్ జలాశయం మిగులు జలాలను చెరువులకు అనుసంధానం చేసే పనులు అటకెక్కాయి. రైతులు తీవ్రంగా నష్టపోగా మిగులు జలాలు సముద్రం పాలవుతున్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం చెరువుల అనుసంధాన పనులు త్వరగా పూర్తిచేసి ఆయకట్టుకు నీరందించాలని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. జిల్లాలో భారీ వర్షాలు కురిసినప్పుడు వరద ఉద్ధృతంగా పెనుమూరు మండలం కలవగుంట వద్ద ఎన్టీఆర్ జలాశయంలోకి ఈ జలాశయంలోకి చేరుతోంది. మిగులు జలాల సద్వినియోగంతో ఆయకట్టుకు నీరందించవచ్చని గత తెదేపా ప్రభుత్వం సంకల్పించింది. గంగాధర నెల్లూరు మండలంలో 31 చెరువులకు, పెనుమూరు మండలంలో రెండు చెరువులకు మళ్లించి పూర్తిస్థాయిలో నింపేందుకు ప్రణాళిక రూపొందించి ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

అంతా ఆర్భాటమే..గత వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్టీఆర్ జలాశయ మిగులు జలాలను చెరువులకు అనుసంధానం పనులు పూర్తి చేస్తామని ఆ పార్టీ నాయకులు ఆర్భాటపు ప్రకటనలిచ్చారు. అనుసంధానం పనులకు రూ.103.23 కోట్లు కేటాయించారు. భూసేకరణకు రూ.63.23 కోట్లు కాగా.. మిగిలిన రూ.130 కోట్లు అనుసంధాన పనులకు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. భూసేకరణ ప్రక్రియ అర్థాంతరంగా ఆగిపోగా పనుల నిర్వహణ పూర్తిగా గాలికొదిలేశారు.



అక్రమంగా రూ.3 కోట్ల పనులకు బిల్లులు..?

ఇప్పటివరకు కనీసం రూ.కోటి విలువ చేసే పనులైనా జరగలేదని సమాచారం. రూ.3 కోట్లు అంచనా విలువ పనులు జరిగినట్లు దొంగచాటుగా బిల్లులు నమోదు చేసినట్లు తెలిసింది. దీనిపై కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఉన్నతాధికారులు త్వరలో విచారణకు ఆదేశించనున్నారని తెలిసింది.

ఒక శాతం జరిగితే ఒట్టు..33 చెరువుల అనుసంధాన పనులను తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాకు చెందిన ఓ గుత్తేదారు సంస్థ దక్కించుకుంది. 2025 మార్చి 30లోగా చేయాల్సి ఉన్నప్పటికీ ఒక శాతం పనులు కూడా జరగలేదంటే పురోగతి ఎలా ఉందో అర్థమవుతోంది. రూ.40-50 కోట్ల అంచనా విలువ పనులను భూసేకరణతో సంబంధం లేకుండా చేపట్టవచ్చు. ఇప్పటివరకు సదరు గుత్తేదారు సంస్థకు జలవనరుల శాఖ అధికారులు నోటీసులు జారీ చేయకపోవడం గమనార్హం.గుత్తేదారుకు నోటీసులు ఇస్తాంచెరువుల అనుసంధాన పనులు చేపట్టని గుత్తేదారు సంస్థకు త్వరలో నోటీసులు ఇస్తాం. స్పందించకుంటే చర్యలకు ఉపక్రమిస్తాం. త్వరగా పనులు ప్రారంభించి పూర్తయ్యేలా చూస్తాం.- విజయకుమార్‌రెడ్డి, ఎస్ఈ, జలవనరుల శాఖ

# 4 కాదు.. 10 శాతం చెల్లించాల్సిందే!

చిత్తూరు: పలమనేరు మండలానికి చెందిన ఓ రైతు నాలుగు ఎకరాల్లో టమాటా సాగు చేస్తున్నారు. ఇప్పటివరకు రూ.5 లక్షలు పెట్టుబడి పెట్టారు. వర్షాభావంతో దిగుబడులు అంతంతమాత్రంగా రావడంతో పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు. ఇటీవల పలమనేరు మార్కెట్‌కు 120 క్రేట్లు తీసుకెళ్లగా రూ.18వేలు పలికింది. అందులో కమీషన్‌గా రూ.1,800 తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రకృతి విపత్తులు టమాటా రైతులను కకావికలం చేస్తున్నాయి.. పెట్టిన పెట్టుబడులూ చేతికి అందక తల్లడిల్లుతున్నారు. ఇలా కర్షకులు అష్టకష్టాలు పడుతుంటే మార్కెట్ కమిటీల్లోని కొందరు మండీల నిర్వాహకులు వారిని దోచుకుంటున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన 4 శాతం కమీషన్‌కు బదులుగా ఏకంగా 10 శాతం వసూలు చేస్తూ రైతులను మరింత ఇబ్బందుల్లోకి నెడుతున్నారు. పర్యవేక్షించాల్సిన మార్కెటింగ్ శాఖ అధికారులు ఇది తమ పని కాదన్నట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లాలో 26వేల ఎకరాల్లో టమాటా సాగవుతోంది. ఒక్కో రైతు ఎకరాకు రూ.లక్ష- రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెడుతున్నారు. ఆరుగాలం శ్రమించినా ఇంత ఖర్చు చేసినా పంట చేతికి అందే పరిస్థితి లేదు. వర్షాల ప్రభావంతో తెగుళ్ల సోకి దిగుబడులు గణనీయంగా తగ్గుతున్నాయి. వాతావరణం అనుకూలిస్తే 15- 20 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. ఎక్కువ శాతం మందికి ప్రస్తుతం 10 క్వింటాళ్లకు మించి వచ్చేది లేదు. ఇలా అన్నదాతలు ఏటా ప్రకృతితో పోరాడుతూనే ఉన్నారు.

మార్కెట్‌లో దించింది మొదలు

అరకొరగా వచ్చిన పంటను రైతులు మార్కెట్‌కు తీసుకెళితే వ్యాపారులు చుక్కలు చూపిస్తున్నారు. క్రేట్లు దించింది మొదలు మండీల నిర్వాహకులకు అమ్మే వరకూ అడుగడుగునా మోసపోతున్నారు. పుంగనూరు వ్యవసాయ కమిటీ మార్కెట్‌లో సరకు దించడానికి క్రేట్‌కు రూ.2 వసూలు చేస్తున్నారు. 15 కిలోల బాక్సులో దాదాపు అర కిలో తీసేస్తున్నారు. టమాటాల నాణ్యత బాగాలేదనే నెపంతో కొందరు వ్యాపారులు వంద క్రేట్లకు 2- 3 క్రేట్లను జాక్‌పాట్‌గా తీసేస్తున్నారు. ఇదే పరిస్థితి పలమనేరులోనూ ఉంది. ఇక్కడితో ఆగకుండా 10 శాతం కమీషన్‌ను ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఇటువంటి ఘటనలు గతంలోనే ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో 4 శాతం మాత్రమే తీసుకోవాలని స్పష్టంగా ఆదేశించింది. అయినా మండీల నిర్వాహకులు లెక్కచేయడం లేదు. అన్నదాతలు సైతం ప్రశ్నించలేకపోతున్నారు. గట్టిగా అడిగితే వ్యాపారులు టమాటా కొనరని భయపడుతున్నారు.

ఉక్కుపాదం మోపితేనేవ్యవస్థీకృతంగా జరుగుతోన్న ఈ దోపిడీకి అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత మార్కెటింగ్ శాఖ అధికారులపైనే ఉంది. వ్యాపారులు కూడబలుక్కుని ధరలు నిర్ణయించే ధోరణికి స్వస్తి పలికించాలి. అలా కాకుండా మెతక వైఖరి అవలంబిస్తున్నందునే రాత్రింబవళ్లు కష్టపడిన రైతులు నష్టపోయి చెమట చుక్క చిందించని నిర్వాహకులు లాభపడుతున్నారు. పది శాతం కమీషన్, జాక్‌పాట్‌పై ఇప్పటికైనా ఉక్కుపాదం మోపాలి.

# కాగితాల్లోనే కుళాయి కనెక్షన్లు

చిత్తూరు: ఐదేళ్ల వైకాపా పాలన పల్లెల పాలిట శాపమైంది. గ్రామ స్వరాజ్యాన్ని తెచ్చానని అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చారు. వాస్తవంలో భిన్నమైన పరిస్థితి ఉంది. ఆర్థిక సంఘం నుంచి పంచాయతీలకు రావాల్సిన నిధులు మళ్లించి ప్రగతి కుంటుపడేలా చూశారు. చివరికి జలజీవన్ మిషన్ (జేజేఎం) కింద పల్లెల్లో ప్రతి ఇంటికీ కుళాయి బిగించి నీరందించాలని కేంద్రం నిర్దేశించగా రాష్ట్ర ప్రభుత్వం వాటా నిధులు ఇవ్వకపోవడంతో లక్ష్యానికి గండిపడింది.

గ్రామంలో నివసించే ప్రతి వ్యక్తికీ రోజుకు 55 లీటర్ల సురక్షిత నీరు అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2019లో జలజీవన్ మిషన్‌కు శ్రీకారం చుట్టింది. అన్ని ఇళ్లకూ కుళాయి కనెక్షన్ ఇవ్వడంతోపాటు అంగన్‌వాడీలు, పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సైతం నీరు ఇవ్వాలన్నది కేంద్రం ఉద్దేశం. జగన్ సర్కార్ రాష్ట్ర వాటా నిధులు విడుదల చేయనందున పనులు సాగలేదు. ఇప్పటికీ రూ.17 కోట్ల బకాయిలు గుత్తేదారులకు చెల్లించాలి. కేంద్రం నుంచి ఒత్తిడి రావడంతో గతేడాది డిసెంబరు నాటికి 3,80,547 కుళాయి కనెక్షన్లు ఇచ్చామని కాగితాలపై చూపారు.

**37,054 మంది లబ్ధిదారులే లేని వైనం**

వైకాపా హయాంలో తప్పులతడకగా నివేదికలు ఇచ్చారని కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. ఈ నేపథ్యంలో సచివాలయాల్లోని దాదాపు 700 మంది సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుళాయి కనెక్షన్ ఉందా? లేదా? ఉంటే ఎప్పుడు ఇచ్చారు? 2019కి ముందా తర్వాతా? అందుతున్న నీటిలో నాణ్యత ఉందా? లేదా? అని సర్వే చేయాలని ఆదేశించింది. ఆగస్టు 16 నుంచి ఈ పల్స్ సర్వే చేపట్టారు. జిల్లాలో ఇప్పటివరకు 73.96 శాతం గృహాల్లో సర్వే చేయగా 37,054 మంది లబ్ధిదారులే లేరని తేలింది. 2,01,909 ఇళ్లకే కుళాయి కనెక్షన్ ఉందని గుర్తించారు.

**వచ్చే ఏడాది డిసెంబరుకు పూర్తి చేయాలని**

పల్స్ సర్వే ప్రకారం కొత్తగా మరో 1,20,928 గృహాలు గుర్తించారు. పాత, కొత్త గృహాలకు కనెక్షన్ ఇవ్వాలి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తన వాటా కింద రూ.500 కోట్లు విడుదల చేయాలని నిర్ణయించింది. కేంద్రం నుంచీ రాబట్టేందుకు యత్నిస్తోంది. ఈ డబ్బుతో జిల్లాలో వచ్చే ఏడాది డిసెంబరు నాటికి అన్ని ఇళ్లకూ కుళాయి బిగించి నీరు అందించేందుకు సమాయత్తమవుతోంది.

# తవ్వకూడని చోట తోడేస్తున్నారు!

దేవరాపల్లి : దేవరాపల్లి మండలం రైవాడ జలాశయం మొదలుకొని కె.కోటపాడు మండలం చౌడువాడ వరకు శారదానదికి రెండువైపులా సాగునీటి కాలువలు, వంతెనలు, తాగునీటి పథకాలు, ఆనకట్టలు, గ్రోయిన్లు ఇలా ప్రజాప్రయోజన కట్టడాలు చాలా ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ ప్రాంతాల్లో ఎక్కడా ఇసుక తవ్వకూడదు. అయినా గత వైకాపా ప్రభుత్వంలో అప్పటి జిల్లాకు చెందిన మంత్రి ప్రోద్బలంతో 2020 నుంచి 2023 వరకు ఇసుకను అక్రమంగా తరలించి భారీగా సొమ్ములను ఆర్జించారు. ఇప్పుడు ప్రభుత్వం మారినా అక్రమ తరలింపులు ఆగలేదు. శారదానదిని కొందరు నిలువు దోపిడీ చేస్తుండడంతో ఆయకట్టు భూముల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కాలువల మొదలు వద్ద ఇసుకను తవ్వేయడంతో కాలువలకు లక్షలు వెచ్చించి మరమ్మతులు చేస్తున్నా ఆయకట్టుకు నీరు చేరడంలేదు.

నష్టపోతున్న రైతులు..జిల్లాస్థాయి అధికారులు ఎవరైనా శారదానదిని పరిశీలిస్తే అక్రమ తవ్వకాల వల్ల రైతులు ఎన్ని విధాలుగా నష్టపోతున్నారనేది ఇట్టే తెలుస్తోంది. ఒడ్డునే తవ్వేయడంతో గట్లు పూర్తిగాపోయి రైతుల భూములు నదిలో కలిసిపోయాయి. ఈ నది నీటిని గరుగుబిల్లి, జగ్గరాజు, సెరి, శేమునాపల్లి కాలువల ద్వారా ఆయకట్టు భూములకు తరలిస్తారు. అలాంటిది 12 సంవత్సరాల నుంచి సుమారు 600 ఎకరాలకు నీరు సక్రమంగా అందడంలేదు. గతంలో తెదేపా, కాంగ్రెస్ ప్రభుత్వాలు దఫదఫాలుగా ఈ కాలువల మరమ్మతులకు రూ. కోటి వరకు ఖర్చు చేసినా అదంతా బూడిదలో కలిసినట్లు అయ్యింది.

టైరు బండ్లతో లారీలకు

గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం పేరుతో రాత్రి పగలు తేడా లేకుండా చౌడువాడ, గుల్లిపల్లి, గొండుపాలెం తదితర గ్రామాలకు చెందినవారు టైరు బండ్ల ద్వారా ఇసుకను శారదానది నుంచి తెస్తున్నారు. ఆ సరకును రాత్రుళ్లు లారీలను రప్పించి అక్రమంగా అమ్మకాలు జరుపుతున్నారు. అభివృద్ధి పనుల పేరుతో కొందరు ట్రాక్టర్ల యజమానులు, లారీల యజమానులు అక్రమంగా వ్యాపారాలు చేసుకుంటున్నారు.



చౌడువాడలో అక్రమ తరలింపు ఆపేందుకు గొయ్యిలు తవ్వినా వేరే చోట్ల నుంచి తరలిస్తున్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా కె.కోటపాడు పోలీసులు గతనెలలో అప్పటి ఎస్సై లక్ష్మీనారాయణ మూడు లారీలను పట్టుకుని సీజ్ చేశారు.

నిషేధిత ప్రాంతమని నివేదించినా..

2019 మేలో గత తెదేపా ప్రభుత్వ హయాంలో చౌడువాడ, మల్లమ్మపాలెం గ్రామాలను ఆనుకొని ఉన్న శారదానది పొడవునా ఇసుక లేకపోవడంతోపాటు ఎక్కడికక్కడే ప్రమాదకర పెద్దపెద్ద గొయ్యిలు ఉండటాన్ని గుర్తించి అప్పటి అనకాపల్లి ఆర్డీఓ ద్వారా కలెక్టరుకు నివేదిక పంపారు కలెక్టరు ఆదేశాల మేరకు అప్పటి జిల్లా గనులు, భూగర్భజలశాఖ సహాయ సంచాలకులు ప్రసాద్ మల్లమ్మపాలెం, చౌడువాడ ప్రాంతాల్లో శారదానదిని పరిశీలించారు. ఇసుక తవ్వకూడని ప్రాంతాలుగా గుర్తించారు.

చాలాసార్లు నివేదించాం– సత్యంనాయుడు, డీఈ, జలవనరులశాఖ, కె.కోటపాడుకె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో కాలువలు, గ్రోయిన్లు చాలా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టడానికి అందరూ సహకరించాలని రెవెన్యూ అధికారులకు, మండల సర్వసభ్య సమావేశాల్లో ప్రజాప్రతినిధులకు చాలాసార్లు విన్నవించాం. అయినా ఆగని తవ్వకాల వల్ల పథకాలు పాడవుతున్నాయి.కేసులు నమోదు చేస్తాం...– ధనుంజయ, ఎస్ఐ, కె.కోటపాడు ట్రాక్టర్లు లారీల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తే ఆ వాహనాలను పట్టుకుని కేసులు నమోదు చేస్తాం. రెవెన్యూ అధికారుల సహకారంతో దాడులు చేస్తాం. ఇది వరకు చాలా కేసులు నమోదు చేశాం. ఇళ్ల నిర్మాణాల పేరుతో లారీలకు ఇసుకను అమ్మినా కేసులు తప్పవు.

# ఒక వైపే చూస్తాం..



విశాఖపట్నం : వైకాపా హయాంలో దమ్మున్నోడిదే భూమి అన్నట్లు నేతలు దందాలు సాగించారు. అధికారం అడ్డుపెట్టుకుని అక్రమాలను సక్రమాలుగా మార్చుకున్నారు. వారికి అధికారులూ సహకరించారు. సామాన్యుల విషయానికి వచ్చేసరికి మాత్రం చట్టాలే చుట్టాలంటూ సంవత్సరాల తరబడి కాళ్లరిగేలా తిప్పించుకునేవారు. అనకాపల్లి పట్టణం నడిబొడ్డున రూ.కోట్ల విలువ చేసే స్థలం విషయంలో జీవీఎంసీ అధికారులు వ్యవహారశైలి అనుమానాలకు తావిస్తోంది.

మిరియాల కాలనీ వద్ద పురపాలక సంఘం స్థలంలో అయిదు దశాబ్దాల క్రితం సిబ్బంది కోసం ఎల్ఐజీ క్వార్టర్లు నిర్మించారు. వాటిలో నివాసం ఉండే సిబ్బందిలో కొందరు పురపాలక సంఘం తీర్మానాలు చేయించుకున్నారు. అవి చూపుతూ ఆ ఇళ్లు తమకే చెందుతాయని న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించారు. అప్పట్లో పురపాలక సంఘం అధికారులు ఆ పిటీషన్లను పట్టించుకోలేదు. దీంతో న్యాయస్థానం ఒకరిద్దరు ఉద్యోగుల కుటుంబాలకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అందులో ఒకరి నుంచి ఇంటి స్థలాన్ని వైకాపా యువజన విభాగం నాయకుడు దక్కించుకున్నాడు. ఎల్ఐజీ ఇంటి స్థలం కొనుగోలుచేసిన ఆయన ఆ స్థలాన్ని 532 గజాలుగా రికార్డుల్లో మార్చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారనే ఆరోపణలున్నాయి. అదే స్థలం పక్కన మరో ఎల్ఐజీ ఇంటి స్థలంపై మాజీ ఉద్యోగి కోర్టుకు వెళ్లినా అతనికి దక్కకుండా జీవీఎంసీ అధికారు లు అడ్డుకుంటున్నారు. తప్పుడు డోర్ నంబర్‌తో దస్తావేజులు సృష్టించారని ఆ స్థలం జీవీఎంసీదేనని బహిరంగ ప్రకటనలు జారీచేశారు. ప్రభుత్వ స్థలాలను కాపాడుకోవడంలో తప్పులేదు.. అదే వైఖరి వైకాపా నేతకు చిక్కిన స్థలంపైనా జీవీఎంసీ పోరాడి ఉంటే బాగుండేదనే భావన స్థానికుల నుంచి వ్యక్తమవుతోంది.

**ఆ నేతకు రెండితల స్థలం ఎలా..?**

పురపాలక శాఖ ఎల్ఐజీ క్వార్టర్లంటే అన్నీ ఒకే విస్తీర్ణంలో ఉండాలి. అంతేగానీ ఒక్కొక్కరికి ఒక్కో విస్తీర్ణంలో నిర్మించరు కదా.. మరి అనకాపల్లిలో ఈ మాయాజాలం కనిపించింది. అదేలా అంటారా టౌన్ సర్వే నంబర్ 348–1లో ఎల్ఐజీ క్వార్టర్లు నిర్మించారు. అందులో రెండో క్వార్టర్‌పై విశ్రాంత ఉద్యోగి, జీవీఎంసీ మధ్య వివాదం నడుస్తోంది. ఆ విశ్రాంత ఉద్యోగి తనది అని చెబుతున్న ఇల్లు 289 చ.గజాల్లో ఉందని, హద్దులు వివరిస్తూ ఆ ఇల్లు అతనిది కాదు జీవీఎంసీకి చెందినదని 2019లోనే ప్రతికల్లో బహిరంగ ప్రకటనలు జారీచేశారు. పురపాలక శాఖ పేర్కొన్నట్లు రెండో నంబర్ క్వార్టర్ 289 చ.గజాల్లో ఉంటే దానిని ఆనుకుని ఉన్న ఒకటో నంబర్ క్వార్టర్ కూడా అదే విస్తీర్ణంలో ఉండాలి కదా. ఇక్కడే పెద్దమాయ చోటుచేసుకుంది. ఆ ఒకటో నంబర్ క్వార్టర్ స్థలం వైకాపా నేత చేతికి వచ్చింది. ఆ తర్వాత దాని విస్తీర్ణం 532 గజాలుగా మారిపోయింది. అంటే రెండింతలు విస్తీర్ణం పెరిగిపోయింది. అప్పుడు కూడా జీవీఎంసీ అధికారులు అభ్యంతరం తెలపలేదు. ఆయన మాజీ మంత్రి అమర్‌నాథ్‌కు ముఖ్య అనుచరుడు కావడం.. వైకాపా అధికారంలో ఉండడంతో వారు అడిగిందే తడవుగా నిర్మాణాలకు అనుమతులిచ్చేశారు. మిగతా శాఖలు ఎన్వోసీలు ఇచ్చేశాయి.

ఓవైపు రెండో క్వార్టర్ స్థలం తమదేనని విస్తీర్ణంతో సహా లెక్కలు చెబుతున్న జీవీఎంసీ అధికారులు, ఒకటో క్వార్టర్ విస్తీర్ణం 532 గజాలకు ఎలా పెరిగిందని ఆలోచన కూడా చేయడం లేదు. నాడు పాలకులు చెప్పినట్లు తలూపేసి రూ.కోట్ల స్థలాన్ని అప్పనంగా చేతిలో పెట్టేశారు. కూటమి నేతలైనా ఈ అక్రమాలపై దృష్టిసారించాలని ప్రజా సంఘాలు కోరుతున్నాయి. ఈ విషయమై జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు వద్ద ప్రస్తావించగా, 'పురపాలక సిబ్బందికి స్థలాల గురించి అవగాహన లేదని, ఓసారి పాత దస్త్రాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామ'న్నారు.

# శిశువు ఆరోగ్యానికి రక్ష..!



విశాఖపట్నం : కేజీహెచ్ పిల్లల వార్డులో ఇటీవల తీవ్ర అనారోగ్య సమస్యలతో జన్మించిన నవజాత శిశువుకు వెంటిలేటర్‌తో కూడిన వైద్యం అందించారు. 56రోజుల పాటు అందించిన చికిత్స ఫలితంగా శిశువు పూర్తి స్థాయిలో కోలుకుంది. బయట ఆసుపత్రిలో ఈ వైద్యానికి రూ.50లక్షల నుంచి రూ.60లక్షలు ఖర్చయ్యేదని వైద్యులు తెలిపారు.కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని ప్రైవేటు వసతి గృహంలో కలుషిత ఆహారం తిని తీవ్ర అస్వస్థతకు గురైన 38 మంది చిన్నారులను కేజీహెచ్‌కు తీసుకొచ్చారు. పిల్లల వార్డులోని ఐపీసీయూలో వీరికి చికిత్స అందించారు. కీలక వైద్య పరికరాల సహాయంతో మెరుగైన వైద్యం అందడంలో అందరూ కోలుకున్నారు.

కేజీహెచ్ (కింగ్ జార్జి ఆసుపత్రి) పిల్లల విభాగానికి ఇటీవల కాలంలో అత్యాధునిక వైద్య పరికరాలు సమకూరాయి. జాతీయ ఆరోగ్య మిషన్ (నేషనల్ హెల్త్ మిషన్) సహాయంతో రూ.80 లక్షలు ఖర్చు చేసి 20 పడకలతో ఉన్న నవజాత శిశువుల అత్యవసర విభాగాన్ని 60 పడకల సామర్థ్యానికి పెంచారు. జిల్లా కలెక్టర్ సీఎస్ఆర్ కింద విడుదల చేసిన రూ.80 లక్షలతో పిల్లల అత్యవసర విభాగాన్ని (ఐపీసీయూ) పూర్తి స్థాయిలో నవీకరించారు. ఇక్కడ 50 పడకలు అందుబాటులో ఉన్నాయి. సంక్లిష్టమైన ఆరోగ్య సమస్యలతో వచ్చే చిన్నారులను రక్షించడంలో ఈ రెండు వార్డులు కీలక పాత్ర పోషిస్తున్నాయి.

**అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు ...**

12 వెంటిలేటర్లు, సెంట్రల్ ఆక్సిజన్ వ్యవస్థ, సక్షన్లు, కేంద్రీకృత శీతలీకరణ వ్యవస్థ, ఇంటెన్సివ్ కేర్ యూనిట్లు, ఫొటో థెరపి యూనిట్లు, మల్టీఛానల్ మోనిటర్లు, బెడ్‌సైడ్ ఎక్సరే మిషన్, బెడ్‌సైడ్ నియోనెటాల్ అల్ట్రా సౌండ్ పరికరం, ఈసీజీ యంత్రాలు అందుబాటులో ఉన్నాయి.

**20 పడకలతో పునరావాస కేంద్రం**

పోషకాహార లోపంతో జన్మించే శిశువులకు అవసరమైన వైద్యం అందించేందుకు 20 పడకలతో కూడిన పునరావాస కేంద్రం (న్యూట్రీషియన్ రిహాబిలిటేషన్ సెంటర్) అందుబాటులో ఉంది. ఇక్కడ బాధిత చిన్నారులకు సమయానుకూలంగా పోషకాహారం అందజేసి వారి ఆరోగ్యాన్ని చక్కదిద్దుతున్నారు.

**ఏటా 6వేల మందికి చికిత్స**

ఏడాదికి 6 వేల మంది పిల్లలకు ఇక్కడ చికిత్స అందిస్తున్నారు. వీరితో పాటు 8 వేల మంది హైరిస్క్‌తో కూడిన నవజాత శిశువులు చికిత్స తీసుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులవుతున్నారు. సికిల్, తలసీమియా వ్యాధిగ్రస్తులతో పాటు హీమోఫీలియా, ఉబ్బ కామెర్ల బాధిత చిన్నారులకు చికిత్స అందిస్తున్నారు.

**'నీలోఫర్' తరహాలో అభివృద్ధి చేయాలి –** డాక్టర్ చక్రవర్తి, కేజీహెచ్ పిల్లల విభాగాధిపతి

హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రి తరహాలో కేజీహెచ్ పిల్లల వార్డును అభివృద్ధి చేయాలి. భవిష్యత్‌లో తల్లిపాల బ్యాంకు ఏర్పాటుకు చొరవ తీసుకుంటున్నాం. పీడియాట్రిక్ సూపర్ స్పెషాల్టీ సర్వీసులు అందుబాటులోకి వస్తే మరింత నాణ్యమైన వైద్యం అందించవచ్చు. నియోనెటాల్ పీజీ కోర్సు ప్రవేశపెడితే నవజాత శిశువుల మరణాల రేటును నియంత్రించవచ్చు. ప్రస్తుతం ఉన్న సౌకర్యాలతో అవయవాలు సక్రమంగా ఏర్పడకుండా పుట్టిన శిశువులు, గుండె, కాలేయ సంబంధిత వ్యాధులు, ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బందులు, నెలలు తక్కువగా పుట్టిన చిన్నారులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం.

# హాజరు కనికట్టు.. బిల్లులు కొల్లగొట్టు!



అనంతపురం : సంక్షేమ వసతిగృహాలు, గురుకులాలు, కేజీబీవీల్లో కొందరు అధికారులు అక్రమాలకు తెరతీశారు. విద్యార్థులకు అందించే భోజనం విషయంలో అవినీతి పాల్పడుతూ జేబులు నింపుకొంటున్నారు. వసతిగృహాల్లో ఉన్న విద్యార్థుల సంఖ్యను రెండు, మూడింతలు చూపి బిల్లులు కాజేస్తున్నారు. మరికొందరు ప్రభుత్వం అందించే బియ్యాన్ని విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. పండగలు, సెలవుల సమయంలో ఇంటికెళ్లిన విద్యార్థులు హాజరైనట్లు నమోదు చేసి బిల్లులు నొక్కేస్తున్నారు. రోజుకు ఒక్కో అధికారి రూ.5 వేల నుంచి రూ.7వేల వరకు అవినీతికి పాల్పడుతున్నారు. అన్ని రకాల వసతిగృహాలు, కేజీబీవీల్లో విద్యార్థుల భోజనం కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున ఖర్చు చేస్తోంది. ఉచితంగా బియ్యం అందించడంతో పాటు ఒక్కో విద్యార్థికి రూ.33 నుంచి రూ.53 అందిస్తున్నారు. ప్రతినెలా హాజరును బట్టి బిల్లులు చెల్లిస్తున్నారు. ఈక్రమంలో కొన్ని వసతిగృహాలకు చెందిన అధికారులు ఉన్న విద్యార్థుల కంటే ఎక్కువమంది హాజరైనట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. అనుమానం రాకుండా అర్ధరాత్రి 12 గంటలకు హాజరు వేస్తున్నారు. బీసీ సంక్షేమ హాస్టళ్లలో బయోమెట్రిక్ పరికరాలు పనిచేయడం లేదనే సాకుతో మ్యానువల్‌గా హాజరు నమోదు చేస్తున్నారు. ఒక్కో హాస్టల్ పరిధిలో నెలకు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు బిల్లులు సమర్పిస్తున్నారు.

కొరవడిన పర్యవేక్షణ..

బీసీ సంక్షేమశాఖలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో క్షేత్రస్థాయిలో కొందరు అధికారులు ఇష్టారీతిన పని చేస్తున్నారు. హాజరు శాతాన్ని ఎక్కువ చూపడం ద్వారా బియ్యం మిగులుతోంది. కొందరు బియ్యాన్ని సైతం అమ్ముకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ఇచ్చిన మెనూను సక్రమంగా అమలు చేయడం లేదని విద్యార్థులు వాపోతున్నారు.

విచారణ జరిపిస్తాం..

– వినోద్‌కుమార్, కలెక్టర్, అనంతపురం

ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి మాత్రమే హాజరు నమోదు చేయాలి. ఎక్కువ చేసి చూపితే కఠిన చర్యలు తీసుకుంటాం. వెంటనే విచారణ జరిపిస్తాం. సంక్షేమశాఖ అధికారులను పంపించి నివేదిక తెప్పించుకుంటాం.

# ఇళ్లు.. పగుళ్లు

శ్రీకాళహస్తి : పేదల సొంతింటి కల నెరవేరుస్తామని హామీలు గుప్పించిన వైకాపా ప్రభుత్వం ఆశలు పెట్టుకున్న పేదలను పక్కాగా మోసం చేసింది. ఇల్లు కట్టుకునే స్తోమత లేని పేదలకు నిర్మించిన ఇళ్లు ఇటీవల కురిసిన తేలికపాటి వర్షాలకే పగుళ్లు రావడం, గోడలకు వేసిన సిమెంటు రాలి పోవడంతో ఎప్పుడు పడిపోతాయో తెలియని పరిస్థితి. జగనన్న కాలనీల పేరుతో ఇళ్ల నిర్మాణాలు సాగిస్తోంది. శ్రీకాళహస్తి పట్టణానికి సమీపంలోని ఊరందూరులో శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలోని శ్రీకాళహస్తి పట్టణం, గ్రామీణం, తిరుపతి, ఏర్పేడు ప్రాంత పేదలకు ఇక్కడ పట్టాలిచ్చి ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. అన్నీ జగనన్న లేఔట్లల్లోకి దీనికి ఓ ప్రత్యేకత ఉంది. ఇది గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. 4500 పక్కా ఇళ్లు నిర్మించేందుకు వీలుగా పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా.. గృహ ప్రవేశానికి వీలుగా సిద్ధమైనవి కేవలం పదిలోపు గృహాలుండటం గమనార్హం.ఆవేదన మిగిల్చిన గృహాలు

పక్కా ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఇళ్లు కట్టుకోలేని లబ్ధిదారులకు ప్రభుత్వం గుత్తేదారులతో నిర్మించి ఇవ్వాలని సంకల్పించింది. బిల్లుల



చెల్లింపు సక్రమంగా చేయకపోవడం, ఎక్కువగా బకాయిలు పెట్టడంతో గుత్తేదారులు కట్టామంటే కట్టామన్న రీతిలో పూర్తి చేశారు. సిమెంటుకు బదులుగా ఇసుక మాత్రమే గోడలకు అతుక్కుని ఉండటంతో లబ్ధిదారులు ఇళ్లలో ఉండేందుకు భయాందోళన చెందుతున్నారు. ప్రత్యేక బృందాలు పరిశీలించినా ఈ లోటుపాట్లు గుర్తించకపోవడం గమనార్హం. నాణ్యత లేని కట్టడాల్లో ఏ విధంగా గృహప్రవేశాలు చేస్తామంటూ లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎలాంటి ఫిర్యాదులు అందలేదు

గృహాల నిర్మాణంపై తాజాగా ప్రత్యేక బృందాలు పరిశీలించాయి. పక్కాగృహాలకు పగుళ్లు రావడంపై మాకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. లబ్ధిదారులు ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదు. అలాంటి సమస్యలను మా దృష్టికి తెస్తే సంబంధిత గుత్తేదారులతో వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటాం.– శేషగిరిరావు, డీఈ, గృహనిర్మాణ సంస్థ

# ఏడాదికో అంతస్తేనా!

తిరుపతి : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ(తుడా) ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 14 అంతస్తుల తుడా టవర్స్ నిర్మాణం అయోమయంలో పడింది. తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులోని అన్నమయ్య కూడలిని ఆనుకుని ఉన్న 3.61 ఎకరాల తుడా స్థలంలో రూ.275 కోట్ల అంచనాలతో నిర్మిస్తున్న వాణిజ్య, గృహావసరాల భవన నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి.

2023 జులైలో ప్రారంభమైన పనులు మందకొడిగా సాగుతూ ఇప్పటికీ పునాదుల దశ దాటి.. మొదటి అంతస్తు పనులు మాత్రమే పూర్తయ్యాయి. తుడా సాధారణ నిధుల నుంచి రూ.41 కోట్లు బిల్లులు మాత్రమే చెల్లించారు. తుడాలో నిధులు ఖాళీ కావడంతో గుత్తేదారు సంస్థకు చెల్లించాల్సిన బిల్లులు ఆలస్యం అవుతుండడంతో ఎన్నికల తరువాత పనులు పూర్తిగా మందగించాయి. తుడాలో విచ్చలవిడిగా నిధులు దుర్వినియోగం జరుగుతోందని, టవర్స్ నిర్మాణంపై అనుమానాలు వ్యక్తం కావడంతో కొనుగోలుదారులు వెనుకంజ వేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో తుడాపై సన్నగిల్లిన నమ్మకాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిలబెట్టి తుడా టవర్స్ నిర్మాణం పూర్తి చేయగలిగితే తుడాకు రూ.150 కోట్ల వరకు ఆదాయం లభించే అవకాశం ఉంది.

ఖాతాలో మిగిలింది రూ.7 కోట్లే

రాష్ట్రంలోనే పట్టణాభివృద్ధి సంస్థల్లో తుడా ఆదాయార్జనలో ముందుందని, ఏటా జీతాలే రూ.15 కోట్లు చెల్లిస్తున్న ఏకైక పట్టణాభివృద్ధి సంస్థని ఇటీవల మంత్రి నారాయణ పేర్కొన్నారు. తుడా ప్లాట్ల అమ్మకాల ద్వారా సుమారు రూ.500 కోట్ల వరకు ఆర్జించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇంతటి ఆదాయం కలిగిన తుడా చేపట్టిన తుడా టవర్స్ నిర్మాణానికి నిధులు లేక అవస్థలు పడుతోంది. ప్రస్తుతం తుడా ఖాతాలో రూ.7 కోట్ల నిధులు మాత్రమే మిగలడంతో అవి సాధారణ ఖర్చుల కోసం నిల్వ చేసుకున్నారు. టవర్స్ నిర్మాణం పూర్తి కావాలంటే మరో రూ.200 కోట్లు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. ఈ



నిధులు సమకూర్చడం ఇప్పట్లో సాధ్యం అయ్యే పనికాదని భావిస్తున్నారు. ఓ ప్రైవేటు బ్యాంకు నుంచి తుడా ఆస్తుల తనఖా ద్వారా రూ.50 కోట్ల రుణం తీసుకుని గుత్తేదారుకు చెల్లించి పనులు వేగవంతం చేయాలని అధికారులు ప్రయత్నించినప్పటికీ అది ఫలించిలేదని తెలిసింది.

ధరలు చూసి బెదురుతున్న వినియోగదారులు

తుడా టవర్స్‌లోని ప్లాట్లు, వాణిజ్య, కార్యాలయ సముదాయాలకు చదరపు అడుగుకు నిర్ణయించిన ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని వినియోగదారులు అంటున్నారు. ప్లాట్లు, వాణిజ్య దుకాణాలు ముందస్తుగా విక్రయించాలని ఈ–వేలం ద్వారా ప్రయత్నించినా కేవలం 11 మంది మాత్రమే ప్లాట్లు కొనుగోలుకు అడ్వాన్సులు చెల్లించారు. రెండు పడక గదుల ప్లాట్ కొనుగోలుకు రూ.72 లక్షలు, మూడు పడక గదులకు రూ.1.20 కోట్లు, నాలుగు పడక గదులను రూ.2.20 కోట్లకు విక్రయించేలా ధరలు నిర్ణయించారు. వాణిజ్య సముదాయంలో చదరపు అడుగు ధర రూ.12 వేలు వరకు ఉంది. వీటిని పరిశీలించిన వినియోగదారులు తుడా టవర్స్ కొనుగోలుకు ఆసక్తి కనబరచలేదు.

# మెప్మాలో ఏం జరుగుతోందది?

తిరుపతి: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో ఏం జరుగుతుందనేది అంతుపట్టని విషయంగా మారింది. గడిచిన ఐదేళ్ల పాలనలో ఇక్కడి అధికారులు ఆడిందే ఆట పాడిందే పాటలా వ్యవహరించారు. ఏడాదికోసారి నిర్వహించే సామాజిక తనిఖీల్లో పారదర్శకతకు పాతరేసి కనీసం రికార్డులు చూడకుండానే తనిఖీలు మమ అనిపించారనే ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వాటిలో జరిగిన బాగోతాలు వెలుగు చూస్తున్నాయి. ఐదేళ్లలో జరిగిన అవినీతిపై తనిఖీలు నిర్వహించాలని ఇటీవల పలువురు బాధితులు కలెక్టర్‌ను కలిసి విన్నవించడంతో అక్రమార్కుల్లో కలవరం మొదలైంది. తిరుపతిలో అభ్యుదయ, స్పందన, సరస్వతి, పద్మావతి అనే నాలుగు పట్టణ సమాఖ్యలు (టీఎల్ఎఫ్) ఉన్నాయి. వీటి పరిధిలో 5,147 సంఘాలు, 51,470 మంది సభ్యులు ఉన్నారు. పట్టణ సమాఖ్య పరిధిలోనే 160 స్లమ్ సమాఖ్య (ఎస్ఎల్ఎఫ్)లు





ఉన్నాయి. సేవా రుసుం కింద గతంలో రూ. 25,000 పట్టణ సమాఖ్యల నుంచి జమచేశారు. వాటిని తిరిగి ఇవ్వాల్సి ఉండగా అధికారులు మొండిచేయి చూపారు. అభ్యుదయ సమాఖ్యకు మాత్రమే ఇచ్చి మిగిలిన సమాఖ్యలను విస్మరించినట్లు ఆరోపణలున్నాయి. సంఘాలు విభజించినప్పుడు అప్పులు, పొదుపు సమానంగా పంచకుండా మోసగించినట్లు సమాచారం.

రైతుల నుంచి నేరుగా పంటలు, కూరగాయలు కొని తక్కువ ధరకు విక్రయించడం కోసం జగనన్న మహిళా మార్ట్‌ను ప్రారంభిస్తున్నట్లు గొప్పలు చెప్పారు. ప్రతి సభ్యురాలి నుంచి రూ. 150 చొప్పున పెట్టుబడి వసూలు చేశారు. వచ్చిన ఆదాయం సమాఖ్యలకు చెందుతుందని చెప్పారు. చివరకు సరకులు ప్రైవేటు మాళ్లలో కొనుగోలు చేసి ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్ముతున్నారు. వినియోగదారులు తగ్గడంతో ఆర్పీలకు కర్రపెత్తనం అప్పగించారు. నెలకు రూ. 50వేల వరకు లక్ష్యం విధించారు. అమ్మకాలు చేయకపోయినా, సభ్యులు సరకులు కొనకపోయినా రుణాలు ఇవ్వమని హెచ్చరించారు. ఇప్పటివరకు మార్ట్‌లో వచ్చిన ఆదాయం లెక్కలు తేల్చకపోవడం గమనార్హం. మెప్మా పీడీ రాధమ్మ స్పందిస్తూ ఆడిట్ జరుగుతోందని, అక్రమాలపై త్వరలో చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.


**ఐదేళ్ల నుంచే అవకతవకలు**

2014 నుంచి 2019 వరకు ఏటా సామాజిక తనిఖీలు పగడ్బందీగా జరిగాయి. లెక్కల్లో తేడాలుంటే అధికారులు చర్యలు తీసుకునేవారు. వైకాపా ప్రభుత్వం రాకతో వ్యవస్థ గాడితప్పింది. అధికార పార్టీ ప్రాబల్యం ఉన్నవారితో అధికారులు కుమ్మక్కయిపోయారు. ఉన్నతాధికారులు మొదలు క్షేత్రస్థాయి సిబ్బంది వరకు ఆరోపణలు ఎదుర్కొంటున్నవారే. ఏటా మార్చి లేదా ఏప్రిల్‌లో ఆడిట్ పూర్తిచేయాల్సి ఉండగా వైకాపా పాలనలో పారదర్శకంగా జరగలేదనే వాదనలున్నాయి. ఆడిట్ పేరుచెప్పి పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడినట్లు సమాచారం. మెప్మాలో జరుతున్న అవినీతిని వెలికితీయాలన్న డిమాండ్ల నేపథ్యంలో ఇటీవల ఆడిట్‌పై అడుగులు పడుతుండగా రికార్డులు అందుబాటులో లేకపోవడంపై విస్మయం వ్యక్తమవుతోంది. రికార్డులు మాయం చేసిందెవరు.. ఇన్నిరోజులు సామాజిక తనిఖీలు ఎలా నిర్వహించారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే ఆడిట్ కమిటీ ఓ సమాఖ్యలోని రూ. 22 లక్షల సొమ్ము పక్కదారి పట్టిందని గుర్తించినట్లు సమాచారం. ఉన్నతాధికారులు మరింత కఠినంగా వ్యవహరిస్తే మిగతా సమాఖ్యల్లోనూ భారీ అక్రమాలు బయటికి వచ్చే అవకాశం ఉందని, అప్పుడే సగటు సభ్యులకు న్యాయం జరుగుతుందన్న అభిప్రాయం లేకపోలేదు.

# గుత్తేదారులు

ఏర్పేడు : ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టి అందరికీ ఉచిత ఇసుక అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తవ్వకాలు, తరలింపులో నాయకులు, కార్యకర్తల జోక్యం ఉండకూడదనే ఆదేశాలు సైతం జారీ చేసింది. కానీ గత ప్రభుత్వ నాయకులు ఆ మాటలను తుంగలో తొక్కి.. మనల్ని ఎవడ్రా ఆపేది అంటూ యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. ఏర్పేడు మండలంలోని మోదుగులపాళెం రీచ్‌లో గత వైకాపా ప్రభుత్వంలో గుత్తేదారుగా ఉన్న ఓ నేత ఇసుక తవ్వుకునేందుకు వీలుగా స్వర్ణముఖి నదిలో ఏకంగా రోడ్డునే ఏర్పాటు చేసుకుని రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుకను రాష్ట్రాలు దాటిస్తున్నారు.

**కలిసికట్టుగా పోరాడి..**గత వైకాపా ప్రభుత్వంలో ఇదే ప్రాంతంలో పెద్దల



పేరుతో పరిమితికి మించి తవ్వకాలు జరిపారు. భూగర్భజలాలు అడుగంటిపోవడంతో వ్యవసాయ భూములు బీడుగా మారుతున్నాయని అప్పట్లో రైతులు కలిసికట్టుగా పోరాడి అడ్డుకున్నారు. కొన్ని రోజులు తవ్వకాలు నిలిపినా.. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ అనధికారికం గా తవ్వకాలు చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని రైతులు కోరుతున్నారు. మండలంలో జరుగుతున్న అక్రమ తవ్వకాలపై కూటమి నేతలు రాష్ట్ర కార్యాలయా లకు సైతం ఫిర్యాదు చేశారు. **అనుమతులు లేవు**ఏర్పేడు మండలంలో ఇసుక తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవు. మోదుగులపాళెంలో అనధికారికంగా ఇసుక తవ్వుతున్నట్లు సమాచారం రావడంతో అధికారులను పంపి నిలిపివేశాం. దీనిపై ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదు చేశాం. శ్రావణ్, ఉప తహసీల్దార్, ఏర్పేడు

# కౌలు రైతులకు.. దక్కని ఊరట



ధర్మవరం : గత వైకాపా ప్రభుత్వ హయాంలో కౌలు రైతులకు ప్రయోజనం ఒనగూరిందిలేదు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో కౌలు రైతులకు ఏటా గుర్తింపు కార్డులు మంజూరు చేసి బ్యాంకుల్లో రుణాలు అందజేసి, రాయితీ పథకాలు వర్తింపజేసి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఆత్మహత్యలు చేసుకున్న కౌలు రైతుల కుటుంబాలను ఆదుకుంటామని, నష్టపరిహారం ఇస్తామని వాగ్దానం చేశారు. అయితే గడచిన ఐదేళ్ల వైకాపా పాలనలో వారి సంక్షేమం కోసం చేసింది ఏదీ లేదు. పైగా కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారు. కొందరికి మాత్రమే సాగుదారు హక్కు పత్రాలు అందించి.. చేతులు దులుపుకొన్నారు. ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణాలు ఇప్పివ్వలేదు. దీంతో కౌలు రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారు. రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావడం.. ప్రస్తుతం సాగురైతులను గుర్తిస్తుండటం.. హక్కు పత్రాలు ఇవ్వనుండటంతో వారి ఆశలు రేకెత్తాయి.

**అత్యధికం వైకాపా సానుభూతి పరులే..**

ఐదేళ్లు కౌలు రైతులకు బ్యాంకు నుంచి పంట రుణాలు అందక బయట అప్పు పుట్టక ఆందోళన చెందారు. రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పిన మాజీ ముఖ్యమంత్రి జగన్ వారి సంక్షేమంపై పూర్తిగా నిర్లక్ష్యం వహించారు. శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా కౌలు రైతులకు ఏ విధమైన సహాయం అందలేదు. ఏటా ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో గ్రామ సభలు ఏర్పాటు చేసి కౌలు రైతులను గుర్తించాల్సి ఉంది. కానీ గత ఐదేళ్ల కాలంలో గ్రామ సభలు ఎక్కడా జరగలేదు. రైతు భరోసా కేంద్రాల్లో మొక్కుబడిగా సమావేశాలు నిర్వహించి కౌలు రైతులను ఎంపిక చేశారు. 2020-21, 2021-22లో జిల్లా వ్యాప్తంగా కౌలు రైతుల సంఖ్య 1000 లోపే. 2022-23లో జిల్లా వ్యాప్తంగా 1205 మందికే కౌలు రైతు హక్కు పత్రాలు మంజూరు చేశారు. వాటిలో కూడా వైకాపా సానుభూతి పరులే ఉండటం గమనార్హం. వ్యవసాయ శాఖ నుంచి రాయితీతో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, బ్యాంకు రుణాలు అందలేదు. రాయితీ ధరలకు వ్యవసాయ పరికరాలు పొందలేదు.

**రుణాల మంజూరుకు ముందుకురాని బ్యాంకర్లు**

గుర్తింపు పొందిన కౌలు రైతులకు ఆయా బ్యాంకుల ద్వారా రుణాలు అందజేస్తామని వైకాపా ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ ఐదేళ్లలో ఏ ఒక్క కౌలు రైతుకు ఒక్క రుపాయి రుణం మంజూరు చేయించిందిలేదు. కౌలు రైతులు బ్యాంకుల చుట్టూ కాళ్లు అరిగేలా ప్రదక్షిణ చేసినా అధికారులు స్పందించలేదు. విపత్తుల వల్ల పంట నష్టపోయిన వారికి బీమా పరిహారం అందలేదు.

**శాపంలా మారిన చట్టం**

2023లో జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో కౌలు రైతుల చట్టం ప్రవేశపెట్టారు.అది కౌలుసాగుదారులకు శాపంలా మారింది. ఆ చట్టంతో రాష్ట్ర వ్యాప్తంగా కౌలు రైతుల సంఖ్య 8 లక్షల నుంచి 3 లక్షలకు పడిపోయింది. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద దుమారమే చెలరేగింది. అయినా ఆ చట్టాన్ని ఉపసంహరించుకోలేదు. ప్రతిపక్షాలు ఆందోళనలు చేసినా వైకాపా ప్రభుత్వం స్పందించలేదు. రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం కౌలు రైతులకు గుర్తించి అన్ని విధాలా ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

**పంట నష్టపోయినా ఆదుకోలేదు**

– ఓబులేశు, కొడవాండ్లపల్లి, ముదిగుబ్బ

రెండేళ్లుగా భూమి కౌలుకు తీసుకుని అరటి పంట సాగు చేస్తున్నా. కౌలు రైతుగా నమోదు చేసుకున్నాను. కానీ ఇంత వరకూ ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆర్థిక ప్రయోజనం పొందలేదు. గత ఏడాది వర్షాలు కురవక పంట దిగుబడి తగ్గి పెట్టుబడులు రాలేదు. ఆదుకోవాలని అధికారులను కోరినా స్పందించలేదు.

**కొత్త ప్రభుత్వం చర్యలు చేపట్టింది**

– సుబ్బారావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి

కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం వారం రోజుల కిందట బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో సమావేశమైంది. ఈ సమావేశంలో కౌలు రైతుల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేసింది. ఈ ఏడాది కౌలు రైతులను ఎంపిక చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఆ ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. ఎంపికైన వారికి రుణాలు మంజూరు చేసి, రాయితీ పరికరాలు అందేలా చూస్తాం.

# అంటకాగి వంతపాడి



తిరుపతి : వచ్చేది వైకాపా పాలనే.. అంతా మా ఇష్టం అంటూ అడ్డదిడ్డంగా వ్యవహరించారు. ఒంటిపై ఖాకీ దుస్తులు ఉన్నాయనే సంగతి మరిచి వైకాపా సేవలో తరించారు. తీరా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అడ్డంగా దొరికిపోయారు. ఇన్నేళ్లూ శాంతిభద్రతల పేరుతో మూటగట్టుకొన్నవారు కొందరైతే.. వైకాపా నేతల అడుగులకు మడుగులొత్తి తెదేపా నాయకులు, సామాన్య ప్రజలపై అక్రమ కేసులు పెట్టిన అధికారులను రాష్ట్ర ప్రభుత్వం పక్కనబెట్టింది. వీరికి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేస్తూ డీజీపీ ద్వారక తిరుమలరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పరిధిలోని గూడూరు, చంద్రగిరి, నాయుడుపేట, శ్రీకాళహస్తీ డీఎస్పీలకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకపోవడం గమనార్హం.

**నిర్లక్ష్యంగా వ్యవహరించిన శరత్‌రాజ్‌కుమార్..**

ఎన్నికల విధుల్లో భాగంగా చంద్రగిరికి వచ్చిన శరత్‌కుమార్ ఎన్నికల సమయంలో బాధ్యతా రహితంగా వ్యవహరించారు. తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని స్ట్రాంగ్ రూముల వద్దకు ఎన్నికల నియమావళికి విరుద్ధంగా తన సన్నిహితుడిని తీసుకెళ్లారు. పోలింగ్ రోజు రామిరెడ్డిపల్లె, కూచివారిపల్లిల్లో వైకాపా మూకలు విచ్చలవిడిగా కర్రలతో వీరంగం సృష్టించినా అడ్డుకోవడంలో విఫలమయ్యారు. నాడు వైకాపాకు అనుకూలంగా వ్యవహరించారు. ఆరోజు చర్యలు తీసుకొని ఉంటే మరుసటి రోజున పులివర్తి నానిపై దాడి జరిగేది కాదు. పరోక్షంగా నానిపై జరిగిన హత్యాయత్నానికి కారణం ఆయనే అన్న ఆరోపణలు లేకపోలేదు. ఎన్నికల సమయంలోనూ విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించి మూల్యం చెల్లించుకున్నారు.

**అక్రమాల్లో దిట్ట.. సూర్యనారాయణరెడ్డి**

గూడూరు డీఎస్పీగా 2022లో బాధ్యతలు చేపట్టిన సూర్యనారాయణరెడ్డి ఒకే సామాజిక వర్గానికి వత్తాసు పలుకుతూ వచ్చారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డితో సన్నిహితంగా ఉన్నారు. ఒకానొక సందర్భంలో తెదేపా అధికారంలోకి వస్తే తన పోలీసు ఉద్యోగానికి రాజీనామా చేస్తానని సహచరులతో అన్న మాటలు వివాదాస్పదమయ్యాయి. ఏడాది కిందట చంద్రబాబుపై పుంగనూరులో జరిగిన దాడిని ఖండిస్తూ వెంకటగిరిలో తెదేపా శ్రేణులు నిరసన చేపట్టగా వైకాపా నాయకులపై దాడిచేశారనే కారణం చూపి ఇప్పుడున్న వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతోపాటు 20 మంది తెదేపా కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టారు. వెంకటగిరిలో స్థానికులంతా కలిసి రామమందిర నిర్మాణం చేపడితే, అంత స్థలమెందుకని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో అడ్డుకున్నారు. వెంకటగిరి తెదేపా నేత బీరం రాజేశ్వరరావుపై అక్రమ కేసు పెట్టి చెన్నైలో రాత్రికిరాత్రే అరెస్టు చేశారు. ఎన్నికల సమయంలో పాశిం సునీల్ కుమార్ ప్రచారానికి ఆటంకాలు కలిగించారు. సిలికా అక్రమ తవ్వకాల్లో గత వైకాపా నేతలతో కలిసి అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు అధికంగా ఉన్నాయి.

**ఎన్నికల విధుల్లో వరకు..**

ఎన్నికల సమయంలో నాయుడుపేట డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరెడ్డి ఎన్నికల విధులు సవ్యంగానే నిర్వహించారు. చిత్తూరులో వైకాపాతో అంటకాగి విమర్శల పాలయ్యారు. చిల్లకూరు మండలంలో వైకాపాకు చెందిన ఇరువర్గాలు వాగ్వాదానికి దిగితే వారిపై కేసులు పెట్టారు.

ఇటీవలే తిరుపతి డీఎస్పీగా వచ్చిన రవి మనోహరాచారిని సీఐడీకి బదిలీ చేశారు. ఎన్నికల అనంతరం మహిళా వర్సిటీలో పులివర్తి నానిపై జరిగిన ఘర్షణల నేపథ్యంలో సిట్ అధికారిగా ఇక్కడికి వచ్చారు. అప్పటి ఘటనలపై విచారణ చేపట్టి లోటుపాట్లపై నివేదికను ఈసీకి సమర్పించారు. అనంతరం ఇక్కడే డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో దస్త్రాల దహనం కేసును ప్రభుత్వం సీఐడీకి ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఆయన్ను ఆ బృందంలో నియమించే ఆస్కారం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**తెదేపా శ్రేణులను ఇబ్బంది పెట్టిన ఉమామహేశ్వరరెడ్డి**

ఫిబ్రవరి 14న కర్నూలు నుంచి బదిలీపై శ్రీకాళహస్తికి వచ్చిన బి.ఉమామహేశ్వర రెడ్డి ఎన్నికల సమయంలో వైకాపాకు వంతపాడారు. ఎన్నికల ప్రచారంలో ఆ పార్టీ నాయకుల పక్షాన నిలిచి నిబంధనలు పాటించకున్నా చూసీచూడనట్లు వదిలేశారు. తెదేపా నాయకులు ప్రచారం చేసే సమయంలో ఇబ్బందులకు గురిచేశారు. నిత్యం వివిధ కారణాలతో తెదేపా నాయకులను ఇబ్బందిపెట్టారు. వైకాపా అధికారంలోకి వస్తే అక్కడే ఉండేందుకు అప్పటి ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డితో మంతనాలు జరిపారు.

# సొంతింటి కల తీరేలా

చిత్తూరు : సొంతిల్లు లేని నిరుపేదలకు రాష్ట్రంలో నూతనంగా కొలువుదీరిన ప్రభుత్వం శుభవార్త చెప్పింది. గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలం కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ నిర్వహించిన సమీక్షలో సీఎం చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో జిల్లాలో సుమారు 10 వేల మందికి పేదలు లబ్ధి పొందే అవకాశం ఉన్నట్లు అంచనా.గత వైకాపా ప్రభుత్వ హయాంలో సొంతింటి కోసం నిరుపేదలు ఎంతగానో తపించారు. కానీ మొదట దశలో 73 వేల మందికి గృహాలు మంజూరు చేశారు. కొండలు, గుట్ట ప్రాంతాల్లో లేఔట్లు వేసి.. పల్లెల్లో ఒకటిన్నర సెంటు, పట్టణాల్లో ఒక సెంటు స్థలాన్ని ఇచ్చారు. ఇంటి నిర్మాణానికి రూ. 1.80 లక్షలు మంజూరు చేశారు. చాలా లేఔట్లు అనుకూలంగా లేకపోవడం, ధరలు పెరగడంతో చాలామంది గృహ నిర్మాణాలు చేపట్టలేకపోయారు. కొందరు పనులు మొదలు పెట్టి మధ్యలోనే వదిలేశారు. దీంతో సొంతంగా స్థలం ఉండి.. నిర్మాణం చేయాలనుకునే వారికి గృహాలు మంజూరు చేశారు. నూతన ప్రభుత్వం ఇంటి యూనిట్ నిర్మాణ వ్యయాన్ని రూ. 4 లక్షలకు పెంచడం పేదలకు కలిసొచ్చే అంశం.

దీంతో ఈ పథకం కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు పేదలు.మొదలుపెట్టని ఇళ్లు 3 వేలకుపైనే..

జిల్లాలో 73 వేల గృహాలు మంజూరవగా లేఅవుట్లలో నిర్మిస్తున్న ఇళ్లు 24,756 వరకూ ఉన్నాయి. మిగిలిన ఇళ్లను సొంత స్థలాలున్న లబ్ధిదారుల పేరిట మంజూరు చేయించారు. లేఅవుట్లలో మంజూరైన ఇళ్లలో పూర్తయినవి 9 వేల ఇళ్లే. ఇంకా 3,800 గృహాల పనులు అసలు మొదలుకాలేదు. గత ప్రభుత్వంలో మంజూరై ఇంటి నిర్మాణం మొదలుపెట్టని వారికి యూనిట్‌కు రూ. 4 లక్షలు వర్తింపజేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఇది గనుక ఆచరణలోకి వస్తే చాలామందికి ప్రయోజనం చేకూరినట్లవుతుంది.

# కుప్పం.. ఇక పారిశ్రామిక ఖిల్లా!

చిత్తూరు: రాష్ట్రంలోనే చిట్టచివర ఉన్న కుప్పం నియోజకవర్గం నుంచి వలసలు అధికంగా ఉన్నాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం పొట్ట చేతపట్టుకుని పొరుగునే ఉన్న బెంగళూ రుకు వేలాది మంది పయనమవుతున్నారు. ఈ పరిస్థితిలో మార్పు తేవాలని ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యే చంద్రబాబు కంకణం కట్టుకు న్నారు. 2014- 19 మధ్య కాలంలో దాదాపు రూ. 3వేల కోట్ల పెట్టుబ డులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చారు. అనంతరం వైకాపా అధికారంలోకి రావడంతో ఈ ప్రతిపాదనలన్నీ మూలకు చేరాయి. కనీసం భూమి తీసుకునేందుకు ఎవరూ ఆసక్తి చూపలేదు. తాజాగా కూటమి పార్టీలు విజయం సాధించి.. చంద్రబాబు మరోసారి సీఎం కావడంతో కుప్పానికి మహర్దశ పట్టింది. ఈ ప్రాంతాన్ని పారిశ్రామిక ఖిల్లాగా మార్చేందుకు కసరత్తు చేయాలని పరిశ్రమల శాఖపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగానే కుప్పంలో పారిశ్రామిక క్లస్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత



తొలిసారి జూన్ 25, 26వ తేదీల్లో చంద్రబాబు కుప్పానికి వచ్చారు. నియోజకవర్గ అభివృద్ధిపై రెండో రోజు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలు స్థాపించి వేలాది మంది నిరుద్యోగ యువత, మహిళలకు ఉపాధి కల్పించాలన్నది తన లక్ష్యమని ఆయన వివరించారు. ప్రభుత్వ పరంగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. ఈక్రమంలోనే కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ శ్రీనివాసులు తరచూ నాలుగు మండలాల పరిధిలో పర్యటిస్తూ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూమి ఎక్కడ ఉంది? అక్కడ ఉన్న అనుకూలతలేంటి? అనే అంశాలపై చర్చిస్తున్నారు.

**20 వేలు- 30వేల మందికి ఉపాధి**

భూసేకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత పరిశ్రమల స్థాపనకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఇప్పటికే ఏపీఐఐసీ అధికారులకు తెలిపారు. గతంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన సంస్థలను మరోసారి ఆహ్వానించాలని అనుకుంటున్నారు. మరికొందరితోనూ చర్చలు జరిపి ఇక్కడ ఉన్న అనుకూలతల గురించి వివరించనున్నారు. మొత్తంగా 20వేలు- 30వేల మందికి ఉపాధి కల్పించాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్ష. ఇందులో భాగంగానే తొలుత పారిశ్రామిక క్లస్టర్‌కు అడుగులు పడ్డాయి.

**జనవరి నాటికి భూముల అంశం కొలిక్కి!**

కుప్పం పారిశ్రామిక క్లస్టర్ ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయంపై అధికార యంత్రాంగం సమాలోచనలు జరుపుతోంది. రామకుప్పం, శాంతిపురం, కుప్పం మండలాల పరిధిలో ప్రభుత్వ భూములు ఎక్కడ ఎక్కువగా ఉన్నాయా? అని రెవెన్యూ శాఖ ఆరా తీస్తోంది. కనీసం 2వేల ఎకరాలు సేకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు.. కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ ప్రక్రియను జనవరి నాటికి పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఎక్కడైనా కొంత పట్టా భూములు తీసుకుంటే త్వరగా పరిహారం చెల్లించేందుకు కూడా సిద్ధమవుతున్నారు.

# తల్లిపాల ప్రయోజనం.. ప్రచారానికే పరిమితం

అనంతపురం : నవజాత శిశువులకు తల్లి పాలే శ్రేష్ఠం.. మధురం. బిడ్డ జన్మించిన గంటలోపే తల్లి ముర్రుపాలు పట్టించడం అత్యంత కీలకం. ఇవే బిడ్డకు ఔషధం. కనీసం ఆరుమాసాల దాకా బిడ్డలకు సమృద్ధిగా తాపించాలి. లేదంటే.. అనేక అనారోగ్య సమస్యలు వేధిస్తాయి. శిశువులకే కాదు.. తల్లులు సైతం పలు రకాల జబ్బుల బారినపడే ప్రమాదం ఎక్కువ. 'అమ్మ' పాల ప్రాముఖ్యత.. ప్రయోజనం పై కేవలం ప్రచార పోస్టర్ల ఆవిష్కరణ.. ప్రకటనలకే పరిమితం అవుతోంది. గట్టిగా చెప్పాలంటే.. వారోత్సవాల నిర్వహణకే ఫుల్‌స్టాఫ్ పెడుతున్నారు. ఆరు మాసాలుగా దాకా విధిగా తల్లిపాలే ఇవ్వాలన్న కనీస అవగాహనను ప్రతి 'అమ్మ'కు చెప్పడంలో ఐసీడీఎస్, ఆరోగ్యశాఖలు వైఫల్యం చెందుతున్నాయి. వీరి నిర్వాకం, నిర్లక్ష్యం మూలంగా డయేరియా, నిమోనియా వంటి ప్రమాదకర జబ్బులతో ఏటా వేలాదిమంది శిశువుల ఆదిలోనే తనువు చాలిస్తున్నారు. కనీస అవగాహన లేని తల్లులు రొమ్ము, అండాశయ క్యాన్సర్లు, మధుమేహం వంటి రుగ్మతలు బారినపడుతున్నారు. తల్లిపాలు తాపించకపోతే తల్లీబిడ్డలిద్దరికీ అనర్థమేనన్న నగ్న సత్యాన్ని విడమరిచి చెప్పలేకపోతున్నారు. కేవలం వారోత్సవాల నిర్వహణతో సరిపెడుతున్నారు. ఏటా మాదిరే ఈదఫా కూడా ఈనెల 1-7 తేదీ దాకా ప్రపంచ తల్లిపాల వారోత్సవ నిర్వహణకు ఐసీడీఎస్ శాఖ సమాయత్తమైంది.

**52 శాతం మించడం లేదు..**

ఉమ్మడి అనంత జిల్లాలో ఏటా గర్భం దాల్చే మహిళలు 80 వేలు, బిడ్డలకు జన్మనించే మాతృమూర్తులు మరొక 85 వేలదాకా ఉంటారని ఆరోగ్యశాఖ అంచనా. ఈ లెక్కన అనంత, శ్రీసత్యసాయి జిల్లాలో 1.65 లక్షల మంది తల్లులు ఉంటారు. వీరిలో దారిద్ర్యరేఖకు దిగువ (బీపీఎల్) ఉండే తల్లులు 33 శాతం ఉంటారు. ఈ లెక్కన వేసుకున్నా... రెండు జిల్లాలోని 5,126 అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు 25,746, తల్లులు 19,307 మంది ప్రకారం పేర్లు నమోదు చేసుకున్నారు. ఏపీఎల్ కుటుంబాల్లోని తల్లులకే కాదు.. బీపీఎల్ కుటుంబాల్లోని మృతమూర్తులకు కూడా తల్లిపాల ప్రాముఖ్యత గురించి తగిన అవగాహన కొరవడుతోంది. బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రపాలు తాపిస్తున్న వారి సంఖ్య ఉమ్మడి జిల్లాలో సగటున 52 శాతానికి మించడం లేదు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వృద్ధి చెందిన నేటి కాలంలోనూ ఇప్పటికీ ఐదు శాతం దాకా గృహ ప్రసవాలు నమోదు కావడం దురదృష్టకరం. తల్లీబిడ్డ మరణాలకు ఈ తరహా ప్రసవాలు ప్రమాదకరంగా మారుతున్నాయి.

**ఉత్సవ విగ్రహాలుగా 'అమ్మ' గదులు**

తల్లులు ప్రయాణ సమయాల్లో, కార్యాలయాల్లో పని నిమిత్తం వెళ్లేవారికి ప్రత్యేకంగా 'అమ్మ' గదులను ఏర్పాటు చేశారు. అనంత కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో 'అనంత మమతా నిలయం' పేరుతో ప్రత్యేక వసతిని నెలకొల్పారు. ప్రతి సోమవారం అర్జీలు ఇవ్వడానికి వచ్చే చంటిబిడ్డల తల్లుల కోసం ఈ గదిని ఏర్పాటు చేశారు. ఇక్కడ వసతులున్నాయి. ఇదే క్రమంలో అనంత ఆర్టీసీ బస్టాండులోనూ తల్లులు బిడ్డలకు పాలిచ్చే గది నెలకొల్పారు. కానీ.. ఇది ఉత్సవ విగ్రహంలా మారింది. దీనిపై తగిన ప్రచారం కల్పించలేదు. సరికదా.. లోపల పారిశుద్ధ్య సామగ్రి నిల్వ ఉంచారు.

# ఐఐటీ.. కొలువుల్లో మేటి

తిరుపతి : తిరుగిరులను ఆనుకోని ఉన్న తిరుపతి భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థ(ఐఐటీ) ప్రయోగాలకు నిలయంగా విరాజిల్లుతోంది. 2015లో అద్దె భవనంలో ప్రారంభమైన తిరుపతి ఐఐటీ ఇటీవలే 6వ స్నాతకోత్సవం పూర్తి చేసుకుంది. అధునాతన సాంకేతికత, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేస్తున్నారు. 12 వేల మంది విద్యార్థులతో నిత్యం పరిశోధనలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు 203 ప్రాయోజిత ప్రాజెక్టులతోపాటు పారిశ్రామిక ఒప్పందాలు చేసుకున్నారు. వివిధ అంశాలపై 177 పరిశోధన ప్రాజెక్టులు, 185 పరిశ్రమలతో పాటు అంతర్జాతీయ విద్యాసంస్థలు, ప్రయోగశాలతో 50 ఒప్పందాలు చేసుకోవడంతో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో 59వ స్థానంలో నిలిచింది. గతేడాది 200 మంది విద్యార్థులు ప్రాంగణ నియామకాల్లో ఉద్యోగాలు సాధించారు.

**రూ.14 లక్షల ప్యాకేజీతో..**

మాది తెనాలి. అమ్మానాన్నలిద్దరూ వ్యవసాయం చేస్తారు. చిన్నప్పటి నుంచి ఐఐటీలో చదవాలనే కోరిక బలంగా ఉండేది. తిరుపతి ఐఐటీలో చేరి ఎలక్ట్రికల్ బ్రాంచ్ తీసుకున్నాను. 2023 ప్రాంగణ నియామకాల్లో ఉద్యోగం సాధించాను. హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ కంపెనీ నాకు ఏడాదికి రూ.14 లక్షల వేతనం ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. ప్రస్తుతం అందులోనే ఉద్యోగం చేస్తున్నాను.

**పరిశోధనలకు అనువైన వాతావరణం**

మాది ఉత్తరప్రదేశ్. నాన్న విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి, అమ్మ గృహిణి. ఐఐటీలో చేరాలన్నదే లక్ష్యంగా కష్టపడి చదివాను. కమ్యూనికేషన్




సైన్స్‌లో తిరుపతి ఐఐటీలో చేరాను. పరిశోధనలు చేసేందుకు చక్కటి స్థలం ఇది. 2023 ప్రాంగణ నియామకాల్లో ఏడాదికి రూ.13.8 లక్షల ప్యాకేజీతో ఉద్యోగానికి ఎంపికయ్యాను. ప్రస్తుతం హైదరాబాద్‌లోనే ఉద్యోగం చేసుకుంటున్నాను.

**ఆనందంగా ఉంది**మాది విశాఖపట్నం. తల్లిదండ్రులిద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే. ఐఐటీలో కెమికల్ ఇంజనీరింగ్ పూర్తిచేశాను. ఇక్కడి వాతావరణం, అధ్యాపకుల ప్రోత్సాహం చాలా బాగుంది. నిత్య పరిశోధనలకు ఐఐటీ తిరుపతి అనువైన వేదిక. ఇటీవల ప్రాంగణ నియామకాల్లో ఏడాదికి రూ.13లక్షల ప్యాకేజీతో ఉద్యోగం సాధించాను. నాకైతే ఎంతో ఆనందంగా ఉంది.

**అధ్యాపకుల ప్రోత్సాహంతో..**

మాది ఒంగోల్. నాన్న ప్రభుత్వ ఆరోగ్య శాఖలో ఉద్యోగి, అమ్మ గృహిణి. ఎంటెక్‌లో సిగ్నల్ ప్రాసెసింగ్ కమ్యూనికేషన్ స్పెషలైజేషన్ తీసుకున్నాను. మొదట్లో కొంత ఇబ్బందిగా ఉండేది. అధ్యాపకుల ప్రోత్సాహంతో విజయవంతంగా పూర్తిచేశాను. 2023 ప్రాంగణ నియామకాల్లో ఎంపికయ్యాను. బెంగుళూరులోని మహేంద్రా అండ్ మహేంద్రాలో ఏడాదికి రూ.13 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం చేస్తున్నాను.

# ఉరుకుంద ఉత్సవం.. కనిపించని ఉత్సాహం

మంత్రాలయం : జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద నరసింహ ఈరన్న స్వామి శ్రావణమాస ఉత్సవాలు నెల రోజులు పాటు జరగనున్నాయి. ఆగస్టు 5 నుంచి ప్రారంభం కానున్న ఈ ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు, పెండాల్, మరుగుదొడ్లు, తాగునీటి వసతులు ముందస్తుగా ఏర్పాటు చేయాలి. కానీ ఏటా పెండాల్ (పందిరి, క్యూలైన్, ఆలయ ముఖ ద్వారాల అలంకరణ) భక్తులకు నీడకు సంబంధించిన టెండరు ప్రక్రియ ఆలస్యంగా జరుగుతోంది. టెండరు ప్రక్రియ ఆలస్యం కావడంతో పెండాల్‌కు సంబంధించిన పనులు ఉత్సవాలు ప్రారంభమైన 10 రోజుల వరకు జరుగుతాయి. నెల రోజుల కోసం సుమారు రూ.27 లక్షలకు టెండరును దక్కించుకుని కేవలం 20 రోజులు మాత్రమే సౌకర్యాలు అందుబాటులోకి తెస్తున్నారు. గుత్తేదారుడు ఉత్సవాలకు నాలుగు రోజుల ముందు పనులను ప్రారంభించి రెండో వారానికి ఏర్పాట్లు పూర్తి చేస్తారు. ఇలా చేస్తే ఆలయ ఆదాయానికి గండిపడుతుంది. ఉత్సవాలకు మరో నాలుగు రోజులు మాత్రమే గడువు ఉంది. ఇంకా పనులు పూర్తి కాలేదు.

**నిఘా నేత్రాలు పని చేసేనా?**

ఉరుకుందలో గతేడాది నిఘా నేత్రాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. కానీ కొన్ని ప్రదేశాల్లో ఏదైనా ఘటనలు జరిగితే అక్కడ సీసీ కెమెరా పని చేయడం లేదనే మాటలు వినిపించాయి. ఉత్సవాల నిమిత్తం సుమారు 130 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. వాటి నిర్వహణ, పనితీరుపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. లక్షల్లో భక్తులు వస్తుంటారు కాబట్టి దొంగతనాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంది. వాటిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**తూతూ మంత్రంగా ఏర్పాట్లు**


సుమారు 20 లక్షల నుంచి 30 లక్షల మంది భక్తులు స్వామి దర్శనానికి వస్తారు. ఇక్కడికి వచ్చే భక్తులు ఒక రోజు ఇక్కడే బస చేసి మరుసటి రోజు ఉదయం నైవేద్యం సమర్పించడం ఆనవాయితి. లక్షలాది మంది భక్తులకు కేవలం 50 మరుగుదొడ్లను మాత్రమే ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అంతే కాకుండా క్యూలైన్లలో, బయట రెండు చోట్ల మాత్రమే తాగునీటి సౌకర్యం ఉంది. భక్తులకు వంటలు, తాగు నీటి కోసం కేవలం 20 ట్యాంకర్లను ఏర్పాట్లు చేశారు. సోమ, గురువారాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఆయా వారాల్లో 40 నుంచి 50 ట్యాంకర్లను ఉంచితే బాగుంటుందని భక్తులు కోరుతున్నారు.

**పార్కింగ్ స్థలం లేదు**లక్షలాది మంది భక్తులు వేలాది వాహనాలల్లో తరలివస్తారు. ఆలయానికి నలు దిక్కులా కోసిగి, ఆదోని, కౌతాళం, హాల్వి రహదారుల్లో వాహనాల నిలుపుదలకు పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేయాలి. కానీ ఆలయానికి సంబంధించిన స్థలం లేదు.ఆయా మార్గాల్లో ఉన్న ప్రైవేటు వ్యక్తుల పొలాలను లీజుకు తీసుకుని పార్కింగ్‌కు సౌకర్యం కల్పించాలి.

**స్నానపు ఘట్టాలు**ఉరుకుందకు వచ్చే భక్తులు ముందుగా స్వామి వారికి తలనీలాలు సమర్పించి ఆ తర్వాత ఎల్లెల్సీ దిగువ కాల్వలో స్నానాలు చేస్తారు. మహిళలకు డ్రస్సింగ్, రూం, మరుగుదొడ్లను అధిక సంఖ్యలో ఏర్పాటు చేయాల్సి ఉంది.

**అదనపు ప్రసాదాల కౌంటర్లు**స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు ప్రసాదం లేకుండా తిరిగి వెళ్లరు. దీంతో ప్రసాదాల కోసం కౌంటర్ల వద్ద గంటల తరబడి క్యూలైన్లలో బారులు తీరి ఉంటారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ అధికారులు అదనంగా మరో రెండు కౌంటర్లను ఏర్పాటు చేస్తే బాగుటుందని స్థానిక భక్తులు కోరుతున్నారు. **ఏర్పాట్లు పూర్తి చేస్తాం-హెచ్‌జీ వెంకటేశ్, ఆలయ డిప్యూటీ కమిషనరు, ఉరుకుంద**ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణమాస ఉత్సవాలు ప్రారంభమయ్యే సరికి ఏర్పాట్లను పూర్తి చేస్తాం. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

# కరుణించి.. వరమిస్తే.. కరవు జిల్లా సస్యశ్యామలం



అనంతపురం : వైకాపా ఐదేళ్ల పాలనలో ఉమ్మడి అనంతపురం జిల్లా తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. సాగు, తాగునీటి ప్రాజెక్టుల నుంచి రైతులకు అందించే ప్రోత్సాహాల వరకు అన్నింటిలో అన్యాయం జరిగింది. 2019 ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలపై నాలుక మడత పెట్టిన జగన్ అన్నివర్గాలను మోసం చేశారు. ఈ మోసాన్ని గ్రహించిన అనంతవాసులు ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైకాపాకు సరైన బుద్ధి చెప్పారు. ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ, 2 పార్లమెంటు స్థానాల్లో తెదేపా కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించారు. అనంతపురం జిల్లా తన మనసుకు దగ్గరగా ఉండే ప్రాంతమని చంద్రబాబు గతంలో పలు సభల్లో స్పష్టం చేశారు. గతంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనూ కరవు ప్రాంతమైన అనంతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అభివృద్ధికి బాటలు వేశారు. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో 2019-24 మధ్యలో నిలిచిపోయిన అభివృద్ధి పరుగులు పెడుతుందని ఆశిస్తున్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి జిల్లా పర్యటనకు వస్తున్న చంద్రబాబు ఎలాంటి వరాలు ప్రకటిస్తారో అని ఆశగా ఎదురుచూస్తున్నారు.

**జిల్లా కేంద్రంపై నిర్లక్ష్యం**

పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లా ఏర్పడి రెండేళ్లు దాటినా ఆ దిశగా అడుగులు పడలేదు. కేవలం సత్యసాయి ట్రస్టు సహకారంతో జిల్లా కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. కనీసం సొంత భవనాల నిర్మాణాలకు స్థల సేకరణ కూడా జరగలేదు. జిల్లా కేంద్రం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని శ్రీసత్యసాయి జిల్లావాసులు కోరుతున్నారు.

**పారిశ్రామికంగా పరుగులు పెట్టాలి**

2014-19 మధ్య ఉమ్మడి అనంతపురం జిల్లాలో పారిశ్రామిక ప్రగతి పరుగులు పెట్టింది. మొత్తం 58 భారీ, 2 వేల చిన్నతరహా పరిశ్రమలు కొలువుదీరాయి. ఇందులో సుమారు 58 వేల మంది ఉపాధి పొందుతున్నారు. అయితే కియా వంటి భారీ పరిశ్రమలు హిందూపురం, పెనుకొండ ప్రాంతాలకే పరిమితమయ్యాయి. మిగిలిన నియోజకవర్గాల్లోనూ పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాల్సిన అవసరం ఉంది. హిందూపురం, పెనుకొండ ప్రాంతాల్లో వేల ఎకరాలు పరిశ్రమల కోసం తీసుకున్నారు. రామగిరిలోని బంగారు గనుల్ని మళ్లీ తెరిపిస్తే కొన్ని వేలమందికి ఉపాధి దొరుకుతుంది.

**పట్టు రైతులపై ప్రేమ చూపించరూ..**

ఉమ్మడి జిల్లాలో సుమారు 60 వేలమంది మల్బరీ సాగు చేస్తున్నారు. వారిని ప్రోత్సహించేందుకు 2014-19 వరకు ఏడాదికి ఒక్కో రైతుకు రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు ప్రోత్సాహకాల రూపంలో అందేది. వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత పథకాన్ని నిలిపివేసింది. కేవలం 2021లో మాత్రమే ఇన్సెంటివ్స్ అందించారు. నాలుగేళ్ల బకాయిలు రూ.65 కోట్ల వరకు ఉన్నాయి.

**తాగునీటి ఇక్కట్లు తీరేలా..**

రెండు జిల్లాల తాగునీటి అవసరాలు తీర్చే శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి పథకాల నిర్వహణను గత ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసింది. శ్రీసత్యసాయి పథకం నిర్వహణ నుంచి ఎల్అండ్‌టీ కంపెనీని తప్పించి వైకాపా నాయకులకు అప్పగించారు. శ్రీరామిరెడ్డి పథకం నిర్వహణకు కనీస నిధులు కూడా విడుదల చేయలేదు. హిందూపురం, మడకశిర ప్రజలు తాగునీటికి అవస్థలు పడుతున్నారు.

**మడకశిర బ్రాంచి కెనాల్‌తో చెరువులకు నీరు**

మడకశిర నియోజకవర్గంలో రూ.640 కోట్ల అంచనా వ్యయంతో 17 లిఫ్టుల ద్వారా 16,500 ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో మొదలైన మడకశిర బ్రాంచి కెనాల్ పనులు ఐదేళ్లుగా నిలిచిపోయాయి. 2019కు ముందు అప్పటి తెదేపా ప్రభుత్వం పనుల్ని పరుగులు పెట్టించింది. వైకాపా పాలనలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. కూటమి ప్రభుత్వం మడకశిర బ్రాంచి కెనాల్ పూర్తి చేస్తే నియోజకవర్గంలోని 127 చెరువులకు నీరు అందుతుంది.

**బాబుతోనే హంద్రీనీవా సాధ్యం**

నిత్యం కరవుతో అల్లాడే ఉమ్మడి అనంతకు హంద్రీనీవా సుజల స్రవంతి ఒక్కటే సంజీవని. అయితే జగన్ పాలనలో ఒక గంప మట్టి కూడా తీయలేదు. రూ.50 కోట్లు ఖర్చు చేసి చిన్నచిన్న పనులు పూర్తి చేస్తే 80 వేల ఎకరాలకు నీరందించే అవకాశం ఉన్నా మొన్నటివరకు పాలించిన ప్రభుత్వం పట్టించుకోలేదు. 2019కు ముందు అప్పటి తెదేపా ప్రభుత్వం రూ.1,100 కోట్లు ఖర్చు పెట్టి 90 శాతం పనుల్ని పూర్తిచేసింది. మిగిలిన 10 శాతం పనులు పూర్తయితే ఉమ్మడి జిల్లాలోని 1.45 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది.

**డ్రిప్ పథకానికి జీవం పోయండి**

ఉమ్మడి జిల్లాలో అత్యధిక శాతం రైతులు బిందు సేద్యంపై ఆధారపడుతున్నారు. దీన్ని గ్రహించిన చంద్రబాబు 2014-19 మధ్యలో 90 శాతం రాయితీతో పరికరాలు అందించారు. ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం రాయితీతో పరికరాలు ఇవ్వడంతో లక్షలాది మంది రైతులు బాగుపడ్డారు. 2019లో ఏర్పడిన వైకాపా ప్రభుత్వం పథకాన్ని మూడేళ్లపాటు పక్కనపెట్టేసింది.

# పని చేయకుండానే రూ. లక్షల్లో జీతాలు!




విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పనిచేయని వ్యక్తులకు రూ.లక్షల్లో జీతాలు చెల్లిస్తున్నారు. గత ప్రభుత్వంలో వైకాపా కార్యకర్తగా ముద్రపడిన మాజీ వీసీ ప్రసాదరెడ్డి హయాంలో నిబంధనలకు విరుద్ధంగా అనేక నియామకాలు సాగాయి. ఆయన సన్నిహితులు, వైకాపాకు అనుకూలంగా ఉన్న, ప్రైవేటు కళాశాలలకు చెందిన పలువురికి వర్సిటీలో స్థానం కల్పించారు. వర్సిటీ ఉద్యోగులు కాకపోయినా మరికొందరిని వివిధ విభాగాల్లో పనిచేస్తున్నట్లు చూపించి, డబ్బులు నొక్కేశారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికీ ఆ ప్రక్రియ కొనసాగుతుండటం చర్చనీయాంశమవుతోంది. ఇలా వర్సిటీ నిధులు దుర్వినియోగమవుతున్నాయని, ఏయూ అధికారులు దీనిపై దృష్టి సారించాలని విశ్రాంత, సీనియర్ ఉద్యోగులు కోరుతున్నారు.

**వర్సిటీలో కనిపించకుండానే:** 'రూసా' పథకం కింద 2020లో ఓ మహిళను విధుల్లోకి తీసుకున్నారు. ఆమె కోసం ఫార్మసీ కళాశాలలో ఫుడ్ అండ్ న్యూట్రిషన్ విభాగంలో డిప్యూటీ డైరెక్టర్ పదవిని సృష్టించారు. ఏడాది పాటు నెలకు దాదాపు రూ.50 వేల చొప్పున చెల్లించినట్లు తెలిసింది. అనంతరం ఆ పథకం నిలిచిపోయింది. ఏడాది తర్వాత ఆమె వర్సిటీలో కనిపించడం లేదని చెబుతున్నారు. రూసా నిధులు రాకపోయినా వర్సిటీ నిధుల నుంచి ఆమెకు జీతం చెల్లిస్తున్నారు. గత మూడేళ్లుగా రూ.20 లక్షలకు పైగా చెల్లించారు. ఈ విషయమై ఆడిట్ సమయంలో అభ్యంతరం వ్యక్తం చేసినా.. ఆమె అధికారుల ఎదుట హాజరుకాలేదని తెలిసింది.

**ఆమెవరో తెలియదట:** ఆ మహిళ భర్త వర్సిటీలో అసిస్టెంట్ ఇంజినీరుగా పనిచేస్తున్నారు. ఆమె తరఫున బిల్లులను ఆయనే తీసుకొస్తారని తెలిసింది. ఆయన మాజీ వీసీ, మాజీ రిజిస్ట్రార్‌కు సన్నిహితులు. ఆమెకు లాభం చేకూర్చడంలో వీరంతా కీలకంగా వ్యవరించారని వర్సిటీలో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఆమెను ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో అడ్మినిస్ట్రేటివ్ అధికారి-1 గా చూపిస్తున్నారు. యూజీసీ సెక్షన్‌లో సంప్రదించినా ఆమె ఏ విభాగంలో పనిచేస్తున్నారో తెలియదని చెప్పడం గమనార్హం. తెలియకుండా బిల్లులు ఎలా మంజూరు చేస్తున్నారో వారే సమాధానం చెప్పాలి. ఈ విషయమై ఏయూ సిబ్ అధికారులను సంప్రదించగా ఆ పేరుతో ఇక్కడెవరూ పనిచేయడంలేదని చెప్పడం గమనార్హం.


**ఆయనకూ అలాగే:** గత అయిదేళ్లలో వర్సిటీ అభివృద్ధి కోసం కాకుండా వ్యక్తిగత ప్రయోజనాలే ధ్యేయంగా ఏయూ అధికారులు పనిచేశారనే ఆరోపణలున్నాయి. చీఫ్ సెక్యూరిటీ అధికారిగా పనిచేసిన మహమ్మద్ ఖాన్‌ను సైతం 'రూసా' కింద నియమించారు. నెలకు రూ.లక్షకు పైగా జీతం ఇచ్చేవారు. గడువు ముగిసినా రూసా కింద చెల్లింపులు జరిపారు. ఆడిట్ అభ్యంతరం రావడంతో ఆరు నెలల క్రితం నిలిపివేశారు. తర్వాతి నుంచి ఇటీవల ఆయన రాజీనామా చేసేవరకు వర్సిటీ నిధుల నుంచి జీతం చెల్లించారు. బీ మహమ్మద్ ఖాన్ సమయంలో ఆయన సొంతంగా అయిదుగురు సెక్యూరిటీ అధికారులను నియమించారు. వారికి కూడా వర్సిటీ నిధుల నుంచి నెలకు రూ.25 వేల నుంచి రూ.40 వేల వరకు చెల్లిస్తున్నారు. గత 15 ఏళ్లకు పైగా పనిచేస్తున్న వర్సిటీ భద్రతా సిబ్బందికి రూ.12 నుంచి రూ.13 వేలు మాత్రమే ఇస్తున్నారు. ఖాన్ రాజీనామా చేసినా ఆయన నియమించిన అధికారులను ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. ఈ విషయమై ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ కిశోర్‌బాబును సంప్రదించగా... ఈ విషయాలపై విచారణ చేస్తామన్నారు.

# విశాఖ నీటి కాలుష్యంపై కేసు కొట్టివేత

విశాఖ : ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ ప్రజలకు కలుషితనీరు అందుతోందన్న ఆరోపణలపై స్వయంగా విచారణ చేపట్టిన జాతీయ హరిత ట్రైబ్యునల్ దక్షిణాది బెంచ్(చెన్నై) ఈ కేసును కొట్టివేస్తూ తీర్పు ఇచ్చింది. ప్రజలకు అందించే తాగునీటి శుద్ధి ప్రక్రియపై గట్టి నిఘా పెట్టాలని గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ)కు ఆదేశాలు జారీ చేసింది.

విశాఖ నగర ప్రజలకు మేహాద్రిగెడ్డ, ముడసర్లోవ, రైవాడ, తాటిపూడి, గంభీరం రిజర్వాయర్ల నుంచి తాగునీరు అందిస్తున్నారు. పోలవరం నుంచి ఈ రిజర్వాయర్లకు నీటిని నింపాలనే ప్రభుత్వ ప్రణాళిక కూడా ఉంది. ఈ నేపథ్యంలో మేహాద్రిగెడ్డలో నీటి కాలుష్యం పెరుగుతోందని విశాఖలోని క్వాలిటీ కౌన్సెల్ ఆఫ్ ఇండియా జరిపిన సర్వేలో బయటపడింది. కాలుష్యాన్ని నివారించకపోతే విశాఖ నగరంలో కూడా ఏలూరులోలా ప్రజల్లో అనారోగ్య సమస్యలు పెరుగుతాయని నివేదించింది. దీనిపై వచ్చిన వార్తలపై ఎన్జీటీ స్పందించి విచారణ చేపట్టింది. 2021 నుంచి మొదలైన విచారణ మూడేళ్లపాటు కొనసాగింది. ఎన్జీటీ కోరం సభ్యులు జస్టిస్ పుష్ప సత్యనారాయణ, డాక్టర్ సత్యగోపాల్ కొర్లపాటి తీర్పు ఇచ్చారు.

రిజర్వాయర్ల నుంచి ప్రజలకు తాగునీటి కోసం సరఫరా చేసేటప్పుడు శుద్ధిప్లాంట్లపై గట్టి నిఘా పెట్టాలని జీవీఎంసీని ఆదేశించింది.



జీవీఎంసీ, రాష్ట్ర కాలుష్య నియంత్రణమండలి తరచూ రిజర్వాయర్లకు వచ్చేనీరు, అక్కడినుంచి వెళ్లే నీటి నమూనాలు సేకరించి పరీక్షించాలని ఆదేశించారు. కలుషితనీరు రిజర్వాయర్లకు చేరకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎస్టీపీల నుంచి రిజర్వాయర్లకు వచ్చేనీరు పూర్తిస్థాయిలో శుద్ధి అయిన తర్వాతే కలిసేలా చూడాలన్నారు. పర్యావరణపరంగా ఎక్కడైనా ఉల్లంఘనలు జరిగితే కాలుష్య నియంత్రణ మండలి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# గంటన్నరకు పైగాప్రశ్నల వర్షం

విశాఖపట్నం : విశాఖ మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కుటుంబ సభ్యుల కిడ్నాప్ ఘటన రాష్ట్రంలో సంచలనం రేపింది. దాదాపు ఏడాది కిందటి ఈ కేసులో రౌడీషీటర్ హేమంత్, మరి కొందరిని గత ప్రభుత్వంలో పోలీసులు జైలుకు పంపారు. అయితే విచారణలో వెలుగులోకి వచ్చిన వాస్తవాలను తొక్కి పెట్టారన్న చర్చ అప్పట్లో జరిగింది. ఆ కిడ్నాప్ జరగడానికి కారణాలేంటి? హేమంత్ గ్యాంగ్‌తో ఎంవీవీకి సంబంధం ఏంటి? వంటి ప్రశ్నలు గత ఏడాదిగా చిక్కుముడిగానే మిగిలిపోయాయి. తెదేపా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎంవీవీ కుటుంబ సభ్యుల కిడ్నాప్ మిస్టరీపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

ఏం ప్రశ్నించారు?: ఓ హత్య కేసులో రౌడీషీటర్ హేమంత్ విశాఖ కారాగారంలో జీవిత ఖైదు అనుభవిస్తునా న్నరు. ఎంవీవీ కుటుంబ సభ్యుల కిడ్నాప్ కేసులోనూ ఇతను ప్రధాన నిందితుడు. కొన్ని రోజుల క్రితం నగర పోలీసు ఉన్నతాధికారి ఒకరు కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. ఈ సమయంలో హేమంత్‌ను గంటన్నరకు పైగా ప్రశ్నించినట్లు సమాచారం. ఈ సమయంలో ఎంపీ కుటుంబ సభ్యుల కిడ్నాప్ మిస్టరీపై పూర్తిగా ఆరా తీసినట్లు తెలుస్తోంది. కిడ్నాప్ చేయడానికి ప్రధాన కారణం, అంతకుముందు ఎంవీవీతో ఉన్న ఆర్థిక, ఇతర లావాదేవీలపై కీలక విషయాలు రాబట్టినట్లు తెలుస్తోంది. పోలీస్ అధికారి ప్రశ్నలకు సమాధానాలతోపాటు, హేమంత్ ఇంకా ఏదైనా





ముఖ్యమైన సమాచారం ఇచ్చారా? అనేది సర్వత్రా ఆసక్తిగా మారింది. గత ప్రభుత్వంలో ఈ కేసులో ఎలాంటి విచారణ చేపట్టారనే దానిపైనా దృష్టి పెట్టారు. ఈ కిడ్నాప్ కేసులో మరో నిందితుడు రాజేష్ కూడా ఇదే కారాగారంలో ఉన్నట్లు సమాచారం.

ఆ డిమాండ్లపైనా దృష్టి: మధురవాడ పరిధిలో ఎంవీవీ కోసం హేమంత్ గ్యాంగ్ భూ పంచాయితీలు చేసినట్లు ఆరోపణలున్నాయి. హేమంత్, ఎంవీవీ, వైకాపా నేత జీవీల మధ్య ఉన్న సంబంధం ఏంటనేది విచారణ చేయాలంటూ అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న తెదేపా, జనసేన, భాజపా నేతలు కోరారు. రౌడీషీటర్ హేమంత్‌కు విశాఖలో 12 చోట్ల విలువైన స్థలాలు, ఐదు విల్లాలు, ఐదు ఖరీదైన కార్లు ఎవరు ఇచ్చారు? ఎంవీవీ బంధువైన బెంగళూరుకు చెందిన ఎం.సత్యనారాయణ వాటిలో కొన్నింటిని బహుమానంగా హేమంత్‌కు ఎందుకు ఇవ్వాల్సి వచ్చిందన్న ఆరోపణలపై సమగ్ర విచారణ చేయాలనే డిమాండ్ కూడా వచ్చింది. వీటిపైనా పోలీసులు దృష్టిసారించినట్లు తెలుస్తోంది.

# కొండల్లో బతుకు.. నిత్యం బితుకు బితుకు!!

నక్కపల్లి : కేరళలోని వయనాడ్ జిల్లాలో భారీ వర్షాలకు కొండ చరియలు విరిగిపడి పలు గ్రామాలు ఆనవాళ్లు లేకుండా పోయాయి. 160 మందికి పైగా కొండ రాళ్ల కింద, బురదలో చిక్కుకుని మృతి చెందిన విషాద ఘటన అందరినీ దిగ్భ్రాంతికి గురి చేసింది. విశాఖలోని కొండవాలు ప్రాంతాల్లోనూ ప్రజల పరిస్థితి అంతే. చినుకు రాలితే ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని రాత్రిళ్లు కంటిమీద కునుకులేకుండా గడుపుతున్నారు. ఇప్పటికే కొండ చరియలు, మట్టిపెళ్లలు పడి పలు ఘటనల్లో కొందరు ప్రాణాలు కోల్పోగా.. ఇటీవల కురిసిన వర్షాలకు కొన్ని చోట్ల ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. కొండవాలు ప్రాంతాల్లో నివశించే పేదల ఓట్లకై పాకులాడిన గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రక్షణ చర్యలు చేపట్టడంలో విఫలమైంది.

సాధారణంగా ఏటవాలు ప్రాంతంలో ఎక్కువగా కొండచరియలు విరిగిపడుతుంటాయి. వాలుగా ఉండే ప్రాంతాల్లో రాళ్లు, మట్టిని పట్టి ఉంచే బలం కంటే అవి కిందికి జారడానికి కారణమయ్యే గురుత్వాకర్షణ బలం ఎక్కువగా ఉన్నప్పుడు ఇలా జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.ఇక్కడ ఎక్కువ: హనుమంతవాక నుంచి



సింహాచలం వరకు విస్తరించిన కొండవాలులో హనుమంతవాక, పెదగదిలి, చినగదిలి పరిధిలో నివాసాలున్నాయి. డెయిరీఫారం నుంచి రవీంద్రనగర్ వరకు, వెంకోజీపాలెం, హెచ్‌బీ కాలనీ, మాధవధార, సీతమ్మధార, తాటిచెట్లపాలెం, కైలాసపురం, కంచరపాలెం, గోపాలపట్నం పరిధిలోని కొండ వాలులో పెద్ద సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలున్నాయి. గాజువాక, పారిశ్రామిక ప్రాంతంలోని కాలనీల్లో వేలాది కుటుంబాలకు కొండలే దిక్కయ్యాయి.ప్రజల రక్షణ మరిచారు: దశాబ్దాల తరబడి కొండవాలు ప్రాంతాల్లో బతుకుతున్న ప్రజలను జీవీఎంసీ నిర్లక్ష్యం చేసింది. ప్రాణాలు కోల్పోయే ప్రమాదం పొంచి ఉన్న ప్రాంతాలపై ఇప్పటి వరకు కనీసం నిపుణులతో సర్వే కూడా నిర్వహించ లేదు. రక్షణ గోడల నిర్మాణం కూడా మాటలకే పరిమితం అయింది. అయితే... వైకాపా పెద్దల కోసం గత ప్రభుత్వంలో కైలాసగిరి కొండకు ఆనుకుని ఉన్న అపార్టుమెంట్లకు నష్టం వాటిల్లకుండా రూ.2కోట్లతో రక్షణ గోడ నిర్మాణానికి ప్రతిపాదించడం గమనార్హం.

# 'స్థాయీ' ఎన్నికల బరిలో 20 మంది

విశాఖ : మహా విశాఖ నగరపాలక సంస్థ స్థాయీ సంఘం ఎన్నికలకు దాఖలైన నామపత్రాలను జీవీఎంసీ అధికారులు పరిశీలించారు. తెదేపా తరఫున 10 మంది, వైకాపా తరఫున 10 మంది నామపత్రాలు అందజేయగా, అవన్నీ సక్రమంగా ఉండటంతో 20 మంది బరిలో ఉన్నట్లు జీవీఎంసీ కార్యదర్శి పల్లి నల్లనయ్య, ఏడీసీ ఎస్ఎస్ వర్మ ప్రకటించారు. 3వ తేదీ వరకు నామపత్రాల ఉపసంహరణకు గడువు ఉంది. ఈనెల 7న స్థాయీ ఎన్నికలు జరగనున్నాయి. తెదేపా తరఫున శరగడం రాజశేఖర్, బొమ్మిడి రమణ, నొల్లి నూకరత్నం, గల్లా పోలిపల్లి, పిల్లా మంగమ్మ, బల్ల శ్రీనివాసరావు, పులి లక్ష్మీబాయి, గొలగాని వీరారావు, పి.వి. లక్ష్మీ నరసింహం, విల్లూరి భాస్కరరావు.., వైకాపా తరఫున అక్కరమాని రోహిణి, రెయ్యి వెంకటరమణ, ఇమ్రాన్ మహమ్మద్, బిపిన్‌కుమార్ జైన్, ముర్రు వాణి, సాడి పద్మావతి, నక్కెళ్ల లక్ష్మి, తోట పద్మావతి, కేవీఎన్ శశికళ, పల్లా అప్పలకొండ ఎన్నికల బరిలో ఉన్నారు.

# బేబమ్మ చీర కట్టుతో చంపేస్తోంది

ఉప్పెన సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ కృతి శెట్టి. మొదటి సినిమా విడుదల అవ్వక ముందే మూడు నాలుగు సినిమాలకు సైన్ చేసిన ఈ అమ్మడు ఉప్పెన సూపర్ హిట్ అవ్వడంతో మరో నాలుగు అయిదు సినిమాలకు బ్యాక్ టు బ్యాక్ ఓకే చెప్పింది. సోషల్ మీడియాలోనూ కృతి శెట్టికి మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ దక్కింది. వరుసగా మూడు నాలుగు సినిమాలతో సక్సెస్ లను దక్కించుకున్న కృతి శెట్టి ఆ తర్వాత చేసిన సినిమాలు వరుసగా నిరాశ పరుస్తూ వచ్చాయి. దాంతో టాలీవుడ్ లో ఈ అమ్మడికి ఆఫర్లే కరువు అయ్యాయి. తెలుగు లో సినిమాలు లేక పోవడంతో తమిళ్, మలయాళ సినిమా ఇండస్ట్రీలో ఆఫర్ల కోసం ప్రయత్నాలు చేసింది. తమిళ్ లో మూడు సినిమాలను చేస్తున్న ఈ అమ్మడు మలయాళంలో చేసిన 'ఏఆర్ఎం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మలయాళంలో ఈమె చేసిన సినిమాకి పాజిటివ్ టాక్ దక్కింది. మలయాళ సినిమా ఇండస్ట్రీలో రాబోయే రోజుల్లో ఈ అమ్మడు వరుసగా సినిమాలు చేసే అవకాశాలు ఉన్నాయి. తమిళంలో ఈమె చేస్తున్న మూడు సినిమాల్లో కనీసం ఒక్కటి హిట్ అయినా కచ్చితంగా మరిన్ని ఆఫర్లు వచ్చే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది.



కెరీర్ ఆరంభంలో స్కిన్ షో కి దూరంగా ఉన్న ఈ అమ్మడు ఈ మధ్య కాలంలో గ్లామర్ గా కనిపించేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లుగా సమాచారం అందుతోంది. అందుకోసమే ఈ అమ్మడు సోషల్ మీడియాలో అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా ఈమె చీర కట్టు ఫోటోలను షేర్ చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. నడుము అందాన్ని చూపిస్తూ చూపు తిప్పుకోనివ్వని బేబమ్మ కృతి శెట్టి ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. టాలీవుడ్ ఫిల్మ్ మేకర్స్ బేబమ్మ ప్రతిభను, అందంను ప్రేక్షకులకు చూపించడంలో విఫలం అయ్యారు. ముందు ముందు అయినా ఆమె టాలీవుడ్ లో మంచి సినిమాలు చేయాలని కోరుకుంటున్నారు. ఇంత అందంగా ఉన్న కృతి శెట్టికి టాలీవుడ్ తో పాటు ఇతర భాషల్లోనూ స్టార్ హీరోలతో నటించే అవకాశాలు రావాల్సిన అవసరం ఉంది. ఆమె ఇలా అందాల ఫోటోలను షేర్ చేయడం ద్వారా మళ్లీ తెలుగు లో సినిమాలు చేసే అవకాశాలు ఉన్నాయి. బేబమ్మ చీర కట్టు ఫోటోలకు సాధారణంగానే అభిమానులు ఎక్కువ మంది ఉంటారు. ఈసారి నడుము అందం చూపిస్తూ బేబమ్మ ఇచ్చిన ఫోటో ఫోజులు మరింత వైరల్ అవుతున్నాయి. లూజ్ హెయిర్ స్టైల్ తో రెండు పెద్ద తెల్ల గులాబీలను ధరించిన బేబమ్మ అందం ముందు ఎంతటి వారైనా దిగదుడుపే అంటూ ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

# జాన్వీ కపూర్ మాట తప్పింది ప్రేమకా? పెళ్లికా?

జాన్వీకపూర్ ..శిఖర్ పహారియాతో పీకల్లోతూ ప్రేమలో మునిగి తేలుతోన్న సంగతి తెలిసిందే. ఇద్దరు కొంత కాలంగా డేటింగ్ చేస్తున్నట్లు బాలీవుడ్ మీడియా ఎప్పటికప్పుడు హైలైట్ చేస్తూనే ఉంది. ముంబై పబ్ ల్లో పార్టీల నుంచి ప్రయివేట్ ఈవెంట్ల వరకూ ఈ జోడీ దొరకని పబ్ అంటే లేదు. ఇటీవలే అంబానీ ఇంట పెళ్లి వేడుకలో జంట ఏ రేంజ్ లో ఎంజాయ్ చేసిందో తెలిసిందే. ఇక గుడులు..గోపురాలు అంటూ తిరిగే విషయం గురించైతే చెప్పాల్సిన పనిలేదు. భారత్ లో ప్రఖ్యాత దేవాలయాలన్నింటిని ఇప్పటికే చుట్టేసారు. కుదిరితే మరోసారి చుట్టేయాలని చూస్తున్నారు. కానీ సమయం దొరకడం లేదు. జాన్వీ నటిగా బిజీగా ఉండటంతో శిఖర్ పహారియాకి తగినంత సమయం కేటాయించకలేకపోతుంది. అందుకే అమ్మడు తెలివిగా అంబానీ ఇంట పెళ్లి వేడుకను స్పాట్ చేసుకుని మూడు రోజులు ఎంజాయ్ చేసింది. ఇదంతా అందరికీ తెలిసిన



విషయమే. అయితే జాన్వీ ఓ విషయంలో మాత్రం మాట తప్పింది. అది పెళ్లికై? లేక ప్రేమకై! అన్నది తెలియదు గానీ రెండళ్ల క్రితం నెట్ ప్లిక్స్ షోలో రిలేషన్ షిప్స్ గురించి అడిగితే రెండేళ్ల వరకూ ఆవిషయం నా మైండ్ లోకి రానివ్వనని చెప్పింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో వాటి జోలికి వెళ్లేది లేదని తెలిపింది. కట్ చేస్తే ఈ గ్యాప్ లో నే శిఖర్ పహారియాతో దొరికింది. ఇద్దరు డేటింగ్ చేస్తున్నట్లు అధికారిక ప్రకటన లేదుకానీ అనధికారకంగా ఎన్నోసార్లు చిక్కారు. అయితే ఆరోజు జాన్వీ చెప్పింది పెళ్లి గురించా? ప్రేమ గురించా? అన్నది క్లారిటీ మిస్ అవుతుంది. తాను కేవలం పెళ్లి గురించి ఆలోచించలేదని...ప్రేమ గురించి కాదని తాజా సన్నివేశాన్ని బట్టి అభిమానులు అవగతం చేసుకుంటున్నారు. ఎలాగూ జీవితానికి ఓ తోడు కావాలి. కాని అది ఇప్పుడే కాదని అందుకు సమయం పడుతుందని..అలాగని ప్రేమకు దూరం కాదనే విషయాన్ని అలా రివీల్ చేసిందని అంటున్నారు.




# 30 ఏళ్లు అయినా మంజు మేడం అదే జోరు




సినిమా ఇండస్ట్రీలో హీరోలు ముప్పై, నలభై ఏళ్లు హీరోలుగా కొనసాగుతారు. కానీ హీరోయిన్స్ మాత్రం పదేళ్లు కొనసాగడం గొప్ప విషయంగా మారింది. అతి కొద్ది మంది హీరోయిన్స్ మాత్రమే పదేళ్లకు మించి ఇండస్ట్రీలో కొనసాగుతున్నారు. అలాంటి పరిస్థితుల్లో ఇండస్ట్రీలో అడుగు పెట్టి 30 ఏళ్లు అవుతున్నా మంజు వారియర్ వరుస సినిమాలతో బిజీ బిజీగా ఉంటుంది. మలయాళ సినిమా ఇండస్ట్రీకి చెందిన ఈ అమ్మడు తమిళ సినిమాలతో పాటు హిందీ సినిమాల్లో కూడా నటించి మెప్పించింది. ఒకానొక సమయంలో మంజు వారియర్ సౌత్ లోనే స్టార్ హీరోయిన్ గా కొనసాగింది. ఈ మధ్య కాలంలో క్యారెక్టర్ ఆర్టిస్టుగా చేస్తున్న మంజు వారియర్ అప్పుడప్పుడు హీరోయిన్ గానూ చేస్తోంది. ధనుష్ తో కలిసి ఆ మధ్య ఈమె చేసిన సినిమాకు మంచి మార్కులు పడ్డాయి. హీరోయిన్ గా ఈ వయసులోనూ తన సత్తా చాటుతున్న మంజు వారియర్ కి మరింతగా ఆఫర్లు వస్తున్నాయి. ఇటీవల ఈమె రజినీకాంత్ తో కలిసి 'వేట్టయన్' సినిమాలో నటించింది. టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాను దసరా కానుకగా అక్టోబర్ 10 న ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నారు. ఇటీవల విడుదలైన వేట్టయన్ సినిమా పాట లో మంజు వారియర్ స్టెప్స్ కి ప్రేక్షకులు ఫిదా అవుతున్నారు. మంజు వారియర్ డాన్స్ మూమెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ఈ సమయంలో మంజు వారియర్ గురించిన చర్చ ప్రముఖంగా జరుగుతోంది. మంజు వారియర్ సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టి 30 ఏళ్లు అవుతోంది. 15 ఏళ్ల వయసులోనే మంజు వారియర్ సినిమాల్లో అడుగు పెట్టింది. మలయాళంలో దాదాపుగా 40 సినిమాలు చేసిన మంజు వారియర్ తమిళ్ లో వరుసగా సినిమాలు చేసింది. 1995 లో సాక్ష్యం సినిమాతో మంజు వారియర్ ఎంట్రీ ఇచ్చింది. ఏటా నాలుగు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వస్తున్న మంజు వారియర్ ప్రస్తుతం అర డజనుకు పైగా సినిమాల్లో నటిస్తోంది. హీరోయిన్ గా బిజీ బిజీగా ఉన్న సమయంలోనే మలయాళ హీరో దిలీప్ ను 1999 లో పెళ్లి చేసుకుంది. పెళ్లి తర్వాత కొన్నాళ్లు సినిమాలకు దూరం అయింది. దిలీప్ తో వచ్చిన విభేదాల కారణంగా విడి పోయింది. భర్త నుంచి విడిపోయిన సమయంలో ఉన్న ఒక్క కూతురు కూడా తండ్రి వద్ద ఉంటానని చెప్పడంతో మంజు వారియర్ కి తీవ్ర దుఖం మిగిలింది. ఆ సమయంలో మంజు వారియర్ కొన్నాళు డిప్రెషన్ కి వెళ్లినట్లుగా చెప్పింది. తిరిగి సినిమాల్లో రీ ఎంట్రీ ఇచ్చి వరుసగా సినిమాల్లో నటిస్తోంది. హీరోయిన్ గా కెరీర్ ఆరంభంలో చేసిన స్పీడ్ తో పోల్చితే మరింత స్పీడ్ గా ఇప్పుడు సినిమాల్లో నటిస్తున్న మంజు వారియర్ తెలుగు లో కూడా నటించాలని ప్రేక్షకులు కోరుకుంటున్నారు.

# గోపిచంద్ విశ్వం.. ఫస్ట్ సాంగ్ ఎలా ఉందంటే..




మాచో స్టార్ గోపీచంద్ శ్రీను వైట్ల కాంబినేషన్‌లో మొదటి సారి తెరకెక్కుతున్న భారీ బడ్జెట్ సినిమా 'విశ్వం'. ఇక ఈ సినిమా మొదటి పాట 'మొరొక్కన్ మగువ' విడుదలైంది. సినిమాలో యాక్షన్, ఎమోషన్, కామెడీ అన్ని అంశాలు సమపాళ్లలో మేళవించి, ప్రేక్షకులను పూర్తిగా ఎంటర్‌టైన్ చేసేలా తెరకెక్కించారని టీజర్ ద్వారా స్పష్టమైంది. సినిమాపై మంచి అంచనాలు క్రియేట్ అయ్యాయి. విశ్వం చిత్రాన్ని టీజీ విశ్వ ప్రసాద్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ మరియు వేను దోనేపూడి చిత్రాలయం స్టూడియోస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. దోనేపూడి చక్రపాణి సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు.

ఇక సినిమాకు సంబంధించిన ఫస్ట్ సాంగ్ 'మొరొక్కన్ మగువ' ను రిలీజ్ చేశారు. చైతన్ భరద్వాజ్ సంగీతం అందించగా, ఈ పాటను ప్రుధ్వి చంద్ర, సాహితి చాగంటి తమ గానం మరింత అందంగా ఆలపించారు. రకేందు మౌళి రాసిన ఈ పాటలో తెలుగుతో పాటు ఇంగ్లీష్ పదాలు కలగలిపి వినసొంపుగా ఉండేలా రాశారు. పాటకు అనుగుణంగా పరిణామాలు, మారే లయలు ఈ పాటను మరింత ఆకర్షణీయంగా మార్చాయి. ఈ పాటలో గోపీచంద్, కవ్యా థాపర్ మధ్య రొమాంటిక్ కెమిస్ట్రీ చాలా బాగా కుదిరింది. ఈ ఇద్దరూ స్టైలిష్ లొకేషన్స్ లో గ్రేస్‌ఫుల్ డాన్స్ మూమెంట్స్‌తో పాటను మరింత హైలైట్ చేశారు. పాటలో చూపించిన విజువల్స్ కూడా ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయి. 'మొరొక్కన్ మగువ' పాట సినిమా ప్రమోషన్స్‌కు శుభారంభం అందించి, ప్రేక్షకుల్లో సినిమా మీద ఆసక్తిని మరింత పెంచింది. ఈ చిత్రానికి కెవి గుహన్ సినిమాటోగ్రఫీ అందించగా, చైతన్ భరద్వాజ్ సంగీతాన్ని అందిస్తున్నారు. శ్రీను వైట్లకు చెందిన పలు బ్లాక్‌బస్టర్ సినిమాలకు స్క్రీన్‌ప్లే రచయితగా పనిచేసిన గోపి మోహన్ ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే రాశారు. అమర్ రెడ్డి కుడుముల ఎడిటర్‌గా, కిరణ్ మానే ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. టీజర్ విడుదల తర్వాత ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. టీజర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన వచ్చింది. ఇక దసరా సందర్భంగా ఈ చిత్రం అక్టోబర్ 11న విడుదల కానుంది. మరి ఈసారి గోపిచంద్ ఏ స్థాయిలో ఎట్రాక్ట్ చేస్తాడో చూడాలి.

# ఇలా బ్రేకప్ చెప్పడం అన్యాయం రకుల్!

ప్రేమికుల మధ్య...భార్య భర్తల మధ్య దూరం ఎప్పుడు పెరుగతుంది? ఏ కారణాలుగా విడిపోతారు? అన్నది చెప్పాల్సిన పనిలేదు. అలా విడిపోయారు అంటే ఎన్నో బలమైన కారణాలుంటాయి. మనసుకు తగిలిని వ్యక్తిగత గాయాలుంటాయి. అవి మనస్పర్థలు కావొచ్చు..ఇంకేవైనా కావొచ్చు. కానీ వేయించిన ఆహారం తీసుకొచ్చాడు? అని బ్రేకప్ చెప్పిన వారిని ఎప్పుడైనా చూసారా? అంటే ఇప్పుడు చూడండి అంటూ రకుల్ ప్రీత్ సింగ్ ముందుకొచ్చింది. ఇటీవలే జాకీ భగన్నాని పెళ్లి చేసుకుంది. అప్పుడే బ్రేకప్ చెప్పుకున్నారా? ఏంటి అని కంగారు పడకండి. రకుల్ జాకీక కంటే మరొకరి ముందుగానే మనసు ఇచ్చిందన్న సంగతి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆ విషయాన్ని రకుల్ చెబుతూనే ఆ బ్రేకప్



స్టోరీ కూడా రివీల్ చేసింది. జాకీ నా జీవితంలో కి రాకముందు నాకు సంబంధాల విలువ తెలియదు. గతంలో ఓ వ్యక్తితో రిలేషన్ షిప్ లో ఉన్నాను. ఇద్దరం కలసి ఓ రెస్టారెంట్ కి వెళ్లాం. అతడు నా కోసం వేయించిన ఆహారం తీసుకొచ్చాడు. అది నాకు నచ్చలేదు. దీంతో వెంటనే అతడికి బ్రేకప్ చెప్పాను. ఆహారం విషయంలో నాకంటూ కొన్ని కండీషన్లు ఉన్నాయి. వాటిని సంతృప్తి పరచలేని వ్యక్తి నా జీవితాన్ని ఎలా పరిపూర్ణం చేస్తాడు అనే అభద్రతా భావంతో అతడికి దూరమయ్యాను. ఆరోగం కోసం ఏడాది పాటే శాఖహార భోజనమే మానేసాను అని తెలిపింది. అయితే తొలి ప్రియుడికి రకుల్ ఇలా సరైన కారణం లేకుండా బ్రేకప్ చెప్పడం సరిగ్గా లేదంటూ నెటి జనులు అభిప్రాయపడుతున్నారు. పెద్ద పెద్ద తప్పులు చేస్తేనే ప్రేమించిన వాడి విషయంలో ప్రియురా ళ్లు క్షమించి వదిలేస్తున్నారు. అలాంటింది వేయించిన ఆహారం తెచ్చాడని బ్రేకప్ చెప్పడం సరైన చర్య కాదంటూ..ఈ విషయంలో తప్పు అంతా నీదే అంటూ రకుల్ మీదనే నెట్టేస్తున్నారు. అయినా ఇదంతా గతమనుకోండి.

# నల్లని చీరలో ఆయేషా గ్లామర్ ట్రీట్

టాలీవుడ్ లో కొత్త తరం తారగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న ఆయేషా ఖాన్, తన అందం, అభినయం, మరియు గ్లామర్ ప్రెజెన్స్ తో ప్రేక్షకుల మనసులు గెలుచుకుంది. బాలీవుడ్ లో మొదటగా అడుగు పెట్టినప్పటికీ, తెలుగులో చేసిన సినిమాల వల్ల క్రేజ్ మరింత పెరిగింది. మొదట్లో చేసిన కొన్ని సినిమాలు పెద్దగా వర్కౌట్ కాకపోయినా, ఆయేషా సోషల్ మీడియా ద్వారా తన గుర్తింపుని పెంచుకుంటూ ముందుకు సాగింది. ప్రస్తుతం ఆమె ఇన్ స్టాగ్రామ్, ట్విట్టర్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో యాక్టివ్ గా ఉండి, తన లేటెస్ట్ ఫోటోషూట్లతో నెటిజన్లను ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా, ఆమె ఇటీవల చీరలో చేసిన ఫోటోషూట్ ఫ్యాన్స్ ను ఆశ్చర్యపరిచింది. సాధారణగా గ్లామర్ పోజులతో ఫోటోలు షేర్ చేసే తారలకు విరుద్ధంగా, ఆయేషా చీరలో సింపుల్ అండ్ ఎలిగెంట్ లుక్ లో ఫ్యాన్స్ ను కట్టిపడేసింది. నల్లని చీరలో ఆమె ఇచ్చిన సాఫ్ట్ లుక్స్,



సింపుల్ హెయిర్ స్టైల్ నెటిజన్లను ఆకట్టుకోవడంతో పాటు, ఆమెను ఒక ట్రెండింగ్ సెలబ్రిటీగా నిలబెట్టాయి. అభిమానులను అలరించడమే కాకుండా, సినిమాల్లో తనకు తగ్గ పాత్రలు దొరకడం ద్వారా తక్కువ సమయంలోనే మంచి గుర్తింపును పొందింది. గ్లామర్ మాత్రమే కాదు, తన సహజమైన నటనతో కూడా ఆమె ఆకట్టుకుంటోంది. టాలీవుడ్ లో ప్రత్యేక ఫ్యాన్ బేస్ సృష్టించుకున్న ఆమె, రాబోయే కాలంలో మరిన్ని అవకాశాలు దక్కించుకుంటుందనే అంచనాలు వేస్తున్నారు. సినిమాల్లో ప్రాధాన్యత కలిగిన పాత్రలు కాకపోయినా, ప్రత్యేక సాంగ్స్ మరియు సైడ్ రోల్స్ లో నటిస్తూ ఆమె తన ప్రతిభను నిరూపించుకుంది. బాలీవుడ్ బిగ్ బాస్ సీజన్-17లో పాల్గొని మరింత ప్రజాదరణ పొందిన ఆయేషా, అక్కడ కూడా తన ప్రత్యేకతను చాటుకుంది. ప్రస్తుతం కొన్ని ప్రాజెక్టలలో బిజీ అయిన ఆమె, దుల్కర్ సల్మాన్ వంటి స్టార్ హీరోలతో కూడా నటిస్తోంది. అలాగే లిస్టులో వెబ్ సీరీస్ కూడా ఉన్నట్లు సమాచారం. మరి రాబోయే రోజుల్లో అమ్మడు ఇంకా ఎలాంటి అవకాశాలు అందుకుంటుందో చూడాలి.

Printed, Published & Owned by KOYALKAR RAM DAYANAND, Editor Koyalkar Swetha, Nigha Netram Telugu Daily. H.No. 2-10-91 & 92, Weekly Bazar, Boigally, Nizamabad, Telangana State, Printed at Swetha Offset Printers, H.No. 2-10-91 & 92, Weekly Bazar, Boigally, Nizamabad. e-mail : neeganethram@rediffmail.com. Cel No. 9440090053